RNI.No.TELTEL/2013/52694

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam




# వుదయం

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal

**రిపోర్టర్లు కావలెను...**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వుదయం తెలుగు దిన పత్రికకు రిపోర్టర్లుగా
పని చేయుటకు ఆసక్తిగల,
అనుభవజ్ఞులైన అభ్యర్థులు కావలెను.

- సిరికొండ అగస్టిన్
BA. L.L.B., M.C.J.
వుదయం ఎడిటర్

**సెల్: 9247698676**

సంపుటి : 13 | సంచిక : 164 | ఆదిలాబాద్ | గురువారం, అక్టోబర్ 23, 2025 | VOODAYAM Telugu Daily | వెల : రూ. 3.00 | పేజీలు : 12



## రాష్ట్రంలోని చెక్ పోస్టులన్నీ రద్దు

**– సీఎం రేవంత్ ఆదేశాలు**

హైదరాబాద్, రాష్ట్రంలోని అన్ని రహదారులపై రవాణా చెక్ పోస్టులను వెంటనే ఎత్తివేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని అమలు చేస్తున్నట్లు రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈరోజు సాయంత్రం 5 గంటలలోగా మూసివేతపై పూర్తి నివేదికను ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాలతో తక్షణమే చెక్‌పోస్టుల కార్యకలాపాలు నిలిపివేయాలని ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆకస్మిక ఆదేశాలు జారీ చేశారు. చెక్ పోస్టుల వద్ద ఉన్న సిబ్బందిని వెంటనే వేరే బాధ్యతల్లో వినియోగించుకోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. రహదారులపై వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని, చెక్ పోస్టుల వద్ద బోర్డులు, బ్యారికేడ్లు, తొలగించాలని డీటీవోలకు సూచించారు. చెక్‌పోస్టుల వద్ద ఉన్న రికార్డులు, పరికరాలు, ఫర్నిచర్‌ను డీటీవో కార్యాలయాలకు తరలించాలని ఆదేశించారు. అన్ని ఆర్థిక, పరిపాలనా రికార్డులను సరిచూసి భద్రపరచాలని ఆదేశించారు.

## గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్ గా తెలంగాణ

- లైఫ్ సైన్సెస్ రంగంలో మరో ముందడుగు
- నూతన ఆవిష్కరణలకు ఊతమిచ్చే వ్యూహాత్మక భాగస్వామ్యం
- ఆస్ట్రేలియా యూనివర్సిటీ 'ఆర్ఎంఐటీ'తో రాష్ట్ర ప్రభుత్వం ఎల్ వోఐ
- ఇన్నోవేషన్, ఆర్అండ్ డీ, నైపుణ్యాభివృద్ధిలో ద్వైపాక్షిక సహకారం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడి



హైదరాబాద్, అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్' గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా బుధవారం మెల్‌బోర్న్‌లోని ప్రముఖ యూనివర్సిటీ 'ఆర్ఎంఐటీ'తో రాష్ట్ర ప్రభుత్వం లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్ వోఐ)ను కుదుర్చుకుందని చెప్పారు. లైఫ్ సైన్సెస్ రంగంలో ఇన్నోవేషన్, పరిశోధన, అభివృద్ధి, ఉన్నత విద్య, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రెడీ టూ వర్క్ ఫోర్స్ తయారీ తదితర అంశాల్లో ద్వైపాక్షిక సహకారానికి ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. రేపటి జీనోమ్ వ్యాలీకి ఇది ఒక బ్లూ ప్రింట్ గా మార్గ నిర్దేశం చేస్తుందన్నారు. ఆసియాలోనే అగ్రగామిగా ఎదిగిన తెలంగాణ "లైఫ్ సైన్సెస్" ఆర్థిక వ్యవస్థను 2030 నాటికి 250 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 80 బిలియన్ డాలర్ల విలువ చేసే 2వేలకు పైగా జాతీయ, అంతర్జాతీయ దిగ్గజ ఫార్మా, బయోటెక్ కంపెనీలు ఇక్కడ ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. దేశంలో ఉత్పత్తయ్యే ఔషధాల్లో మన వాటా 40 శాతంగా ఉందన్నారు. ప్రపంచానికి అవసరమైన వ్యాక్సిన్లలో మూడింట ఒక వంతును మనమే అందిస్తున్నామన్నారు. 'ఎలీ లిల్లీ' లాంటి దిగ్గజ ఫార్మా సంస్థలు తెలంగాణ వైపు చూస్తున్నాయని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా తెలంగాణ యువతను లైఫ్ సైన్సెస్ రంగానికి అవసరమైన అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులుగా తీర్చే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుందన్నారు. త్వరలోనే ప్రత్యేకంగా తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తాజా ఒప్పందంలో భాగంగా ఉమ్మడి పీహెచ్‌డీ, స్టూడెంట్, ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం అందుబాటులోకి వస్తుందన్నారు. లైఫ్ సైన్సెస్ రంగంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేలా ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులను చేపడతామన్నారు. పరిశోధక విద్యార్థులు బిట్స్ హైదరాబాద్, ఆర్ఎంఐటీ యూనివర్సిటీలలో నిపుణుల మార్గ నిర్దేశంలో రీసెర్చ్ చేసే అవకాశం లభిస్తుందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఉమ్మడి అకడమిక్ కరిక్యులంను రూపొందించి విద్యార్థులను రేపటి అవసరాలకు అనుగుణంగా స్కిల్డ్ వర్క్ ఫోర్స్ గా తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో తెలంగాణ లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ సీఈఓ శక్తి నాగప్పన్, ఆర్ఎంఐటీ యూనివర్సిటీ డిప్యూటీ వైస్–ఛాన్సలర్ ప్రొఫెసర్ కేథరీన్ ఇట్సియోపౌలోస్ లెటర్ ఆఫ్ ఇంటెంట్ పై సంతకాలు చేశారు. తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పనిచేసే అవకాశం దక్కడం సంతోషంగా ఉందని ప్రొఫెసర్ కేథరీన్ ఇట్సియోపౌలోస్ అన్నారు. ఈ ఒప్పంద ద్వారా లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణ గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్ గా మారుతుందన్నారు.

## నేడు తెలంగాణ కేబినెట్ సమావేశం

**బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై కేబినెట్ కీలక నిర్ణయాలు తెసుకునే అవకాశం**

హైదరాబాద్, : గురువారం నాడు తెలంగాణ కేబినెట్ సమావేశం కానుంది. మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీ అవ్వనుంది. ఈ సమావేశంలో బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలపై కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకోనుంది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు, సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వం న్యాయ నిపుణుల కమిటీ వేసింది. న్యాయ నిపుణుల రిపోర్ట్ ప్రభుత్వానికి చేరింది. కేబినెట్ ఈ నివేదికపై చర్చించి బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై సమాలోచనలు జరపనుంది. అంతేకాదు.. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న ఇద్దరు పిల్లల నిబంధనను రద్దు చేసే ఆర్డినెన్స్‌కు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. ఎస్ఎల్‌బీసీ పునరుద్ధరణ, కాళేశ్వరం పునరుద్ధరణ,
తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల నిర్మాణం సహా పలు నీటి పారుదల ప్రాజెక్టులపై కేబినెట్ చర్చించనుంది.

## లాలూతో అశోక్ గహ్లోత్ భేటీ



బిహార్ :అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై ప్రతిపక్ష 'మహాగఠ్‌బంధన్'లో ఏకాభిప్రాయం కుదరలేదు. కొన్ని స్థానాల్లో కూటమికి చెందిన కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్ష పార్టీల మధ్యే పోటీ నెలకొంది. ఈ క్రమంలోనే ఆర్జేడీతో నెలకొన్న విభేదాలకు తెరదించేందుకు కాంగ్రెస్ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గహ్లోత్ రంగంలోకి దిగారు. బుధవారం ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్‌తో సమావేశమయ్యారు. "బిహార్ లో ప్రతిపక్ష కూటమి గెలవడం ఎంతో ముఖ్యం.
మహారాష్ట్రలో 'మహావికాస్ అఘాడీ' ఓటమి తర్వాత వస్తున్న ఎన్నికలు ఇవి. బిహార్ ఎన్నికలు జాతీయ రాజకీయాలను ప్రభావితం చేస్తాయి. సమాజంలో విభజనలకు కారణమైన, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిన ఎన్డీయేను ఓడించాల్సిన అవసరం ఉంది. బిహార్ ప్రజలు ఈ పని చేయగలరు" అని లాలూతో భేటీ అనంతరం గహ్లోత్ మీడియాతో మాట్లాడారు. గురువారం మీడియా సమావేశం నిర్వహించనున్నామని, అన్ని ప్రశ్నలకు సమాధానం చెబుతామన్నారు. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటించేందుకు కాంగ్రెస్ సిద్ధంగా ఉందా? అనే ప్రశ్నకు నేరుగా సమాధానం ఇచ్చేందుకు గహ్లోత్ నిరాకరించారు. "రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్ మధ్య మంచి అనుబంధం ఉంది. బిహార్‌లో ఇటీవల నిర్వహించిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో ఇది నిరూపితమైంది. ఇరునేతలు రాష్ట్రమంతా పర్యటించారు. వారు సరైన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటారు" అని తెలిపారు.

ఎన్డీయే కూటమిలో తమకన్నా ఎక్కువ విభేదాలు ఉన్నాయని విమర్శించారు. బిహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 143 సీట్లలో ఆర్జేడీ, 61 సీట్లకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించాయి. దాదాపు ఐదు నియోజకవర్గాల్లో ఈ రెండు పార్టీల అభ్యర్థులూ బరిలో ఉన్నారు. మరో మూడు సీట్లలోనూ సొంత కూటమి అభ్యర్థులపై హస్తం పార్టీ పోటీకి దిగింది. అంతకుముందు పట్నా విమానాశ్రయంలో గహ్లోత్ ఈ వ్యవహారంపై మాట్లాడుతూ.. ఐదు– పది సీట్లలో స్నేహపూర్వక పోటీ పెద్ద విషయం కాదని వ్యాఖ్యానించారు. లాలూతో భేటీ అనంతరం.. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ నాటికి సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొనడం గమనార్హం.

## సైన్స్, ఆవిష్కరణలకు కేంద్రం హైదరాబాద్

- యువ ఆవిష్కర్తలు దూసుకు వెళ్తున్నారు
- ప్రపంచస్థాయి వ్యవస్థల రూపకల్పనకు కేంద్రంగా తెలంగాణ
- పరిశోధనా సంస్థలు, పెట్టుబడిదారులకు స్వాగతం
- ప్రపంచ స్థాయి మౌలిక వసతుల కల్పనకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ప్రకృతిని మించి పోవడం కాదు దాని నుంచి నేర్చుకోవడం మన కర్తవ్యం



హైదరాబాద్ :పండిట్ జవహర్లాల్ నెహ్రూ కాలం నుంచి హైదరాబాద్ సైన్స్ మరియు ఆవిష్కరణలకు కేంద్రంగా విరాజిల్లుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం కన్వెన్షన్ లో నిర్వహించినఫ్రాంటియర్స్ 2025 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ స్పేస్ ఎకానమీ, బయోమిమిక్రి ఎక్స్‌ట్రాటెరెస్ట్రియల్ రిసోర్స్ సదస్సులో ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం ప్రసంగించారు. ప్రపంచ స్థాయి వ్యవస్థల రూపకల్పనకు కేంద్రంగా తెలంగాణ నిలిచింది అన్నారు. హైదరాబాద్ కు ప్రపంచ స్థాయి పరిశోధన సంస్థలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పక్షాన ఆహ్వానం పలుకుతున్నామని తెలిపారు. ప్రపంచ స్థాయి మౌలిక వసతుల కల్పనకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది అన్నారు. హైదరాబాదు నగరానికిప్రపంచ నలుమూలల నుంచి విచ్చేసిన శాస్త్రవేత్తలు, పరిశ్రమ నాయకులు, ఆవిష్కర్తలకు ఆయన స్వాగతం తెలిపారు. శాస్త్ర సున్నితత్వం మరియు కల్పనాత్మకత కవిత్వం కలిసిన ఈ నగరం ఎప్పుడూ సృజనాత్మకతకు నిలయంగా నిలిచింది అన్నారు. బయోఇన్స్పైర్డ్ ఫ్రాంటియర్స్ 2025జీవశాస్త్రం, సాంకేతికత, అంతరిక్ష అన్వేషణల మధ్య జరుగుతున్న ఈ ప్రపంచ స్థాయి సంభాషన భారత శాస్త్రీయ గమ్యాన్ని అర్థ శతాబ్దానికి పైగా నిశ్శబ్దంగా మలిచిన ఈ నగరంలో జరుగుతుండటం గర్వకారణం అన్నారు. హైదరాబాద్‌కు సైన్స్ తో ఉన్న అనుబంధం లోతైనది మరియు చిరకాల మైనది అన్నారు. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో ఈ నగరంలో అనేక శాస్త్రీయ సంస్థలు పునాది వేసుకున్నాయి అని వివరించారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ హైదరాబాద్‌ను భారతదేశపు "ఆకాశనేత్రం"గా మార్చింది. ఉపగ్రహ చిత్రాలను వ్యవసాయం, నీటి వనరులు, విపత్తు నిర్వహణలో వినియోగిస్తూ మార్గదర్శిగా నిలిచిందని తెలిపారు. రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ ఇక్కడ వంటి ప్రతిష్ఠాత్మక ప్రయోగశాలలను స్థాపించి, దేశానికి క్షిపణి, పదార్థ సైన్స్ లో నైపుణ్యాన్ని అందించిన తరతరాల శాస్త్రవేత్తలను తీర్చిదిద్ది ఘనత హైదరాబాద్ కు సొంతం అన్నారు. ఇవే కాకుండా భారత్ డైనమిక్స్ లిమిటెడ్ , ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వంటి పబ్లిక్ రంగ సంస్థలు కూడా ఇక్కడే ఎదిగి, దేశానికి విమానయాన, లోహశాస్త్రం, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో బలమైన పునాది వేశాయి అని తెలిపారు.
ఈ దశాబ్దాల ప్రజా పెట్టుబడి, శాస్త్రీయ స్ఫూర్తి కలయికతో రూపుదిద్దుకున్న ఈ పరిసర వ్యవస్థే హైదరాబాద్‌కు ప్రత్యేకమైన "సైన్స్ డీఎన్ఏని ఇచ్చింది,అది క్రమశిక్షణతో కూడినది, సృజనాత్మకమైనది, నిశ్శబ్దంగా కానీ స్పష్టమైన ఆశయాలతో కూడింది అన్నారు. ఈ వారసత్వాన్ని నేటి యువ ఆవిష్కర్తలు కొత్త ఉత్సాహంతో ముందుకు తీసుకెళ్తున్నారని డిప్యూటీ సీఎం ఆనందం వ్యక్తం చేశారు. స్కైరూట్ ఏరోస్పేస్, ఇక్కడే హైదరాబాద్‌లో జన్మించి, భారతదేశంలోనే ప్రైవేట్ రంగం ద్వారా రాకెట్ ప్రయోగాలు సాధ్యమని నిరూపించింది. వారి విజయం కేవలం ఉత్పత్తి కాదు, ఒక కొత్త ఎకోసిస్టమ్‌ను సృష్టించింది: ప్రొపల్షన్ ఇంజనీర్లు, కాంపోజిట్ నిపుణులు, స్పేస్ సరఫరాదారులు అనే కొత్త తరాన్ని పెంచింది అని వివరించారు. ధ్రువ స్పేస్, మరో హైదరాబాద్ ఆధారిత సంస్థ, ఉపగ్రహ రూపకల్పన నుండి తయారీ, ప్రయోగం, గ్రౌండ్ స్టేషన్‌ల వరకు సంపూర్ణ పరిష్కారాలను చూపుతుంది, మనం ప్రపంచ స్థాయి వ్యవస్థలను మన రాష్ట్రంలోనే రూపకల్పన చేయగలమని చూపిస్తోంది అని తెలిపారు. ఇవన్నీ చుట్టూ రోబోటిక్స్, పదార్థ శాస్త్రం, 3%ణ% ప్రింటింగ్ రంగాల్లో కొత్తగా ఎదుగుతున్న సంస్థలు కలిసి భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థకు కొత్త రూపాన్ని ఇస్తున్నాయి అన్నారు. ఇవి ఒంటరిగా పని చేయడం లేదు. ఇవి హైదరాబాద్‌లోని వంటి సంస్థలతో బలమైన అనుసంధానం కలిగి ఉన్నాయి అని తెలిపారు. ఇదే తెలంగాణా మోడల్ ఆఫ్ ఇన్నోవేషన్,ప్రభుత్వ సంస్థలు పునాది వేస్తాయి, స్టార్టప్‌లు దానిపై నిర్మిస్తాయి, విశ్వవిద్యాలయాలు ప్రతిభను పెంపొందిస్తాయి అని వివరించారు. ఈరోజు హైదరాబాద్ భారతదేశంలోని అత్యంత విభిన్న సాంకేతిక ఎకోసిస్టమ్‌లలో ఒకటిగా నిలిచింది , లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, రక్షణ, ఇప్పుడు అంతరిక్ష సాంకేతికతలో ప్రపంచ నాయకులకు ఆతిథ్యం ఇస్తోంది అన్నారు. అదిబట్లలో ఏరోస్పేస్ మాన్యుఫాక్చరింగ్, ఈ–సిటీలో ఎలక్ట్రానిక్స్, జీనోమ్ వ్యాలీలో ఫార్మా, మరియు షంషాబాద్ సమీపంలోని మొబిలిటీ వ్యాలీలో రవాణా సాంకేతికతలు. ప్రతి క్లస్టర్‌లో మూడు విలువలు ప్రధానంగా ఉంటాయి. ఆవిష్కరణ,తయారీ, సుస్థిరత అని వివరించారు. అనుబంధ సౌకర్యాలు, టెలీమెట్రీ కేంద్రాలు, ఇన్క్యుబేషన్ స్థలాలు హైదరాబాద్‌ను భవిష్యత్తు అంతరిక్ష మిషన్లకు ప్రధాన కేంద్రంగా నిలిపాయి అని డిప్యూటీ సీఎం తెలిపారు. అవి చంద్రయానం కావొచ్చు, భూమి పరిశీలన కావొచ్చు, లేదా అంతరిక్ష వనరుల వినియోగం కావొచ్చు అన్నారు. ఈ కాన్ఫరెన్స్ థీమ్"బయోఇన్స్పైర్డ్ ఫ్రాంటియర్స్"మనకు ఒక లోతైన విషయం గుర్తు చేస్తుంది:ప్రకృతే అసలు ఇంజనీర్ అని డిప్యూటీ సీఎం విశ్లేషించారు. అత్యంత అందమైన రెక్కలు, కవచాలు, న్యూరల్ నెట్వర్క్ల వంటివి ప్రకృతిలో ఇమిడి ఉన్నాయి అన్నారు. మన కర్తవ్యం ప్రకృతిని మించి పోవడం కాదు, దానినుంచి నేర్చుకోవడం అని వివరించారు.
తెలంగాణా ప్రభుత్వం ఈ తత్వాన్ని తన అభివృద్ధి దృక్పథంలో భాగం చేస్తోంది, బయోమిమెటిక్ డిజైన్, గ్రీన్ బిల్డింగ్ కోడ్స్, నీటి నిర్వహణ, శుద్ధ ఇంధనం రంగాల్లో దీన్ని ప్రోత్సహిస్తోంది అని వివరించారు.
అంతరిక్షంలోకి విస్తరించేప్పుడు కూడా మనం ఈ వినయాన్ని తీసుకెళ్లాలి, ఆవిష్కరణ, సంరక్షణ రెండూ కలిసి రెండు కాళ్ళ మాదిరిగా నడవాలి అన్నారు. భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ రాబోయే దశాబ్దంలో విపరీతంగా పెరగబోతోంది. ఆ వృద్ధికి తెలంగాణా లాంచ్‌ప్యాడ్‌గా ఉండాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది అన్నారు. ప్రపంచంలోని పరిశోధనా సంస్థలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలను హైదరాబాద్‌కి ఆహ్వానిస్తున్నాము అన్నారు. సహాయక విధాన వాతావరణం, ఇన్క్యుబేషన్ సపోర్ట్, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది అన్నారు. హైదరాబాద్ ఈరోజు కేవలం ఒక గమ్యం కాదు, ఒక మనస్తత్వం: విచారణాత్మకమైనది, ఆత్మవిశ్వాసంతో కూడినది అన్నారు. ఈ రోజు ఇక్కడ మొదలైన చర్చలు భవిష్యత్తులో భూమి మీదా, అంతరిక్షంలోనూ మంచిని నిర్మించే భాగస్వామ్యాలుగా మారాలని కోరుకుంటున్నాను అన్నారు. తెలంగాణా ఎల్లప్పుడూ ప్రభుత్వ సంస్థలను ప్రేరేపించే, స్టార్టప్‌లు ఆవిష్కరించే, ప్రపంచ శాస్త్రం కలిసే ప్రదేశంగా ఉంటుందని స్పష్టం చేశారు. జ్ఞానం మరియు అన్వేషణ మధ్య వంతెనగా, భూమి మరియు ఆకాశం మధ్య సేతువుగా హైదరాబాద్ మహానగరం ఎప్పటికీ నిలవాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. సమావేశంలో ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్, సీఈవో ఎం అబ్బాస్, లీడ్ స్పాన్సర్ సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిష్ఠాత్మక గ్లోబల్ సదస్సుకు కేటీఆర్‌కు ఆహ్వానం

హైదరాబాద్, తెలంగాణ మాజీ ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి శాఖామాత్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మరో అరుదైన గౌరవం దక్కింది. శ్రీలంకలోని కొలంబోలో జరగబోయే ప్రతిష్ఠాత్మక 'గ్లోబల్ ఎకనామిక్ అండ్ టెక్నాలజీ సమ్మిట్ 2025' సదస్సులో ఆయనకు కీలకోపన్యాసం చేసేందుకు ఆహ్వానం అందింది. ఈ సదస్సు నవంబర్ 10 నుంచి 12, 2025 వరకు కొలంబోలోని 'ది కింగ్స్‌బరీ హోటల్'లో జరగనుంది. శ్రీలంక సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ తరఫున, శ్రీలంక డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎ.యు.ఎల్.ఎ. హిల్మీ ఈ ఆహ్వానాన్ని కేటీఆర్‌కు పంపారు. ఇన్నోవేషన్, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ , మరియు ప్రాంతీయ సహకారం వంటి అంశాలపై చర్చించేందుకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న విధాన రూపకర్తలు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నాయకులను ఈ సదస్సు ఒకే వేదికపైకి తీసుకురానుంది. డాక్టర్ హిల్మీ తన లేఖలో... ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి రంగాలలో తెలంగాణను భారతదేశంలోనే అత్యంత శక్తివంతమైన కేంద్రంగా తీర్చిదిద్దడంలో కేటీఆర్ పోషించిన 'విశిష్ట కేటీఆర్ నాయకత్వాన్ని, పాత్రనును కొనియాడారు. పెద్ద ఎత్తున పారిశ్రామిక, సాంకేతిక కార్యక్రమాలను ఆయన నడిపించిన విధానం... అనేక వర్ధమాన ఆర్థిక వ్యవస్థలకు ఒక ఆదర్శంగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ మహాసభ జయప్రదం చేయండి

## అంగడాల అమరయ్య, మధిర మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు

మధిర,అక్టోబర్ 22(వుదయం ప్రతినిధి): తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మధిర నియోజకవర్గ స్థాయి మహాసభ చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో అక్టోబర్ 26 ఆదివారం ఉదయం 10 గంటలకు జరగనున్నాయి. ఈ మహాసభలకు మధిర మండలం నుండి ఎంపిక చేయబడ్డ వ్యవసాయ కూలీ మేస్త్రీలు కార్మిక సంఘ నాయకులు హాజరై జయప్రదం చేయవలసిందిగా మధిర మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు అంగడాల అమరయ్య, షేక్ ఉద్దండు సాహెబ్ విజ్ఞప్తి చేశారు. ఈ మహాసభలో ప్రధానంగా వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఉపాధి హామీ కూలి రేట్లు పెండింగ్ బిల్లులు, ప్రతి పేద మహిళలకు 2500 రూపాయలు నెలకు, కూలి బంధు పథకం సంవత్సరానికి 12000, కూలి బీమా 10 లక్షల రూపాయలు ఇలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్



చేయనున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి కేటాయిస్తున్న నిధులు తగ్గిస్తున్నారని వాటిని పెంచాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలకు ప్రతి గ్రామం నుండి కూలి మేస్త్రీ పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. స్థానిక బోడెపుడి భవన్లో జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మండల నాయకులు బాజినేని వెంకట నరసయ్య,మేదర రవి ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ఆదరణ సేవా ఫౌండేషన్ అనాధ ఆశ్రమంలో అన్నదానం



మధిర,అక్టోబర్ 22(వుదయం ప్రతినిధి): మధిర సేవా సమితి ఆధ్వర్యంలో ఆదరణ సేవా ఫౌండేషన్ అనాధ ఆశ్రమంలో బెజవాడ సత్యహరి వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు బెజవాడ బాబ్జి, అరుణ, రిషిత ఆర్థిక సహకారంతో మధిర పట్టణంలోని నిస్సి హరిణి ఆధ్వర్యంలోని ఆదరణ సేవా ఫౌండేషన్ అనాధ ఆశ్రమంలోని అనాధలకు,వృద్ధులకు,మతిస్థిమితం లేని వారికి అన్నధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధిరసేవాసమితి అధ్యక్షులు పల్ల పోతు ప్రసాదరావు మాట్లాడుతూ మధిర సేవా సమితి ఆధ్వర్యంలో గత 25 సంవత్సరాలు నుండి సేవా కార్యక్రమాలు చేస్తున్నాం అన్నారు. మధిర సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేస్తూ ఎంతోమందికి సేవా కార్యక్రమాలు చేసేలా స్ఫూర్తి నివ్వడం జరిగిందన్నారు. మధిర సేవా సమితి ఆధ్వర్యంలో మునుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూపేదలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ వారి పుట్టినరోజులు, పెళ్లిరోజులు కార్యక్రమాలకు అన్నదాన కార్యక్రమాలు చేస్తూ లేని వారికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధిర సేవా సమితి అధ్యక్షులు పల్లపోతు ప్రసాదరావు, సామినేని రామనాథం,చల్లా చెడే రామ కోటేశ్వరరావు,చలువాది కృష్ణమూర్తి (ఆర్టీసీ రిటైర్డ్),ఓట్టే సైదులు, గాలి ప్రసాద్, వందనపు శ్రీనివాసరావు, నేరెళ్ల శ్రీనివాసరావు, మాచర్ల శ్రీనివాసరావు, కొత్తూరు నరసింహారావు, జల్లా రాధాకృష్ణమూర్తి, కాజా శ్రీనివాసరావు,ఎస్కే ఖాదర్ ఆర్టీసీ రిటైర్డ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట కార్యాచరణ అమలు

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- పట్టణాలలో ప్రధాన రోడ్ల గుంతలను పూడ్చి వేయాలి
- వైరాలో రోడ్డుపై సీవరేజి రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి
- పాఠశాలల వద్ద స్కూల్ జోన్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు
- ప్రమాదాల నియంత్రణకు ఎన్.హెచ్. పై బ్లాక్ స్పాట్స్ గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి
- 8వ జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషన

ఖమ్మం,అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి): రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 8వ జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలోని పట్టణ ప్రాంతాలలో స్థానిక మున్సిపాలిటీలు బాధ్యతలు తీసుకొని రోడ్ల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం నగరంలో 10 రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి రోడ్ల గుంతలను పూడ్చి వేయడం జరిగిందని తెలిపారు. నేషనల్ హైవే 365బిబి ఖమ్మం నగరానికి బైపాస్ సెక్షన్ గా ఉంటుందని, ఖమ్మం బైపాస్ వద్ద మరమ్మత్తు పనులు చేపట్టాలని, అక్కడ రోడ్డు భద్రత ప్రమాణాల క్రింద రంబుల్ స్ట్రిప్స్, రేడియం స్టిక్కర్, స్పీడ్ బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. ఖమ్మం -కోదాడ, వరంగల్ జంక్షన్ పరిధిలో ఉన్న వైరా లో ఒక అపార్ట్ మెంట్ రోడ్డుపై సివరేజి వదలడం వల్ల చాలా ఇబ్బందులు ఎదురవు తున్నాయని తెలుసుకున్న కలెక్టర్ వెంటనే సంబంధిత యాజమాన్యాలకు నోటీస్ జారీ చేయాలని, 15 రోజులలో అక్కడ యాజమాన్యం సొంత డబ్బులతో ఇంకుడు గుంత నిర్మించి, రోడ్డుపై సీవరేజి రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మున్సిపల్, ఎన్.హెచ్, రెవెన్యూ, పోలీస్, ఆర్ అండ్ బీ అధికారులు సంయుక్తంగా అక్టోబర్ 24న బైపాస్ నుంచి కలెక్టరేట్ వరకు ఫీల్డ్ విజిట్ చేపట్టి తీసుకోవాల్సిన చర్యలపై అక్టోబర్ 29 నాటికి రిపోర్ట్ అందించాలని



కలెక్టర్ ఆదేశించారు జాతీయ రహదారులకు సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లను బలోపేతం చేయడానికి అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రమాదాలు జరిగిన సమయంలో గోల్డెన్ అవర్ లో అవసరమైన చికిత్స వెంటనే అందించి మనుషుల ప్రాణాల సంరక్షణకు చర్యలు చేపట్టాలని అన్నారు. హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, జిల్లాలో 17 హిట్ అండ్ రన్ కేసులు జరిగాయని, వీరికి బీమా ప్రకారం పరిహారం అందేలా చూడాలని, మన దగ్గర ఎక్కడ పెండింగ్ లేకుండా చూడాలని అన్నారు. పోలీసు కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ ఎన్.హెచ్. కనెక్టింగ్ రోడ్డు, టీ-జంక్షన్ వద్ద ఎన్.హెచ్. తరపున రంబుల్ స్ట్రిప్స్, ఆర్ అండ్ బి/ పంచాయతీ రోడ్ల పై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ నేషనల్ హైవే వద్ద జరిగిన ప్రమాదాల దృష్ట్యా బ్లాక్ స్పాట్స్ గుర్తించి వాటి సమీపంలో గల ఆసుపత్రు లకు మ్యాచ్ చేయాలని, అక్కడ ట్రామా సెంటర్ ప్రాథమిక సేవలు అందేలా చూడాలని అన్నారు. ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ వర్షాల అనంతరం నగర కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రోడ్లపై ఏర్పడిన 470 గుంతలను గుర్తించి ఇప్పటి వరకు 350 పూడ్చి వేత పూర్తి చేశామని అన్నారు. ఈ సమావేశంలో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# 25 లక్షల రూపాయలతో దాసంగాల మంటపం నిర్మాణం

## దాత హైదరాబాదు వాస్తవ్యులు టి శివకుమార్



గద్వాల, అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల నియోజకవర్గం కె.టి దొడ్డి మండలంలోని వెంకటాపురం గ్రామంలోని పాగుంట స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి భక్తులకు స్వామి సన్నిధిలో అలివేలు మంగమ్మ దాసంగల మంటపం ప్రారంభించడం జరిగింది. జోగులాంబ గద్వాల జిల్లా కేటిదొడ్డి మండలం శ్రీ పాగుంట వెంకటేశ్వర స్వామి దాసంగల మండపానికి వెంకటాపురం మురళి బంధువు అయిన టి.శివకుమార్ హైదరాబాద్ మియాపూర్ వాస్తవ్యులు పాగుంట వెంకటేశ్వర స్వామి అలివేలు మంగమ్మ దాసంగాల మంటపానికి 25 లక్షల రూపాయలతో దాసంగాల మంటపం కట్టించడం జరిగినది. అట్టి మండపాన్ని బుధవారం రోజు శ్రీ పాగుంట వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా విరాళం అందించినటువంటి టి. శివకుమార్ ప్రారంభించడం జరిగినది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా రమ్య ఇండస్ట్రీ అధినేత కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండ్ల రాజశేఖర్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ పాగుంట వెంకటేశ్వర స్వామి సన్నిధిలో ఆలయ కమిటీ సభ్యులు గాజులపాడు శేషురెడ్డి, తిమ్మారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, పద్మా రెడ్డి, నరేందర్ రెడ్డి, భీమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# శివశక్తి సంస్థ ఆధ్వర్యంలో ఎంబిబిఎస్ విద్యార్థినికి సన్మానం



జన్నారం, అక్టోబర్ 22(వుదయం విలేఖరి) ఎంబీబీఎస్ సేటు సాధించిన విద్యార్థినిని శివశక్తి సామాజిక సంస్థ ఆధ్వర్యంలో సన్మానించారు. జన్నారం మండలంలోని రోటి గూడ గ్రామానికి చెందిన పులిశెట్టి నాగేష్ కుమార్తె అశ్రుత నీట్ యూజి పరీక్షలో మంచి ప్రతిభ కనబరిచి ఎంబిబిఎస్ సీటు సాధించింది. ఈ సందర్భంగా బుధవారం రోజున ఆ గ్రామ శివశక్తి సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో అశ్రుతకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ.... విద్యార్థులను ప్రోత్సహించడమే తమలక్ష్యమని బాగా చదువుకొని తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ పాలాజీ శ్రీనివాస్, అడ్మిన్ సేపురి గోపాల్, యువకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# కస్తూర్బా గాంధీ కళాశాల్లో పిఈటి ఉద్యోగంకు దరఖాస్తులు ఆహ్వానం

## - కెజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శారద

అన్నపు రెడ్డిపల్లి ,అక్టోబర్ 22:( వుదయం ప్రతినిధి) : అన్నపురెడ్డిపల్లి:అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ కళాశాల్లో అతిధి వ్యాయామ ఉపాధ్యాయురాలు(పిఈటి)ఉద్యోగంకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల స్పెషల్ ఆఫీసర్ శారద బుధవారం తెలియజేశారు. విద్య సంవత్సరం 2025 -26 గాను తాత్కాలిక ప్రాతిపదికన వ్యాయామ ఉపాధ్యాయురాలు ఉద్యోగంకు ఆసక్తిఉన్న మహిళా అభ్యర్థినిలు కళాశాల్లో దరఖాస్తు చేసుకోవాలని. అర్హతగల మహిళ అభ్యర్థులు. వ్యక్తిగత,విద్యార్హతలు వివరాలతో కూడిన దరఖాస్తులు కళాశాలలో ఇవ్వగలరు. మెరిట్ ఆధారం గా నియామక ప్రక్రియ జరుగుతుంది అని సూచించారు. దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ అక్టోబర్ 24(శుక్రవారం)సాయంత్రం గంటలు 04-00 గంటలు వరకు అన్నారు. ఈ ఉద్యోగ అవకాశాన్ని నిరుద్యోగినీలు సద్వినియోగం చేసుకోవాలని. మరిన్ని వివరాలకు మొబైల్ నెంబర్ 6300828355 లో సంప్రదించాలని కోరారు...

# ఘనంగా కొమరం భీమ్ జయంతి



దమ్మపేట అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి): కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం దమ్మపేట లో ఘనంగా కొమరం భీమ్ 124 వ జయంతి సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో దమ్మపేట మండల కేంద్రంలో కొమరం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర కోశాధికారి కొర్సా వెంకటేష్ దొర, మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల కోసం ఉద్యమించిన కొమరం భీమ్ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలు చేస్తామని ఆదివాసీల హక్కులు చట్టాలను రక్షించాలని అందుకు ఆదివాసీలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆదివాసి సంఘ నాయకులు కురసం చిన్నరాజు,ఊకే రాంబాబు, కొర్సా వీధరాజు పెనుబల్లి రమేష్ తాటి సాయి, ధారబోయిన నాగబాబు, మీడియం కృష్ణ కూరం శ్రీను, నాయక పోడు సంఘ నాయకులు గుళ్ల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# మామిల్లగూడెం బ్రాంచ్‌లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్" లో భాగంగా మెగా డెంటల్ క్యాంప్

ఖమ్మం ,అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి): శ్రీ చైతన్య స్కూల్, మామిల్లగూడెం బ్రాంచ్‌లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్" లో భాగంగా మమతా డెంటల్ హాస్పిటల్ సహకారంతో మెగా డెంటల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థుల్లో దంత ఆరోగ్యంపై అవగాహన కల్పించడం.

మమతా డెంటల్ హాస్పిటల్‌కు చెందిన నిపుణులైన వైద్యుల బృందం ప్రతి విద్యార్థికి ఉచిత దంత పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సూచనలు అందించారు. వైద్యులు విద్యార్థులకు సరైన పళ్ల తోమే విధానం,ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు, మరియు దంత సమస్యలను నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఉత్సాహంగా స్పందించారు. పాఠశాల యాజమాన్యం తరఫున మమతా డెంటల్ హాస్పిటల్



వైద్య బృందానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్ ,డైరెక్టర్ శ్రీవిద్య, ఏజిఎం చేతన్, ప్రిన్సిపల్ నీరజ, ఎకడమిక్ కోఆర్డినేటర్ కృష్ణారావు, డీన్ ఉమా, ప్రైమరీ ఇన్చార్జి రేణుక విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు .

# పాఠశాలల్లో ఉన్న పెండింగ్ అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ
- అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనుల పురోగతిపై సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్



ఖమ్మం,అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి): పాఠశాలల్లో పెండింగ్ లో ఉన్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనుల పురోగతిపై బుధవారం అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జిల్లాలో 44 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. పెండింగ్ పనులు పూర్తి చేసి ఎంబీ రికార్డులు వివరాలు నమోదు చేస్తే వెంటనే బిల్లులు విడుదల చేయడం జరుగుతుందని అన్నారు. 44 పాఠశాలల్లో పనుల పురోగతి వివరాలను పాఠశాలల వారిగా రివ్యూ చేసి అదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు. అక్టోబర్ నెలాఖరు వరకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను తప్పనిసరిగా పూర్తి చేయాలని అన్నారు. గ్రామాలలో పాఠశాలకు నీరు సరఫరా లేని పక్షంలో సమీపంలో మిషన్ భగీరథ పైప్ లైన్ నుంచి కనెక్షన్ అందించాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల సకాలంలో పూర్తి కాని పక్షంలో సంబంధిత పాఠశాల సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారుల వేతనంలో కోత విధించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో విద్యా శాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సి.హెచ్. రామకృష్ణ, ఎంపీడీఓలు, ఎం.ఈ.ఓ.లు, సంబంధిత పాఠశాలల హెడ్ మాస్టర్ లు, ఏఈలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లకు మహర్దశ 316 కోట్ల 45 లక్షల నిధులు మంజూరు

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గద్వాల , అక్టోబర్: 22 (వుదయం ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బుధవారం రోజు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపక్ష నేతలు ఎన్ని విమర్శలు చేసిన గద్వాల అభివృద్ధి కోసమే నా మొదటి ప్రాధాన్యత అంటూ ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి తెలిపారు ప్రభుత్వం నియోజకవర్గానికి రోడ్ల మరమ్మత్తుల కోసం 300 కోట్లు కేటాయించిందని ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. రోడ్లు భవనాల శాఖ నుండి నియోజకవర్గంలోని రోడ్లకు రూ.162.45 కోట్లు కేటాయించగా పంచాయితీ రాజ్ శాఖ నుండి రూ.154 కోట్లు కేటాయించారని మొత్తం రూ.316.45 కోట్ల నిధులు రావడం పై సంబంధిత మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. మొదటి సారిగా హం ( హెచ్ ఏఎం) ఆధునిక పద్ధతిలో రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. త్వరలోనే గద్వాల నియోజకవర్గంలో నర్సింగ్ కళాశాల ప్రారంభంతో పాటు మెడికల్ కళాశాలకు భూమి పూజ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో సుమారు 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని వాటికి సరిపడా గోడౌన్ల నిర్మాణం చేపట్టి రైతులు నిల్వ చేసుకోవడానికి అందుబాటులోకి రావడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గడ్డం కృష్ణ రెడ్డి జములమ్మ ఆలయ కమిటీ చైర్మన్ వెంకట్రాములు, మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్, విజయ్ మాజీ జడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు బాబర్ మురళి నాగులు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా శిశు సంక్షేమ శాఖ వారి అవగాహన కార్యక్రమం

గద్వాల ,అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి): గద్వాల మండలం జమ్మిచ్చేడు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మహిళా శిశు సంక్షేమ శాఖ వారి జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహాలను నివారించడం, బాల కార్మికులను నిర్మూలించడం వివిధ హింసల నుండి పిల్లలను రక్షించడం పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా బాలల సంరక్షణ అధికారి నరసింహులు హాజరై మాట్లాడుతూ బాలలందరు శ్వేతాయుత వాతావరణంలో పెరగాలని, చిన్న వయస్సులో పెళ్ళిలు చేయడం చట్ట రీత్యా నేరమని, బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే సమస్యలు, నష్టాలు గురించి అవగాహన కల్పించారు బాల కార్మిక వ్యవస్థ వలన పిల్లల భవిష్యత్తు నాశనం అవుతుందని అందుకే పిల్లలను బడికి క్రమం తప్పకుండా హాజరు కావాలని అన్నారు. చిన్న వయసు నుండి లక్ష్యం




పెట్టుకొని చదవాలని, చదువు ఒక్కటే మన భవిష్యత్తును మార్చగలదు అని అన్నారు. బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్ మాట్లాడుతూ బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టం గురించి తెలియజేస్తూ లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించేందుకు ఈ చట్టం రూపొందించారని,ఈ చట్టంలో బాలబాలికలకు సమానమైన రక్షణ లభిస్తుంది, ఇటీవల కాలంలో ప్రతి చోట ఎదురవుతున్న సమస్య లైంగిక వేధింపులు, కాబట్టి బాలలు ఎవరి నుంచైనా ఇలాంటి వేధింపులకు గురవుతున్నట్లు తెలిస్తే వెంటనే 100 లేదా 1098కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి అని అన్నారు. సామాజిక మధ్యమం వల్ల పిల్లలు చెడు అలవాట్లుకు లోనై అవకాశం ఉన్నది కాబట్టి బాలల అందరూ కూడా కేవలం మంచి విషయాల కోసం మాత్రమే ఫోన్స్ ఉపయింగించుకోవలని తెలిపారు ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్, పాఠశాల హెడ్ మాస్టర్ గణేష్, పోలీస్ కానిస్టేబుల్స్ విజయ్ రవి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయం - అంతర్జాతీయం

## సద్గురు ఫేక్ వీడియోలపై ఢిల్లీ హైకోర్టు సీరియస్



న్యూఢిల్లీ: ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకులు సద్గురు జగ్గీ వాసుదేవ్‌కు సంబంధించి యూట్యూబ్‌లో ప్రచారమవుతున్న నకిలీ, కృత్రిమ మేతో మార్ఫింగ్ చేసిన వీడియోలను వెంటనే గుర్తించి తొలగించాలని ఢిల్లీ హైకోర్టు గూగుల్‌ను ఆదేశించింది. సద్గురు ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్న ఈ కంటెంట్‌ను అడ్డుకోవడానికి అందుబాటులో ఉన్న సాంకేతిక సాధనాలన్నింటినీ ఉపయోగించాలని మంగళవారం స్పష్టం చేసింది. ఈశా ఫౌండేషన్, సద్గురు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరాతో కూడిన ఏకసభ్య ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యంగా, సద్గురును అరెస్ట్ చేశారంటూ సృష్టించిన ఒక ఫేక్ వీడియోతో సహా మోసపూరిత యాడ్స్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇలాంటి తప్పుడు కంటెంట్ పునరావృతం కాకుండా ఒక శాశ్వత యంత్రాంగాన్ని రూపొందించడానికి ఈశా ఫౌండేషన్‌తో కలిసి పనిచేయాలని గూగుల్‌కు సూచించింది. ఇలాంటి ఉల్లంఘనల గురించి ఈశా ఫౌండేషన్ ప్రతిసారీ ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేకుండా, గూగుల్ తన టెక్నాలజీని ఉపయోగించి వాటంతట అవే గుర్తించి తొలగించాలని 2021 ఐటీ నిబంధనలను కోర్టు గుర్తు చేసింది. ఈ విషయంలో ఏవైనా సాంకేతిక పరిమితులు ఉంటే అఫిడవిట్ దాఖలు చేయవచ్చని గూగుల్‌కు తెలిపింది. గతంలో మే 30న కూడా హైకోర్టు ఇలాంటి ఆదేశాలు జారీ చేసినప్పటికీ, సద్గురుపై తప్పుడు ప్రచారం ఆగలేదని, పైగా మరింత పెరిగిందని ఈశా ఫౌండేషన్ తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సద్గురు అరెస్ట్ అయ్యారనే తప్పుడు వార్తలతో వేలాది మంది ప్రజలు గందరగోళానికి గురై తమను సంప్రదిస్తున్నారని ఫౌండేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన గూగుల్ తరపు న్యాయవాది, తమ దృష్టికి వచ్చిన లింకులను తొలగిస్తున్నామని, ఈ సమస్య పరిష్కారానికి ఈశా ఫౌండేషన్‌తో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని కోర్టుకు తెలిపారు. ఆర్థిక మోసాలకు పాల్పడటానికి, సబ్‌స్క్రయిబర్లను పెంచుకోవడానికి కొందరు వ్యక్తులు సద్గురు ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి వాడుతున్నారని ఈశా ఫౌండేషన్ ఆరోపించింది. ప్రజలు ఇలాంటి తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, యూట్యూబ్‌లో కనిపించే నకిలీ యాడ్స్ లేదా వీడియోలను 'స్కామ్' లేదా 'తప్పుదోవ పట్టించేవి'గా ఫ్లాగ్ చేసి రిపోర్ట్ చేయాలని కోరింది.

## జపాన్‌కు తొలి 'లేడీ' లీడర్.. ప్రధాని పీఠం దక్కించుకున్న సనే తకాయిచి



జపాన్ రాజకీయ చరిత్రలో మంగళవారం నూతన అధ్యాయం మొదలైంది. దేశ చరిత్రలోనే మొట్ట మొదటి మహిళా ప్రధానిగా 64 ఏళ్ల సనే తకాయిచి నియమితులయ్యారు. చైనా పట్ల కఠిన వైఖరి, సంప్రదాయవాద భావాలు కలిగిన నాయకురాలిగా పేరున్న తకాయిచి.. చివరి నిమిషంలో సంకీర్ణ ఒప్పందాన్ని కుదుర్చుకోవడం ద్వారా ప్రధాని పదవిని చేపట్టారు. బ్రిటన్ మాజీ ప్రధాని మార్గరెట్ థాచర్‌ను ఆదర్శంగా భావించే తకాయిచి.. అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలిగా అక్టోబర్ 4న ఎన్నికయ్యారు. అయితే ఎల్డీపీలో నెలకొన్న అవినీతి కుంభకోణం, తకాయిచి కఠిన సంప్రదాయ భావజాలం కారణంగా.. ఎల్డీపీకి దశాబ్దాలుగా మద్దతుగా ఉన్న మిత్రపక్షం కోమెయిటో పార్టీ ఆరు రోజులకే సంకీర్ణం నుంచి తప్పుకుంది. దీంతో తకాయిచి ప్రభుత్వం ప్రమాదంలో పడింది. అయితే సోమవారం సాయంత్రం జపాన్ ఇన్నోవేషన్ పార్టీతో సంకీర్ణ ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా ఆమె మెజారిటీని దక్కించుకున్నారు. పార్లమెంటులో జరిగిన తొలి రౌండ్ ఓటింగ్‌లోనే అనూహ్యంగా ఆమెకు మెజారిటీ దక్కడంతో ప్రధానిగా నియమితులు అయ్యారు. అయితే ఉభయ సభల్లోనూ సంయుక్తంగా మెజారిటీ లేకపోవడం వల్ల ఈ ప్రభుత్వం మైనారిటీ గవర్నమెంట్‌గా కొనసాగనుంది. గత ఐదేళ్లలో జపాన్‌కు ఐదో ప్రధాని కావడం గమనార్హం. కొత్త ప్రధానిగా తకాయిచి ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. వచ్చే వారం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పర్యటించనున్నారు. ఇటీవల మిత్ర దేశాలపై కూడా ఎడాపెడా టారిఫ్‌లు విధిస్తున్న ట్రంప్.. జపాన్‌ను కూడా విడిచిపెట్టలేదు. మరోవైపు రష్యా ఇంధన దిగుమతులను ఆపాలని, జపాన్ తన సైనిక వ్యయాన్ని పెంచాలని ట్రంప్ డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అమెరికాతో దౌత్య సంబంధాలకు అధిక ప్రాధాన్యం ఇస్తానని తకాయిచి తెలిపారు. చైనాను ప్రబల శత్రువుగా భావిస్తారు తకాయిచి. అయితే ప్రధాని పదవిని దక్కించుకునే క్రమంలో ఆమె చైనా పట్ల తన వైఖరిని కొంతవరకు తగ్గించుకున్నట్లు తెలుస్తోంది. జపాన్ సైనికీకరణకు గుర్తుగా భావించే యషుకుని ఆలయాన్ని ఆమె తరుచూ సందర్శిస్తుంటారు. అయితే గత వారం ఆ దేవాలయ సందర్శనకు కూడా దూరంగా ఉన్నారు.

## శబరిమల ఆలయంలో బంగారం వివాదం హైకోర్టుకు మధ్యంతర నివేదిక




కొచ్చి: శబరిమల ఆలయంలో బంగారం వివాదం కేసుపై దర్యాప్తు నిర్వహిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన మధ్యంతర నివేదికను కేరళ హైకోర్టుకు మంగళవారం సమర్పించింది. ఈ కేసు విచారణను ఈ నెల ప్రారంభంలో ఎస్పి ఎస్.శశిధరణ్ నేతృత్వంలోని సిట్‌కు హైకోర్టు అప్పగించిన సంగతి తెలిసిందే. నివేదికను సీల్డ్‌కవర్‌లో శశిధరణ్ కోర్టు అందచేశారు. మంగళవారం ఈ కేసు విచారణను జస్టిస్ రాజా విజయరాఘవన్, జస్టిస్ కెవి జయకుమార్‌లతో కూడిన ధర్మాసనం నిర్వహించింది. ఈ విచారణ సందర్భంగా కోర్టులోకి సాధారణ ప్రజలను, మీడియాప్రతినిధులను అనుమతించలేదు. శబరిమల ఆలయంలోని బంగారు పూత పోసిన ద్వారపాలకులు రాగి విగ్రహాల బరువు 2019 నుంచి 4.5 కేజీలు తగ్గడంపై వివాదం ఏర్పడింది. దీనిపై సిట్ విచారణ నిర్వహిస్తుంది. ఎలక్ట్రోప్లేటింగ్ కోసం విగ్రహాలను చెన్నైకు చెందిన వ్యాపారవేత్త ఉన్నికృష్ణన్ పొట్టికి పంపిన తరువాత విగ్రహాల బరువు తగ్గిన విషయాన్ని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టిడిబి) విజిలెన్స్ విభాగం గుర్తించింది. దీనిపై కేసు నమోదు చేయాలని, సిట్‌ను ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశించింది. 'అదృశ్యమైన' బంగారానికి సంబంధించిన రికార్డులు, ఇతర ఆధారాల కోసం ఉన్నికృష్ణన్ పొట్టి నివాసంలో శనివారం సోదాలు నిర్వహించింది. ఈ వివాదంలో ఉన్నికృష్ణన్ పొట్టి, మరో తొమ్మిది మందిని దోషులుగా సిట్ భావిస్తోంది. ఉన్నికృష్ణన్ పొట్టి 2004 నుంచి 2008 వరకూ ఆలయంలోని ఒక పూజారికి సహాయకుడిగా పనిచేశారని, ఆయనకు విగ్రహాల్లోని బంగారు పూత గురించి తెలుసునని సిట్ వెల్లడించింది. కాగా, ఈ విగ్రహాలను 1998లో పారిశ్రామికవేత్త విజరు మాల్యా విరాళంగా ఇచ్చారు.

## వాషింగ్టన్‌తో అణు చర్చలు ఉండవు



అణు చర్చలు ప్రారంభిద్దామంటూ అమెరికా అధ్య క్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతి పాదనను ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా అలీ ఖమేనీ తోసిపుచ్చారు. ఈ ఏడాది జూన్‌లో జరిపిన వైమానిక దాడిలో ఇరాన్ అణు స్థావరాలను ధ్వంసం చేశామంటూ ట్రంప్ చేసిన వాదనను ఖండిస్తూ 'అలా కలలు కంటూనే ఉండండి' అని ఎద్దేవా చేశారు. తనతో కుదుర్చుకునే ఒప్పందం ఫలితాన్ని అమెరికా ముందుగానే నిర్దేశిస్తోందని, బెదిరింపులకు దిగుతోందని ఆయన ఓ ప్రకటనలో ఆరోపించారు. ఇరాన్, అమెరికా దేశాలు ఐదు విడతలుగా పరోక్ష అణు చర్చలు జరిపాయి. అయితే జూన్‌లో 12 రోజుల పాటు అమెరికా జరిపిన వైమానిక దాడులతో అవి నిలిచిపోయాయి. ఆ సమయంలో ఇజ్రాయిల్, అమెరికా దళాలు ఇరాన్ అణు స్థావరాలపై బాంబు దాడులు జరిపిన విషయం తెలిసిందే. 'ఒప్పందాన్ని తానే రూపొందిస్తానని ట్రంప్ అంటారు. అయితే బలవంతంగా రుద్దినప్పుడు, దాని ఫలితాన్ని ముందుగానే నిర్ణయించినప్పుడు అది ఒప్పందం ఎలా అవుతుంది? అది బలవంతంగా రుద్దడం లేదా బెదిరించడం అవుతుంది' అని ఖమేనీ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందంపై చర్చిస్తే బాగానే ఉంటుందని గత వారం ఇజ్రాయిల్ పార్లమెంటును ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ట్రంప్ వ్యాఖ్యానించారు. దీనిపై ఖమేనీ స్పందిస్తూ 'ఇరాన్ అణు పరిశ్రమపై బాంబు దాడులు జరిపి దానిని ధ్వంసం చేశామని అమెరికా అధ్యక్షుడు గొప్పగా చెప్పారు. మంచిదే. అలాగే కలలు కంటూ ఉండండి' అని ఎత్తిపొడిచారు. ఇరాన్‌కు అణు స్థావరాలు ఉన్నా లేకున్నా అమెరికాకు ఏం పని అని నిలదీశారు. ఇలా జోక్యం చేసుకోవడం సరికాదని, తప్పని హితవు పలికారు. తప్పుడు అంచనాలతో ఇరాన్ ప్రజల నైతిక స్థైరాన్ని ట్రంప్ దెబ్బ తీసేందుకు ట్రంప్ ప్రయత్నిస్తు న్నారని ఆరోపించారు. 'ఎలాంటి ఆయుధాలు ఉపయోగించ కుండా, సైన్యాన్ని దింపకుండా వ్యూహాత్మక లక్ష్యాలను సాధించు కోవడానికి యుద్ధం చేసే శత్రువు ప్రజలను ఒత్తిడికి గురిచేస్తాడు. తమ సామర్థ్యంపై నమ్మకం కోల్పోయేలా చేస్తాడు. ఆక్రమిత పాలస్తీనాలో నిరాశకు గురైన యూదుల్లో స్థైరాన్ని నింపి, వారిలో ఆశలు కలిగిం చేందుకు ట్రంప్ ప్రయత్నించారు. అందుకోసం ఎన్నో ఉత్తుత్తి మాటలు చెప్పారు. ఓ విదూషికుడిలా మారారు. ఆక్రమిత పాలస్తీనాలో అమెరికా అధ్యక్షుడి పర్యటనపై ఇది నా అభిప్రాయం' అని తెలిపారు. పన్నెండు రోజుల పాటు ఇరాన్ జరిపిన దాడిలో ఇజ్రాయిల్ దళాలు ఊహించలేని, కోలుకోలేని దెబ్బ తిన్నాయని ఖమేనీ చెప్పారు. 'ఆ ఎదురు దెబ్బలను వారు ఊహించలేదు. ఆశలు వదులుకున్నారు. ఆ నిరాశా నిస్పృహల నుంచి వారిని బయటపడేసేందుకు ట్రంప్ ఆక్రమిత పాలస్తీనాలో పర్యటించారు.

## ట్రంప్ - పుతిన్ సమావేశం వాయిదా



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల మధ్య జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌లో ఈ భేటీ జరగాల్సి ఉండగా, ప్రస్తుతం నిరవధికంగా వాయిదా వేసినట్లు అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. ఇరుదేశాల అధ్యక్షుల భేటీకి ముందుగా అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్‌ల మధ్య చర్చలు జరగాల్సి ఉంది. కానీ ఈ సమావేశం కూడా వాయిదా పడిందని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. అధ్యక్షుల భేటీకి ముందు నిర్మాణాత్మక చర్చల కోసం ఈ సమావేశం ఉద్దేశించబడిందని రష్యా పేర్కొంది. ఇరు దేశాధ్యక్షుల భేటీ వాయిదాకు గల స్పష్టమైన కారణాలు తెలియ రాలేదు. అయితే, ఉక్రెయిన్ యుద్ధం పరిష్కారంపై అమెరికా-రష్యా అధ్యక్షుల మధ్య భేదాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యుద్ధానికి శాంతియుత పరిష్కారం కనుగొనే దిశగా సహకార చర్చలు జరపాలన్న రూబియో ప్రతిపాదనపై ఇరుదేశాల మధ్య విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని సమాచారం. క్రెమ్లిన్ వర్గాలు ఈ అంశంపై స్పందిస్తూ, ఇరుదేశాల విదేశాంగ మంత్రుల మధ్య 'నిర్మాణాత్మకమైన చర్చలు' జరిగాయని పేర్కొన్నాయి. ఉక్రెయిన్‌లో శాంతి సాధనకు ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలు ఇప్పటివరకు ఫలించలేదని తెలిపాయి. ఇటీవల ఫోన్ సంభాషణలో ట్రంప్, పుతిన్‌లు హంగేరీలో భేటీ కావాలని నిర్ణయించుకున్నా, ఉక్రెయిన్ వివాదంపై అభిప్రాయ భేదాల కారణంగా సమావేశం తాత్కాలికంగా నిలిచిపోయింది. అయితే, జెలెన్స్కీతో వైట్‌హౌస్‌లో ట్రంప్ చేసిన చర్చలు మాత్రం సానుకూలంగా జరిగాయని అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ పేర్కొంది.

## గాజా ఒప్పందానికి ఇజ్రాయిల్ తూట్లు

పశ్చిమాసియాలో శాంతి స్థాపన ఎండమావిగానే మిగిలి పోతుందా? అక్కడ సమీప భవిష్యత్తులో శాంతి పవనాలు వీచే అవకాశాలే లేవా? తాజా పరిణామాలను గమనిస్తే ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం వస్తుంది. ఈ నెల 10వ తేదీన హమాస్, ఇజ్రాయిల్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. ఇజ్రాయిల్ దళాల ఉపసం హరణ, బందీలు-ఖైదీల మార్పిడి కూడా మొదలైంది. అంతా సజావుగా సాగుతోందని అనుకుంటున్న సమయంలో ఇజ్రాయిల్ మళ్లీ గాజాపై విరుచుకుపడుతోంది. వైమానిక దాడులు, కాల్పులు కొనసాగిస్తోంది. దీంతో కాల్పుల విరమణ ఒప్పందం భవిష్యత్తు అనిశ్చితిలో పడింది. ఒప్పందాన్ని మళ్లీ పట్టాలెక్కించడానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దూతలు దూతలు తమ దౌత్యాన్ని తిరిగి ప్రారంభించారు. కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇజ్రాయిల్ దళాలు జరుపుతున్న వైమానిక దాడుల్లో ఇప్పటి వరకూ వంద మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. గడచిన 24గంటలకాలంలో గాజాలోని ఆస్పత్రులకు 13మృతదేహాలను చేర్చారు. ఇజ్రాయిల్ దాడిలో గాయాలపాలైన ఎనిమిది మందికి చికిత్స అందిస్తున్నారు. ఇంతకాలం సహాయ శిబిరాలలో తలదాచుకొని, ఆనందంతో తిరిగి స్వస్థలాలకు చేరుకుంటున్న వారిపై కూడా ఇజ్రాయిల్ సైనికులు అమానుషంగా కాల్పులు జరుపుతున్నారు. అల్-షాప్ ప్రాంతంలో తాజాగా జరిగిన కాల్పుల్లో నలుగురు పాలస్తీనియన్లు చనిపోయారు. అయితే ఈ ఘటనపై ఇజ్రాయిల్ వితండవాదం చేస్తోంది. తుఫా సమీపంలోని షుజాయేలో పాలస్తీనియన్లు కాల్పుల విరమణ సరిహద్దును దాటి తన దళాల వైపు వచ్చారని, తన సైనికులను హెచ్చరించారని చెబుతోంది. కాగా సరిహద్దు సరిగా కన్పించకపోవడంతో గాజా వాసులు గందరగోళంలో పడిపోతున్నారు. ఆ ప్రాంతంలో ఎక్కడ చూసినా శిథిలాల కుప్పలు కన్పిస్తుం డడంతో సరిహద్దును గుర్తించడం కష్టంగా ఉంది. ఒప్పందం ప్రకారం ఈ సరిహద్దుకు ఆవల ఇజ్రాయిల్ దళాలు మకాం వేశాయి.

## దీపం వెలిగించి వేడుకలను ప్రారంభించిన అమెరికా అధ్యక్షుడు



అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొని, దీపం వెలిగించి భారత ప్రజలకు, ప్రవాస భారతీయులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన భారత ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసల వర్షం కురిపించారు. మోదీ గొప్ప వ్యక్తి అని, తనకు అత్యంత ఆప్తమిత్రుడని కొనియాడారు. ఈ వేడుకల్లో ట్రంప్ మాట్లాడుతూ భారత ప్రజలందరికీ మా హృదయపూర్వక శుభాకాంక్షలు. ఈ రోజే నేను మీ ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడాను. మా మధ్య వాణిజ్య సంబంధాలపై గొప్ప సంభాషణ జరిగింది. పాకిస్థాన్‌తో యుద్ధం వద్దనే అంశం కూడా మా మధ్య చర్చకు వచ్చింది. వాణిజ్యంతో పాటు యుద్ధం లేకుండా చూడటం చాలా మంచి విషయం అని వెల్లడించారు. ప్రధాని మోదీతో తన స్నేహం గురించి చెబుతూ, ఆయన గొప్ప వ్యక్తి. ఇన్నేళ్లలో నాకు మంచి మిత్రుడయ్యారు అని అన్నారు. దీపావళి పండుగ ప్రాముఖ్యతను ట్రంప్ ప్రత్యేకంగా వివరించారు. చీకటిపై వెలుగు, అజ్ఞానంపై జ్ఞానం, చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా మనం ఈ దీపాన్ని వెలిగిస్తాం. శత్రువులను ఓడించి, అడ్డంకులను తొలగించి, బంధీలకు విముక్తి కల్పించిన పురాతన గాథలను ఈ పండుగ గుర్తు చేస్తుంది" అని తెలిపారు. దీపపు జ్వాల మనకు వివేక మార్గాన్ని చూపుతుందని, కష్టపడి పనిచేయాలని, దేవుడి ఆశీస్సులకు కృతజ్ఞతలు చెప్పాలని గుర్తు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ట్రంప్ ప్రభుత్వంలోని పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వీరిలో ఎఫ్‌బీఐ డైరెక్టర్ కశ్ పటేల్, ఓడీఎన్‌ఐ డైరెక్టర్ తులసి గబార్డ్, వైట్‌హౌస్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ కుష్ దేశాయ్, అమెరికాలో భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా, భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ తదితరులు ఉన్నారు. ప్రముఖ భారత-అమెరికన్ వ్యాపారవేత్తలు కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ వేడుకలు అమెరికా-భారత్ మధ్య బలమైన సాంస్కృతిక సంబంధాలకు నిదర్శనంగా నిలిచాయి.

## గీత దాటితే.. ఏరి పారేస్తాం

గాజా ప్రాంతంలో కాల్పుల విరమణ ఒప్పందంపై పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమాస్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కఠిన హెచ్చరికలిచ్చారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే, హమాస్ పై వేగంగా, తీవ్రంగా, దారుణంగా చర్యలు తీసుకుంటామని స్పష్టంగా తెలిపారు. మిడిల్ ఈస్ట్‌లో అమెరికాకు మద్దతు ఇచ్చే అనేక దేశాలు హమాస్ పై సైనిక చర్యలకు సిద్ధంగా ఉన్నాయని ట్రంప్ హెచ్చరించారు. "హమాస్ తోక జాడిస్తే, వారిని అంతం చేయడానికి మిడిల్ ఈస్ట్ దేశాలు ఏకపక్షంగా మద్దతు ఇస్తాయి" అని ఆయన చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ, "మిడిల్ ఈస్ట్‌లోని అనేక దేశాలు గాజాకు వెళ్లి హమాస్‌ను అంతం చేసేందుకు సన్నద్ధంగా ఉన్నాయి. హమాస్ ఇలానే విఘటకంగా వ్యవహరిస్తే, కాల్పుల విరమణను ఉల్లంఘించడం సహించలేము. గత వెయ్యేళ్లలో ఈ స్థాయిలో మిడిల్ ఈస్ట్ దేశాలు ఏకసమస్యాకృతితో హమాస్‌పై కదిలిన ఉదాహరణ లేదు. ఈ సానుకూల పరిణామాన్ని కొనసాగించాలి" అని ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇక అమెరికా ప్రతినిధులు జేడీ వాన్స్ మరియు స్టీవ్ విట్‌కాఫ్ ఈ మధ్యలో ఇజ్రాయెల్ వెళ్లి శాంతి ఒప్పందంపై సమావేశం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ట్రంప్ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యత పొందాయి.

## వైట్ హౌస్ ఈస్ట్‌వింగ్ కూల్చివేత

నో కింగ్స్ అంటూ ప్రపంచవ్యాప్తంగా అమెరికా అధ్యక్షుడికి వ్యతిరేక నిరసనలు ఉధృతమవుతున్నా.. ట్రంప్ తీరు అస్సలు మారటం లేదు. తన కలల ప్రాజెక్టు కోసం వైట్‌హౌస్‌లోని పురాతన కట్టడాన్ని కూల్చేశారు. ఇప్పుడు అక్కడ బాల్‌రూమ్ నిర్మాణానికి ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా వైట్‌హౌస్‌లో ఈస్ట్‌వింగ్ విభాగంలో కూల్చివేతలు ప్రారంభమయ్యాయి. స్వయంగా ట్రంపే ఈ విషయాన్ని ట్రూత్ సోషల్ వేదికగా తెలిపారు. సోమవారం ఈ ఈస్ట్‌వింగ్ లోని ప్రవేశ ద్వారం, కిటికీలను సిబ్బంది కూల్చేశారు. శ్వేతసౌధంలో 25 కోట్ల అమెరికన్ డాలర్ల వ్యయంతో ట్రంప్ ఈ బాల్‌రూమ్ (నృత్యశాల) నిర్మిస్తున్నారు. ఇది వైట్‌హౌస్‌లో ట్రంప్ చేపట్టనున్న అతిపెద్ద నిర్మాణ కార్యక్రమం. దీన్ని ఈస్ట్‌వింగ్ ప్రాంతంలో నిర్మి స్తున్నారు. ఇక్కడ 999 మంది కూర్చొనేందుకు వీలుగా ప్లాన్ చేశారు. ఈ బాల్‌రూమ్ నిర్మాణం 150 ఏండ్లకు పైగా అమెరికా అధ్యక్షుల కల అని ట్రంప్ పేర్కొన్నారు. ఈప్రాజెక్టులో తన సొంతడబ్బును పెట్టుబడిగా పెట్టినట్టు తెలిపారు. దీనికి సంబంధించి అమెరికన్ పన్ను చెల్లింపుదారులకు ఎలాంటి ఖర్చు ఉండదన్నారు. ఇక, ఈ నిర్మాణం కోసం అనేక మంది ఉదార దేశభక్తులు, గొప్ప అమెరికన్ కంపెనీలు స్వతహాగా నిధులు సమకూరుస్తున్నా యన్నారు. ఇది వైట్‌హౌస్ నిర్మాణానికి అను సంధానంగా ఉన్నప్పటికీ.. దీనికి శ్వేతసౌధంతో సంబంధం లేదని తెలిపారు. వైట్‌హౌస్ రెండు శతాబ్దాలుగా అమెరికా అధ్యక్షుడి చారిత్రక నివాసంగా ఉంది. ఈస్ట్ వింగ్‌ను 1902లో నిర్మించారు.

## అమిత్‌షాకు తేజస్వియాదవ్ కౌంటర్



పాట్నా: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై ఆర్జేడీ నేత తేజస్వియాదవ్ విరుచుకుపడ్డారు. ఇటీవల ఇంటర్వ్యూలో హోంమంత్రి అమిత్ షా.. బీహార్‌లో పారిశ్రామికాభివృద్ధికి.. భూమి కొరతే ప్రధాన అడ్డంకిగా ఉందని వ్యాఖ్యానించారు. ఆయన న్యూస్ నెట్‌వర్క్ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈవిధమైన వ్యాఖ్యలు చేశారు. ఈ వీడియో కూడా సోషల్‌మీడియాలో వైరల్ అవుతుంది. అమిత్‌షా వ్యాఖ్యలపై తేజస్వి స్పందించారు. 20 సంవత్సరాలు బీహార్‌లో ప్రభుత్వాన్ని నడిపిన తర్వాత కూడా హోంమంత్రి సాకులు చెబుతున్నారు. గుజరాత్‌లో మాత్రమే కంపెనీలు ఏర్పాటు చేస్తున్నారు. కానీ ఆ కంపెనీల్లో పనిచేసే కార్మికులు మాత్రం బీహార్‌కు చెందినవారు. బీహారీలు ఇకపై మోసపోకండి అని తేజస్వి యాదవ్ ఆ రాష్ట్ర ప్రజలకు సూచించారు.

## ఆపరేషన్ సిందూర్‌కు ఆ శ్రీరామచంద్రుడే స్ఫూర్తి

న్యూఢిల్లీ: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ పౌరులను ఉద్దేశించి ప్రత్యేక లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగానే దేశ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. తన లేఖలో రామమందిరం నిర్మాణం, ఆపరేషన్ సిందూర్, మావోయిస్టుల లొంగుబాటుతో పాటు అనేక కీలక అంశాలను ప్రస్తావించారు. ముఖ్యంగా అయోధ్యలో శ్రీరాముడి ఆలయం నిర్మాణమైన తర్వాత జరుపుకుంటున్న రెండో దీపావళి ఇది అని ప్రధాని మోదీ తన లేఖలో పేర్కొన్నారు. "ధర్మాన్ని ఎల్లప్పుడూ కాపాడాలని శ్రీరాముడు మనకు బోధించారు. అంతేకాక, అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని కూడా ఆయనే ప్రసాదిస్తారు" అని ఆయన తెలిపారు. కొద్ది నెలల క్రితం ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు శ్రీరాముడే ప్రధాన స్ఫూర్తి అని మోదీ పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ ద్వారా భారత ధర్మాన్ని సంరక్షించడంతో పాటు పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి విజయవంతంగా ప్రతీకారం తీర్చుకున్నామని ఆయన స్పష్టం చేశారు. అలాగే ఈ దీపావళికి మరో ముఖ్యమైన ప్రత్యేకత ఉందని ప్రధాని తెలిపారు. మావోయిస్టుల హింస నుంచి విముక్తి పొందిన అనేక జిల్లాల్లో, మారుమూల ప్రాంతాలలో కూడా ఈరోజు దీపావళి వెలుగులు నిండుగా ప్రకాశిస్తున్నాయని చెప్పారు. "మన దేశ రాజ్యాంగంపై విశ్వాసంతో.. అనేక మంది హింసా మార్గాన్ని విడిచి పెట్టి, జనజీవన స్రవంతిలోకి తిరిగి వచ్చిన ఘటనలను మనం ఇటీవల చూశాం. తమ ఆయుధాలను వీడి, శాంతియుత జీవితాన్ని గడపడానికి వారు ముందుకు రావడం దేశానికి ఒక గొప్ప విజయం" అని మోదీ ఈ సందర్భంగా వారికి స్వాగతం పలికారు. ఈ శుభసందర్భంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఆర్థిక నిర్ణయాలను కూడా ప్రధాని తన లేఖలో గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీఎస్టీ రేట్లను తగ్గించడం ద్వారా దేశ ప్రజలకు పెద్ద మొత్తంలో లబ్ధి చేకూరిందని.. తద్వారా పండుగల సందర్భంగా వారికి ఆర్థిక భారం తగ్గిందని ఆయన వివరించారు. ప్రతి ఒక్కరూ స్థానికంగా తయారైన వస్తువులను కొనుగోలు చేసి, తద్వారా స్థానిక పరిశ్రమలను, స్వయం సహాయక బృందాలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా దేశంలోని అన్ని భాషలను, సంస్కృతులను గౌరవించాలని కోరారు. పండుగలు, పర్వదినాలు ఉన్నా లేకపోయినా నిత్యం పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

# సంపాదకీయం

## బీసీ రిజర్వేషన్లపై రాజకీయ సంకల్పం ఏదీ?

కొందరు మనసులో అనుకున్నదీ, మరికొందరు బయటికి అన్నదే జరిగింది. ఇరుపక్షాల వాదనలూ విన్న తెలంగాణ ఉన్నత న్యాయస్థానం స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు 42 శాతం స్థానాలు కేటాయిస్తూ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వు అమలుపై తాత్కాలిక నిషేధం విధించి, ఆ వ్యాజ్యాన్ని ఆరు వారాల తర్వాత వింటామంది. అలాగే రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్ కూడా తాత్కాలికంగా నిలిపి వేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సర్వోన్నత న్యాయస్థానం కూడా కొట్టివేసింది. ఐతే, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం రాతపూర్వక మధ్యంతర ఉత్తర్వులు రాకుండానే, రాజకీయ పక్షాల మధ్య అమీతుమీ మొదలైంది. ప్రస్తుతానికి సర్వోన్నత న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వ వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించడానికి నిరాకరించింది, తక్షణ కర్తవ్యంగా ప్రభుత్వం 25% కేటాయింపులతోటే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి, కావాలనుకుంటే న్యాయస్థానాలలో పోరాటం కొనసాగించవచ్చు. అధికార పక్షం, మంత్రులు తమ ప్రకటనలలో ప్రధాన ప్రతిపక్షాలైన భారతీయ జనతా పార్టీ, భారత రాష్ట్ర సమితి 42 శాతం రిజర్వేషన్ రాకుండా అడ్డుకున్నాయన్నారు. ఆరు గ్యారంటీలు మాదిరిగానే కాంగ్రెస్ 42 శాతం బీసీ రిజర్వేషన్‌పై డ్రామాలాడుతున్నదని, కాంగ్రెస్, బీజేపీ కలిసి బీసీలను మోసం చేస్తున్నారని, బీఆర్ఎస్ విమర్శ. జీవో సంఖ్య- 9 అమలు ఉన్నత న్యాయస్థానం తాత్కాలికంగా నిలిపి వేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీజేపీ అభియోగం. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉండడంతోనే రిజర్వేషన్లు అమలు కావడం లేదని సీపీఎం ఆరోపణ. ప్రస్తుతానికి సర్వోన్నత న్యాయస్థానం రాష్ట్ర ప్రభుత్వ వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించడానికి నిరాకరించింది, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. 1992లో ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (మండల్ కేసు)లో సుప్రీంకోర్టు అసాధారణ పరిస్థితుల్లో తప్ప దేశంలో రిజర్వేషన్లు 50 శాతం దాటరాదని తేల్చి చెప్పింది. దీంతో అప్పటి వరకు 69 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోన్న తమిళనాడు ప్రభుత్వానికి చుక్కెదురైంది. మేల్కొన్న ప్రభుత్వం రాష్ట్రంలోని విద్య, ఉద్యోగా ల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు 69 శాతం రిజర్వేషన్లు యథావిధిగా అమలు చేసేందుకు 1994లో ప్రత్యేక చట్టం చేసింది. అదే సంవత్సరం కేంద్రం 76వ రాజ్యాంగ సవరణ చేసి, ఆ చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్పించడంలో సఫలమైంది. ఈ షెడ్యూల్‌లో చేరిన చట్టాలపై న్యాయస్థానాల సమీక్ష కుదరదు. వెనుకబడిన తరగతులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం స్థానాలు కేటాయించడానికి ఉద్దేశించిన బిల్లు శాసనసభలలోని అన్ని రాజకీయ పక్షాలు ఆమోదించాయి. తగువంతా ఇందుకు ఖ్యాతి ఎవరి ఖాతాలో వేసుకోవాలన్నదే. ప్రజా క్షేమమే పరమావధి అనుకున్న సందర్భంలో అట్లాంటి అహంభావపూరిత ఆలోచన సరికాదు. మనం రెండు ముఖ్యమైన విషయాలు మరచిపోరాదు. ఉన్నత న్యా యస్థానం మధ్యంతర ఉత్తర్వుల ద్వారా వెనకబడిన తరగతులకు స్థానిక సంస్థలలో కేటాయింపులు నిలుపుదల చేయలేదు. ఎన్నికల నిర్వహణలో జోక్యం కలగజేసుకోలేదు. కేవలం ఆ కేటాయింపుల శాతాన్ని 25కు కుదించింది. కావాలనుకుంటే రాష్ట్ర ప్రభుత్వం పాత కేటాయింపుల ప్రకారం ఎన్నికలకు వెళ్లవచ్చని సూచించింది. సర్వో న్నత న్యాయస్థానం కూడా ఇదే అభిప్రాయం వ్యక్తపరచింది. ఇప్పటికైనా మించి పోయింది లేదు. ప్రధాన రాజకీయ పక్షాలన్నీ స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల వారికి 42 శాతం కేటాయింపులకి అనుకూలమే కాబట్టి, తాము అభ్యర్థులను ప్రకటించే సమయంలోనే వెనుకబడిన తరగతులకు 42% కేటాయించవచ్చు. అలాచేయడం వలన న్యాయస్థానం విధించిన గడువు లోగా ఎన్నికల నిర్వహణ సుగమవుతుంది. ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల వివిధ పథకాలకు కేంద్రం నుంచి రావా ల్సిన నిధులకు కోతపడే ప్రమాదం తప్పుతుంది. ఇప్పటికే, ఈ కారణంగా ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోయాయి. అంతేకాదు. 'తొందరపడి ఒక కోయిల ముందే కూసినట్టు', స్థానిక సంస్థల ఎన్నికల విషయం ఉన్నత న్యాయస్థానం ముందుండగానే, నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఒడ్డున పడేసినట్టవుతుంది. ఇక్కడో పిట్ట కథ చెప్పాలని ఉంది. కృష్ణార్జునులు మారు వేషాలతో ధర్మరాజు దగ్గరికి వెళ్లి, ఏదో కార్యం నిమిత్తం ఎండిన చందనపు కలప కావాలన్నారంట. కొన్ని రోజు లుగా నిరంతరం కురుస్తున్న వానల వల్ల సేవకులు ఎంత వెతికినా అలాంటి కలప లభ్యం కాలేదు. దాంతో వారిని మన్నించమని కోరి, వర్షం ఆగిన తర్వాత ఆ కలప పంపుతానన్నాడు యుధిష్టిరుడు. బావ మరుదులు ఈసారి కర్ణుడు దగ్గరికి వెళ్లారు. అంతా వెనకటి కథే. కానీ చివరనో మలుపు. కర్ణుడు బాణాలు ప్రయోగించి, తన ఇంటి ద్వారాల నుండి, కిటికీల నుండి కలపను సేకరించి వారికిచ్చాడట.

తక్షణ కర్తవ్యంగా ప్రభుత్వం 25% కేటాయింపులతోటే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి, కావాలనుకుంటే న్యాయస్థానాలలో పోరాటం కొనసాగించవచ్చు. సెప్టెంబర్, 2023 లోనే పార్లమెంట్ ఆమోదం పొందిన మహిళలకు చట్ట సభలలో స్థానాల కేటాయిపు బిల్లు, అమలులోకి రాబోతున్నది 2029 ఎన్నికల నుండే కదా.

# "అకాల మృత్యు హరుడు... ధర్మపురి యముడు"

"భూషణవికాస శ్రీధర్మ పుర నివాస దుష్ట సంహార నరసింహ దురితదూర" అనే మకుటంతో భక్తాగ్రేసరులు శేషప్ప రాసిన నరసింహ శతక పద్యాల మాధుర్యాన్ని ఆస్వాదించని, తెలుగువారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. భారతీయ ప్రాచీన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు పట్టు కొమ్మగా, హైందవ సనాతన సంప్రదాయాలకు నెలవుగా, అనాది కాలంగా హైందవ ధర్మ ప్రచారం కేంద్ర బిందువుగా, పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసి, ఆస్తిక ప్రపంచానికి వరదాయిగా, భక్తి ముక్తి ప్రదాయినిగా విరాజిల్లుతున్నది సుప్రసిద్ధ గోదావరి తీరస్థ తీర్థమైన ప్రాచీన ధర్మపురి క్షేత్రం. తెలుగునేలపై సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, దక్షిణ కాశీగా, నవ నారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమైనదిగా, హరి హర క్షేత్రంగా, పౌరాణిక, ఐతిహాసిక చారిత్రక ప్రాధాన్యతను సంతరించు కున్నది క్షేత్ర రాజ్యం. బ్రహ్మాండ, స్కందాది పురాణాలలో, ధర్మపురి క్షేత్ర ప్రాశస్త్యం నిక్షిప్తమై ఉంది. ఈ క్షేత్ర దేవస్థాన అంతర్గతంగా ఉన్న యమధర్మరాజు మందిరం, విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. భారతావనిలోనే అరుదుగా, అపురూపంగా, క్షేత్రంలో వెలసిన "యమధర్మరాజును దర్శిస్తే", "యమపురి" ఉండబోదని ప్రతీతి. హిరణ్యకశిపుని సంహరించిన అనంతరం ఉగ్ర నరసింహ స్వామిని శాంతింప చేసేందుకు, బ్రహ్మాది దేవతలు పుణ్య తీర్థం, పవిత్ర క్షేత్రము అయిన ధర్మపురిలో తపో, యజ్ఞ, ధ్యానం ఆది సత్కర్మలను ఒనరించినట్లు స్థల పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఒకానొక సమయాన యమధర్మరాజు, తన లోకమునందు అనేక శారీరక బాధలను అనుభవించుచున్న పాపులను గాంచి, నిట్టూర్పులు విడిచి, తనలో తాను విచారిం చెను. పుణ్యాత్ములను దర్శించిన చో పుణ్యము, పాపాత్ములను చూచినచో పాపమే లభించునని, నిత్యము పాపులను దర్శించుట వల్ల, తనకు పాప సంచయమే కలుగుతున్నదని, తనయందు స్వయంకృత పాపం అనునది ఏమాత్రము లేకున్ననూ, పాపుల నిత్య దర్శనంతో మనశ్శాంతి కలగడం లేదని తలంచి, మనశ్శాంతిని పొందుటకు పుణ్యక్షేత్ర దర్శన ప్రయాణొన్ముఖుడై, సమస్త క్షేత్రములను తిరిగెను. చివరకు ధర్మపురికి రాగా ఈ క్షేత్రమున గోదావరి నది స్నానము ఆచరించ గానే, యమునకు మనశ్శాంతి కలిగెనని, పాపాత్ముల దర్శన దోషములు



తొలగెగని, బ్రహ్మాండం, స్కాంద పురాణాంతర్గత "ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం" ఆధారంగా నైమిశారణ్యంలో సూత పౌరాణికుడు, శౌనకాది మహర్షులకు వివరించినట్లు నారదుడు పృథు మహారాజుకు క్షేత్ర మహిమను తెలిపినట్లు వివరించ బడింది. యమధర్మరాజు నరసింహుని మందిరానికి ఏగి, చేసిన పూజలకు ప్రసన్నుడైన నరసింహుడు, యమధర్మరాజును తన సన్నిధిలో నివసించమని తెలిపెనని పురాణాల ఆధారం. యముడు గోదావరిలో స్నానమాచరించిన స్థలమునకు "యమ కుండము" అని పేరు కలిగినట్లు, అచట స్నానమాచరించి, నరసింహుని పూజించు వారికి యమ లోక బాధలు కలుగకుండా ఉండు న్నట్లు, సర్వ పాప విముక్తి కలుగునట్లు, నరసింహుడు వరం ఇచ్చినట్లు, యమ ధర్మరాజు తన అంశ రూపమును, నరసింహ మందిర పురో భాగమున నిలిపెనని, పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. దేవస్థానంలో యోగానంద నరసింహ ప్రధానాలయం ముందు భాగాన, ఉంది యమ ధర్మ రాజ మందిరం. కోరలతో, యమ దండాన్ని ధరించిన భీకరాకార ఆరు అడుగుల భారీ విగ్రహం ఇందుంది. "దక్షిణాదిభి ముఖీ గంగా, యత్ర దేవో నృకేసరి, తత్ర శ్రీర్విజయోర్భూతి: కాశ్య యశ్వత గుణం భవేత్", అని అని దక్షిణ అభి ముఖియై ప్రవహిస్తున్న గోదావరి తీరస్థమైన, ధర్మపురి క్షేత్రం విశిష్టతను కలిగి ఉన్నది. వేరే ఎక్కడ కాన రాని విధంగా, ధర్మపురి క్షేత్రం వద్ద గోదావరి దక్షిణ వాహినిగా ప్రవహిస్తు న్నది. అష్టదిక్పాలకులలో ఒకరైన యముడు, దక్షిణ దిశకు అధిపతి. అంతేకాక గ్రహాల దృష్ట్యా, కుజుడు దక్షిణ దిశకు అధిపతి. కుజ గ్రహానికి మూలాధిపతి నరసింహుడు అని పరాశరుడు బృహత్ పరాశర హోరా శాస్త్రం నందు నుడివి ఉన్నాడు. కనుక ధర్మపురిలో దక్షిణ వాహినిగా ఉన్న గౌతమి యందు దక్షిణాభిముఖులై, స్నానాలు ఆచరిస్తే నరసింహుని దర్శిస్తే, నరక బాధలు ఉండవని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ధర్మపురిలో వెలసిన యమ ధర్మరాజును దర్శించే భక్తుల సంఖ్య, నానాటికీ అధికమ వుతున్నది. ఇటీవల సంభవిస్తున్న అనూహ్య ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా, అకాల మృత్యు నివారణకై అధర్వణ వేదంలో పేర్కొనబడిన "ఆయుష్య సూక్తం'' ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే భరణి నక్షత్రం, చతుర్దశి తదితర ప్రత్యేక దినాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గురు వారం యమ ద్వితీయ సంధర్భంగా, అభిషేకం, ఆయుష్య సూక్తం, యమ సూక్త మంత్రం, పురుష సూక్తం, శ్రీసూక్తం, జ్వర హర స్తోత్ర పఠనాలు, రోగ నివారణ సూక్తాలు పూజలు, యమాష్టకాది నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.



రామ కిష్టయ్య సంగన భట్ల...

# భారత స్వాతంత్ర్యోద్యమ ధృవతార: బహదూర్ షా జఫర్.



ప్రతి యుగం తన ముగింపులో ఒక కొత్త ఆరంభానికి జన్మనిస్తుంది. అలాంటి నవయుగాన్ని ఆవిష్కరించిన మహనీయుల్లో బహదూర్ షా జఫర్ ఒకరు. ఈయన 1775 అక్టోబర్ 24న ఢిల్లీలో జన్మించారు. మహమ్మద్ షా చక్రవర్తి వంశానికి వారసుడైన జఫర్ , మొగల్ సామ్రాజ్యపు చివరి చక్రవర్తిగా చరిత్రలో నిలిచిపోయాడు. ఆత్మగౌరవ ప్రతీక బహదూర్ షా జఫర్. బహదూర్ షా జఫర్ సింహాసనం అధిరోహించిన 1837 నాటికి మొఘల్ సామ్రాజ్యం కేవలం ఢిల్లీ పరిసరాలకే పరిమితమై ఉండేది. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ దేశమంతా తన పరిపాలనను విస్తరించి, భారత రాజవంశాలను బానిసలుగా మార్చింది. కానీ జఫర్ చక్రవర్తి రాజకీయంగా బలహీనుడే అయినప్పటికీ, మానసికంగా చాలా బలవంతుడు, స్వతంత్రుడూను.

ఆయన దృక్పథంలో రాజ్యం అంటే కేవలం అధికారం కాదు, అదొక బాధ్యత, ఒక నైతిక కర్తవ్యం. ఆరోజుల్లో ఢిల్లీలోని ఆయన రాజభవనం సంగీత, సాహిత్య, కవిత్వ సాంస్కృతిక చైతన్య కేంద్రంగా ఉండేది. స్వయంగా ఆయన కూడా కవి, ఆధ్యాత్మిక స్వభావం కలిగినవాడు. పీడన, అణచివేత, బానిసత్వానికి వ్యతిరేకంగా ఆయన కవిత్వం ఆత్మ గౌరవ స్వేచ్ఛాగీతం ఆలపించేది. 1857: చరిత్రలో కొత్త అధ్యాయం. 1857లో ప్రారంభమైన సైనిక విప్లవం, కేవలం సిపాయిల తిరుగుబాటు మాత్రమే కాదు. అది దశాబ్దాలుగా సాగుతున్న దోపిడీ, అవమానం, మతహననం, అణచివేతలకు వ్యతిరేకంగా, స్వాతంత్ర్యంకోసం ఎగసిన ప్రజల ఉగ్ర ప్రతిస్పందన. ఈ తిరుగుబాటుకు ఒక నాయకత్వం కావలసి వచ్చింది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పిడికిలి బిగించిన సైనికులు, ఢిల్లీకి చేరుకుని, బహదూర్ షా జఫర్‌ను తమ చక్రవర్తిగా ప్రకటించారు. అప్పుడు ఆయన వయస్సు 82 సంవత్సరాలు. శరీరం బలహీనమైనా, మనసు మాత్రం నూతనోత్తేజంతో జ్వలిస్తూనే ఉంది. ఆయన మొదట సైనికుల పిలుపు పట్ల సందిగ్ధతతో ఉన్నప్పటికీ, చివరికి 'ఇది నా వ్యక్తిగత యుద్ధం కాదు, జాతి యుద్ధం' అని ముందుకొచ్చాడు. జాతి ఐక్యతకు ప్రతీకజఫర్ చక్రవర్తి నాయకత్వం స్వాతంత్ర్య యుద్ధానికి ఒక కొత్త మానసిక దిశ ఇచ్చింది. ఆయన రాజభవనంలో హిందూ, ముస్లిం సైనికాధికారులు కలసి వ్యూహాలు రూపొందించారు. జాతీయ ఏకత్వాన్ని కాపాడేందుకు జఫర్ తన బలహీన సామ్రాజ్యాన్ని ప్రతీకాత్మకంగా ఒక జాతీయ ప్రభుత్వంగా మార్చారు. ఢిల్లీలోని మసీదులు, దేవాలయాలు స్వాతంత్ర్యోద్యమ నినాదాలతో మారుమ్రోగాయి. ' దేశంతోపాటు ధర్మాన్ని కూడా రక్షించుకుందాం' అన్న నినాదం ప్రతి వీధిలో ప్రతిధ్వనించింది. ఆ క్షణంలో హిందూ, ముస్లిం, సిక్కు, పంజాబీ, పఠాన్ అందరూ ఏక కంఠంతో నినదించారు. ఈ ఐక్యతే 1857 విప్లవానికి ఆత్మగా మారింది. బ్రిటిష్ సైన్యం ఢిల్లీని ముట్టడించినప్పుడు, జఫర్ చక్రవర్తి తన వయస్సును, బలహీనతను లెక్క చేయకుండా సైనికులను ఉత్తేజ పరుస్తూ వారికి ప్రేరణగా నిలిచాడు. ఆయన రాజభవనం నుండి వెలువడిన ఆదేశాలు కేవలం రాజకీయంగా కాకుండా, ధార్మికంగా, నైతికంగా జాతి ఉద్దీపనకు కారణమయ్యాయి.' ఈ భూమి మనది,

దాన్ని రక్షించుకోవడం మన ధర్మం' అని ఆయన ప్రకటించారు. ఈ ప్రకటనను.., 'కుల మతాలకు అతీతంగా హిందూ, ముస్లిం సైనికుల్ని కార్యోన్ముఖుల్ని చేసిన ఒక మంత్ర దండంలా ఆకాలపు బ్రిటిష్ పత్రికలు అభివర్ణించాయి. 'నాదేశ హిందూ, ముస్లిం సోదరులారా.. లేవండి. మేల్కొనండి. దేవుడు మనకు ప్రసాదించిన అనేక అనుగ్రహాల్లో స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు అత్యతవిలువైనవి' అంటూ ఆయన చేసే ఉద్వేగభరిత ప్రసంగాలను, రగిలించే ఉద్యమస్ఫూర్తిని పయామె ఆజాదీ నిర్భయంగా పతాక శీర్షికల్లో ప్రచురించేది. పతనం, నిర్బంధంఅయితే ఢిల్లీ పతనంతో విప్లవం నీరసించిపోయింది. బ్రిటిష్ సైనికుల దాడిలో అనేక మంది దేశభక్తులు హతమయ్యారు. జఫర్ కుటుంబ సభ్యులను ఆయన కళ్లముందే బ్రిటిష్ ముష్కరులు హతమార్చారు. అతడిని విచారణ పేరుతో పదవీచ్యుతుణ్ణి చేశారు. సింహాసనం నుంచి దించేసి, రంగూన్ (ప్రస్తుత మయన్మార్) జైలులో నిర్బంధించారు. అక్కడ ఆయనకు సమాధి కోసం స్థలం కూడా దొరకలేదు. ఆ బాధను ఆయన తన కవిత్వంలో ఇలా వ్యక్తం చేశారు జఫర్ :'కిత్నా హయ్ బద్ నసీబ్ జఫర్ , దఫన్ కే లియే దోగజ్ జమీన్ భీ న మిలీ కోయె యార్ మె.' ఈ కవితా పంక్తి ఒక చక్రవర్తి ఆవేదనా భరిత దుఃఖాన్ని ప్రతిబింబిస్తుంది. జఫర్ వారసత్వంబహదూర్ షా జఫర్ 1862 నవంబర్ 7న మరణించాడు. దాంతో ఆయన సామ్రాజ్యమే పతనమైంది తప్ప, స్వాతంత్ర్య స్ఫూర్తి కాదు. ఆయన నాయకత్వం లేకపోయినా, 1857 విప్లవం భారత జాతీయ చైతన్యానికి పునాది వేసింది. 1947లో భారతదేశం స్వతంత్రం పొందిన రోజు, అనేకమంది చరిత్రకారులు 'బహదూర్ షా జఫర్ ఆత్మ ఈ స్వాతంత్ర్యానికి సాక్షిగా నిలిచిఉంది' అని రాశారు. జఫర్ సాహిత్యం, త్యాగం, ఆత్మ గౌరవ విలువలు దేశ స్వాతంత్ర్యోద్యమానికి దీర్ఘకాల స్ఫూర్తిగా నిలిచాయి. ఆయన సాహిత్యం చెబుతున్నదేమిటంటే, 'దేశం బలహీనపడేది ఆయుధాలు కోల్పోయినప్పుడు కాదు, ఆత్మగౌరవం కోల్పోయినప్పుడు.' ఇది నేటి తరానికి ఒక బలమైన సందేశం1857 విప్లవం అణచివేత తరువాత కూడా బహదూర్ షా జఫర్ పేరు భారత జాతి గుండెల్లో సజీవంగానే ఉంది. ఆ కాలంలో బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను దేశద్రోహిగా ప్రకటించినా, అదే పేరు తరువాత భారత జాతీయోద్యమంలో స్ఫూర్తి చిహ్నంగా మారింది. 1905లో బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమం మొదలైనప్పుడు, జఫర్ కవిత్వంలోని 'జమీన్ – ఎ – హింద్ పర్ అల్లాహ్ కా ఫజల్ హై' అనే పంక్తులు స్వాతంత్ర్య గీతాలుగా పాడబడ్డాయి. ఆయన పేరు తిరుగుబాటుకు కాకుండా ధర్మసంకల్పానికి ప్రతీకగా మారింది. భారత జాతీయ కాంగ్రెస్ ప్రారంభ దశల్లోనూ జఫర్ జ్ఞాపకం ఒక ఆత్మీయ గౌరవంగా నిలిచింది. బాల గంగాధర తిలక్, మౌలానా ఆజాద్, జవహర్‌లాల్ నెహ్రూ వంటి నేతలు 1857 యుద్ధాన్ని భారత జాతీయ చైతన్యానికి 'మొదటి జ్వాల' గా పేర్కొనగా, ఆ జ్వాలకు రూపం ఇచ్చినవాడు బహదూర్ షా జఫర్ అని పేర్కొన్నారు. ఆయన చూపిన ఐక్యతా దృక్పథం, హిందూ, ముస్లింలను ఒకే జెండా కిందికి చేర్చిన ఆ భావజాలం తరువాతి దశాబ్దాల స్వాతంత్ర్య ఉద్యమానికి బాటలువేసింది. నేటి తరానికి సందేశం. నాటికాలంలో, స్వాతంత్ర్యం అంటే కేవలం రాజకీయ స్వేచ్ఛ కాదు, అది విలువల పరిరక్షణ కూడా. అధికారం, రాజ్యం చేతిలో లేకపోయినా, ఆత్మగౌరవం చేతిలో ఉండాలని బహదూర్ షా జఫర్ జీవితం మనకు నేర్పుతుంది.

కులం, మతం, జాతి అనే సరిహద్దులు చెరిపేసి, 'ముందు దేశం, భక్తి తరువాత' అన్న సజీవ స్ఫూర్తిని నింపిన అనుపమాన దేశ భక్తుడు జఫర్. 1857 విప్లవస్ఫూర్తి ఆయనతోనే ఆగిపోలేదు. అది నేటికీ భారతజాతి రక్తనాళాల్లో ప్రవహిస్తూనే ఉంది. ఆయన పేరు చరిత్రలో తొలి స్వాతంత్ర్య సమర యోధుడిగా నిలిచిపోయింది. ఆయన చూపిన మార్గమే ఈ భూమి పట్ల ప్రేమకు, త్యాగానికి చిరస్మరణీయ స్ఫూర్తి.



యండి. ఉస్మాన్ ఖాన్

# పర్వతాల దయ్యం - అందమైన మంచు చిరుతపులి



డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

మంచు పర్వతాలకు అందాలను అద్దే జంతువులుగా "మంచు చిరుత పులులు" లేదా "స్నో లివర్డ్స్"లు మన మనసులను దోచుకుంటూనే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా మంచు చిరుత పులుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ, జీవ వైవిధ్యానికి విఘాతంగా నిలుస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వీటి సంఖ్య 3,920 నుంచి 6,590 వరకు మాత్రమే ఉండడాన్ని గమనించారు. వీటి వీటి వాస్తవ సంఖ్యను నిర్ధారించడం కష్టమే అయినప్పటికీ అంచనాలు వేయడం కొనసాగుతున్నది. ప్రపంచ దేశాల్లో మంచు చిరుతల సంఖ్య అత్యధికంగా చైనా (2,000 – 2,500)లో ఉండగా, మంగోలియా రెండవ స్థానంలో నిలిస్తున్నది. ఈ రెండు దేశాలతో పాటు ఇండియా, అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్, భూటాన్ లాంటి మరో 12 దేశాల్లో కూడా ఈ జంతువులు మనుగడ సాగిస్తున్నాయి. అంతర్జాతీయ మంచు చిరుత పులుల దినోత్సవం : "అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సంఘం (ఐయూసిఎన్)" అధ్యయనాల ప్రకారం మంచు చిరుత పులుల మనుగడ ప్రశ్నార్థకంగా మారినుందని హెచ్చరిస్తున్నది. అంతరించే జీవ జాతుల జాబితాలో చేరడానికి దగ్గరగా ఉందని, ఈ జంతువులను పరిరక్షించుకోని యెడల రానున్న తరాలకు ఇవి కనిపించకుండా పోతాయని, కేవలం ఫోటోల్లో లేదా వీడియోల్లో మాత్రమే చూడాల్సి వస్తుందని విన్నవిస్తున్నారు. ఈ గంభీరమైన విషయాన్ని గుర్తించిన ఐరాస జనరల్ అసెంబ్లీ, వీటిని పరిక్షించుకోవడానికి కృషి చేయాల్సిన అవసరం ఏర్పడిందని తెలుపుతూ ప్రతి ఏట 23 అక్టోబర్ 23 రోజున "అంతర్జాతీయ మంచు చిరుత పులుల దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ ది స్నో లిపర్డ్స్)" పాటించారని ప్రపంచ దేశాలను కోరుతున్నది.

మంచు చిరుత పులులు తగ్గడానికి కారణాలు: కాల క్రమంలో మంచు చిరుతల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణాలుగా ప్రతికూల వాతావరణ మార్పులు, ఎముకలు/వెంట్రుకల కోసం అక్రమ వేటలు, సహజ ఆహారం అందక పోవడం, మానవ తప్పిదాలతో వీటి సంఖ్య తగ్గడం, వీటి ఆవాసాలు క్రమంగా కుచించుకుపోవడం లాంటివి ఉన్నాయి. అత్యధిక ఎత్తులపై మంచు పర్వతాల్లో నివసించగల మంచు చిరుతలు గర్జించలేవు. ఇవి ఒక రాత్రి పూట 25 మైళ్ల వరకు పరుగు తీయగలవు. వీటికి ఆహారంగా బ్లూ షీప్స్, ఐబెక్స్, హిమాలయన్ తెహర్, మర్మోట్, పీకా, హేర్స్, స్మల్ రొడెంట్స్ లాంటివి ఉపయోగపడుతున్నాయి. మంచులో కలిసి పోగల చర్మం వీటికి రక్షణగా నిలుస్తున్నది. దాదాపు 30 అడుగుల వరకు పైకి దూకగలుగుతుంది. దాదాపు 18 ఏండ్లు జీవించగలడా మంచు చిరుత పులులు అరుదైన, అందమైన, అమాయక జీవులుగా మానవ ఆవాసాలకు దూరంగా మంచు పర్వతాల్లో సంచరిస్తున్నాయి. అయినప్పటికీ మానవ వాంఛనీయ లేదా అవాంఛనీయ తప్పిదాలతో వీటి సంఖ్య తగ్గడం రాబోయే జీవ వైవిధ్య ప్రమాదాన్ని సూచిస్తున్నది. వీటి మనుగడకు అవసరమైన నీరు, ఆహారం, ఆరోగ్యకర జీవనాలను కల్పిస్తూ వీటి శ్రేయస్సుకు పాటుపడదాం.

రేపటి తరాలకు వీటిని అరుదైన ఆస్తులుగా బహుకరిద్దాం.

# కె. జి.బి.వి ని తనిఖీ చేసిన కలెక్టర్



**మహబూబ్ నగర్ 22 వుదయం** కె. జి.బి.వి ని తనిఖీ చేసిన కలెక్టర దేవరకద్ర మండలం కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను బుధవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్. ముందుగా పాఠశాలలో ఆవరణను పరిశీలించి. పాఠశాల ఆవరణం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం కు అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలని పంచాయతీ రాజ్ ఈ ఈ ని ఆదేశించారు. 10 వ తరగతి తెలుగు మీడియం తరగతి గదికి వెళ్ళి విద్యార్థులతో మాట్లాడారు మెనూ, ఆహార నాణ్యత ఎలా ఉంది విద్యార్థులని అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా పదవ తరగతి వార్షిక పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత శాతం సాధించాలని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. కేజీబీవీలో ఉన్న తరగతి గదులను, కంప్యూటర్ లాబ్ వంట గదులను, స్టోర్ రూమ్, తనిఖీ చేశారు. కేజీబీవీ స్టోర్ రూమ్ లో ఉన్నటువంటి వస్తువుల నాణ్యత, స్టాక్ రిజిస్టర్ ను పరిశీలించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనం కూడా పరిశీలించారు. సాంబార్లో సొరకాయ, క్యారేట్ లేకుండా , నీళ్ల లాగా చేయడం గమనించి కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు ఫుడ్ కమిటీ ప్రతి రోజు పరిశీలించాలని మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. మెనూ పాటించక నాణ్యమైన భోజనం అందించక నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. దేవరకద్ర మంలం కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ను బుధవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్. ముందుగా పాఠశాలలో ఆవరణను పరిశీలించి. పాఠశాల ఆవరణం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం కు అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలని పంచాయతీ రాజ్ ఈ ఈ ని ఆదేశించారు.

# పాగుంట ఆలయంలో భక్తుల నిలువు దోపిడీ



**గద్వాల అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి)** జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల నియోజకవర్గం కెటిదొడ్డి మండలంలోని వెంకటాపురం గ్రామంలోని పాగుంట శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో టెంకాయల అమ్మటకు గడిచిన సంవత్సరం ఎనిమిది లక్షల ముప్పై వేలకు టెండరువేయగా ఈ సంవస్సరము ఏడు లక్షల ఎనవై అయిదు వేల రూపాయలకు టెండరు వేసి గడిచిన సంవస్సరము కన్న టెండరు తక్కువతో తీసుకున్న టెండరు దారు టెంకాయలు తక్కువగా విక్రయించ వలసి ఉండగా, గడిచిన సంవత్సరము కంటే ఎక్కువగా విక్రయించి భక్తుల నిలువు దోపిడీ చేయిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. గడిచిన సంవస్సరము జోడి టెంకాయలు ఎనభై రూపాయలకు విక్రయిస్తుండగా, ఈ సంవస్సరము నూటానలభై రూపాయలకు జోడి విక్రయిస్తున్నారని భక్తులు వాపోతున్నారు. చాలా ఎక్కువగా విక్రస్తున్నారని భక్తులు అడుగగా పూజా సామాగ్రి అన్నీ కలిపి ఇస్తున్నాము అంతకన్నా తక్కువగా ఇవ్వలేము ఎవ్వరికీ చెప్పుకుంటావో చెప్పుకో అని తల తిక్క జవాబులు ఇస్తున్నారని వ్యాపారస్థులు చెపుతున్నారని. దేవాళయాల దగ్గర ప్రయివేట్ టెండర్ వ్యక్తుల దోపిడీలకు పట్ట పగ్గాలు లేవని వీరిని పట్టించుకొనే అధికారులే లేరని భక్తులు వాపోతున్నారు. దేవాధాయ శాఖ అధికారులు నిమ్మకు నీరెట్టినట్లు వ్యవహారిస్తున్నారని భక్తులు వారి ఆవేదనను వ్యక్తపరిచారు. హైదరాబాద్ రేంజ్ దేవాధాయశాఖ అధికారులు వీరిపై చర్యతీసుకోవాలని, కళ్ళు మూసుకొని వ్యవహారిస్తున్న ఈఓ ను వెంటనే సస్పెంట్ చేయాలని భక్తులు ఆరోపిస్తున్నారు. శ్రీ పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి పేరు చెప్పుకొని బ్రతికేదానికన్నా శవాలపై చిల్లర ఎరుకొని బ్రతకాలి కానీ ఇదేమి బ్రతుకు అని భక్తులు తమ ఆవేదనను తెలుపుతున్నారు. గద్వాలకు చెందిన ఒక భక్తుడు తన కుటుంబ సమేతంగా పాగుంట శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు వెళ్ళి కొబ్బరికాయలను కొనుటకై శాపు వెళ్లి విచారించాగా ఒక్క టెంకాయ 70 రూపాయలు చెప్పగా, ఎందుకు అంత ధర అని అడుగగా మేము మీకు పూజా సామాగ్రి అన్ని కలిపి ఇస్తామని జవాబు ఇచ్చారని, ఆ విషయమై గడిచిన సంవస్సరములో వేసిన టెండరు దారును ఈ విషయమై విచారించగా డేబై రూపాయల నుండి ఏనబై రూపాయలవరకు జోడి టెంకాయల సెట్ ను ఇచ్చేవారమణి జావాబు ఇచ్చారని భక్తులు తెలియజేశారాణి చెప్పడం జరిగింది. ఈ విషయమై టెంకాయలు విక్రయిస్తున్న వ్యాపారాస్తున్ని ఒక టెంకాయ మాత్రమే ఇవ్వండని అడిగినప్పుడు అలా కుదరదు అన్నీ కలిపి తీసుకోవాల్సిందేనని చెప్పడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు శాంతియుతంగా స్వామి దర్శనానికి వెళ్తన్న సమయంలో గొడవలు ఎందుకని భావించారు. వారు వాదనను ఆపి రెండు కొబ్బరికాయలకు రూ. 140 చెల్లించారు. ఇది జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన భక్తుని సమస్య మాత్రమే కాదు. ప్రతిరోజూ ఆలయానికి వచ్చే వందల మంది భక్తులు కూడా అధికధరలతో దోపిడీకి గురవుతున్నారు. ఆలయంలో జరుగుతున్న కుంభకోణం గురించి ఆలయ అధికారులకు తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. దేవస్థానం నిర్ణయించిన ధరలు ఈ విధంగా ఉండాలని, పూజా సామాగ్రి అంటే అగర్బత్తీలు, పువ్వులు కుంకుమతో కలిపి రూ. 40కి విక్రయించాలని టెండారులో ఉండగా. ఒక్కో టెంకాయ ధర కనీసం 30 సెంటీమీటర్ల వ్యాసార్థంతో ఉండాలి. భక్తులు విడిగా కొబ్బరికాయ అడిగితే రూ. 40కు విక్రయించాలనేది దేవస్థానం నిబంధనల్లో స్పష్టంగా ఉంది. అయినా అవేమీ అమలుకు నోచుకోవడం లేదు. టెంకాయ అమ్మకాలకు వేలంపాట నిర్వహించినప్పుడే నిబంధనలు పొందు పర్చారు. ధరల పట్టికను ఆలయ ప్రాంగణంలోని ప్రతి దుకాణంలో ఏర్పాటు చేయాలి అదనంగా భక్తులకు బురిడీ కొట్టిస్తూ అదనపు ధరలు ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు. నిర్దేశించిన ధరలకే విక్రయించాలని ఆలయం నిర్దేశించిన ధరలకే అమ్మాలని ఆలయ ఈఓ పురేందర్ కుమార్ అన్నారు. అధికంగా తీసుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులు టెంకాయ అడిగితే అంత వరకే ఇవ్వాలని తెలిపారు. అదనంగా పూజా సామాగ్రి అంటగట్టకూడదు. ఈ విషయాన్ని పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటాం అని తెలియజేశారు.

# క్వారీల్లో కాంటాల కిరికిరి లారీ డ్రైవర్లకు తప్పని తిప్పలు.?



**జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 22(వుదయం ప్రతినిధి)** రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మహాదేవపూర్ మండలంలో ఏర్పాటైన ఇసుక క్వారీల్లో కాంటాల కిరికిరి నెలకొని లారీ డ్రైవర్లతో పాటు లేబర్ అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయాంలో మహాదేవపూర్ మండల వ్యాప్తంగా పదుల సంఖ్యలో ఏర్పాటైన ఇసుక క్వారీలో సమస్యలు లేకుండా వే బ్రిడ్జిలు ఏర్పాటు చేసి అధికారుల పర్యవేక్షణలో ఇసుక క్వారీల నిర్వహణ సాగింది అని ప్రజలనుకుంటున్నారు ఇదిలా ఉంటే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మండలంలో ఏర్పాటు చేసిన ఇసుక క్వారీల్లోని ఓ క్వారీలో మూడు ప్రైవేటు కాంటాలు వెలిశాయి. దీంతో వే బ్రిడ్జుల యజమానులు ఎవరికివారు తమ వద్ద తూకం వేసుకొని వేబిల్లులు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తుండడంతో సమయానికి తూకం కాక గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని లారీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎలాంటి ఇబ్బందులు లేకుండా గతంలో క్వారీల నిర్వహణ సాగిందని దీంతో అటు కూలీలకు చేతి నిండా పని దొరికింది ఇటు లారీ డ్రైవర్లు సమయానుకూలంగా క్వారీల నుండి బయలుదేరారు అని స్థానిక ప్రజలు తెలిపారు ఈ ప్రాంతంలో ఇసుక క్వారీలు బంద్ కావడంతో కొందరికి ఉపాధి లేకుండా పోయిందని ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ ఇసుక క్వారీలను ఏర్పాటు చేయడంతో పని దొరుకుతుందనే ఆశతో ఉన్న కూలీలకు కాంటాల యాజమానులు చేసే కిరికిరితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. క్వారీల్లో టీజీఎండిసి ద్వారా మాత్రమే ఏర్పాటైన కాంటాలలో తూకం వేసి వే బిల్లులు అందించి పారదర్శకంగా నిర్వహించాల్సిన క్వారీల్లో ప్రైవేటు వ్యక్తుల ద్వారా ఏర్పాటైన కాంటాలకు అనుమతులు ఉన్నాయా అంటూ ప్రజల్లో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇసుక క్వారీలో కాంటాల యజమానుల మధ్య సమన్వయ లోపంతో దూర ప్రాంతాల నుండి వచ్చే లారీ డ్రైవర్లు క్వారీల్లో పనిచేసే కూలీలకు అనేక రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అధికారులు కాంటాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారా లేక మామూళ్లు గా వ్యవహరిస్తున్నారా అంటూ పలు రకాల ప్రశ్నలు తలెత్తుతున్నాయి ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఇసుక క్వారీలలో పర్యవేక్షించి కూలీలకు లారీ డ్రైవర్లకు సమస్యలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ సమావేశం జయప్రదం చేయండి.

## టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డిని కలిసిన మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు..



**రాయపర్తి అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి):** ఇటీవల కాలంలో విదేశీ పర్యటన విజయవంతంగా ముగించుకుని స్వదేశానికి తిరిగి విచ్చేసిన మనందరి ప్రియతమ నాయకురాలు టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్‌రెడ్డిని, ఎంమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి ప్రభుత్వ పథకాలు ప్రజల్లో వస్తున్న స్పందన రాయపర్తి మండల సమస్యలపై నాయకులతో సుధీర్ఘంగా చర్చించి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డిసహకారంతో సమస్యల పరిష్కరణ కృషి చేస్తానాని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు జాటోత్ హామ్యా నాయక్ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, టిపిసిసి మాజీ కార్యదర్శి బిళ్ళ సుధీర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడో, ఎందరో అభాగ్యులు బలికానున్నారో

### గుంతల రోడ్డు మరమ్మత్తులు జరిగేనా.. ప్రమాదాలను అరికట్టెనా?



**నర్సంపేట అక్టోబర్ 22 వుదయం ప్రతినిధి** నర్సంపేట పట్టణంలోని నల్ల బెల్లికి వెళ్లే ప్రధాన రహదారి మాదన్నపేట రోడ్డు బస్టాండు మొదలుకొని పట్టణ శివారు వరకు కిలోమీటర్ మేర గుంతల రోడ్డు లో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందు లకు గురవుతున్నారు. ఈ రోడ్డులో ఆటోలలో, కారులో నిత్యం ప్రయాణిస్తున్న వారు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ప్రయాణిస్తున్న సమయంలో ఒళ్ళు హూనం అవుతుందని తద్వారా వాహనాలు కూడా తరచూ రిపేర్ల వస్తున్నాయని ఆటో డ్రైవర్లు వారు రోజు మొత్తం ఆటో నడిపి చేసిన సొమ్మంతా రిపేర్లకే పెట్టవలసి వస్తుందని వాపోతున్నారు. గత రెండు సంవత్సరాల కాలం నుండి ఈ రోడ్డును పట్టించుకున్న నాధుడు లేడని ప్రతిరోజు ఇద్దరూ లేక ముగ్గురు వాహనదారులు బండ్లపై నుండి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. వర్షాకాలంలో భారీగా ఏర్పడిన గుంతల్లో నీరు చేరి ఎక్కడ ఏ గుంత ఉందో తెలియక వాహనదారులు నీరు చేరిన గుంతల్లో పడిన సందర్భాలు కూడా ఉన్నాయని ప్రజలు అనుకుంటున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న పట్టిం చుకునే నాధుడే కరువయ్యాడని నర్సంపేట శాసనసభ్యులు మీరైనా స్పందించి మమ్మల్ని బాధల నుండి విము క్తులను చేయాలని ప్రజలు మొరపెట్టుకుంటున్నారు. నర్సంపేట పట్టణం గ్రామపంచాయతీ నుండి మున్సి పాలిటీకి ఎదిగిన కోట్ల నిధులు సమ కోరుతున్న పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సరిలేనందున ప్రజలకు ఇబ్బం దులు గురవుతున్నారని ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి గుంతల రహదారిని సరిచేసి ప్రమాదాలను అరికట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల వాలంటీర్ల ప్రత్యేక శీతాకాల శిబిరం



**మహబూబ్ నగర్ 22 అక్టోబర్ వుదయం** తెలంగాణా గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల ఆధ్వర్యంలో మల్లెబోయినపల్లె గ్రామం నందు ప్రత్యేక 7 రోజుల శీతాకాల శిబిరంను ఏర్పాటు చేయడమైనది. దీనిలో భాగంగా రెండవ రోజు వాలంటీర్లు ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రపరుచుట మరియు సీజనల్ వ్యాధులు గురించి అవగాహన కార్యక్రమంను చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమం నందు మాజీ ఎంపీపీ వెంకటన్న గారు, పంచాయతీ కార్యదర్శి రవీందర్ రెడ్డి గారు, %పీఖూరా% పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయ ప్రకాష్ గారు, గ్రామ పెద్దలు, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీలక్ష్మి మరియు మెంబెర్ సోనీ గారు పాల్గొన్నారు.

## మద్యం త్రాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

**వెల్దండ అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి)** మద్యం త్రాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష పడిన సంఘటన చోటుచేసుకుంది వివరాల్లోకెళ్తే వెల్దండ పోలీస్ ఎన్ఫోర్స్మెంట్ విధులలో భాగంగా మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ నేషనల్ హైవే పై వాహనాలు తనిఖీ చేయుచుండగా, జడ్చర్ల మండలం పెద్ద ఆదిరాల చిన్న ఆదిరాల గ్రామానికి చెందిన చింతకింది నరసింహ అను వ్యక్తి మద్యం సేవించి వాహనము నడుపుతూ రాగా అతనిని వెల్దండ పోలీసు వారు ఆపి టెస్ట్ చేయగా, అతను డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లో దొరికినాడు, అనంతరం వ్యక్తిని కల్వకుర్తి కోర్టు నందు ప్రవేశపెట్టగా జడ్జి జాడ కావ్య అతనికి 2రోజులు సాధారణ జైలు శిక్ష మరియు 600 రూపాయలు జరిమానా విధించినట్లు వెల్దండ ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి


**మండల పశువైద్యాధికారి శ్యాంసుందర్**



**వెల్దండ అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి)** మండల పరిధిలోని కుప్పగండ్ల మరియు బైరాపూర్ గ్రామల లోపశువులకు గాలికుంటు వ్యాధి రోగ నివారణ టీకాలు కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా పశువైద్యాధికారి శ్యాంసుందర్ ఆధ్వర్యంలో రైతులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా ఇప్పించాలని పలు సూచనలు సలహాలు అందించారు, పశువైద్య సిబ్బంది నరేష్ రెడ్డి, నరసింహ, ఫణిందర్ రెడ్డి, శ్రీను, తిరుపతయ్య, గోపాలమిత్రలు బాలు, మొగులయ్య, సాయిబాబా, విజేందర్ రైతులు విష్ణు, భరత్, చెన్నయ్య గౌడ్, రవి, రవీందర్ రెడ్డి, నారయ్య తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి

**తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ మెంబర్ సెక్రెటరీ (జడ్జి) చిలుకమారి పంచాక్షరీ**



**జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి):** పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి అని తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ మెంబర్ సెక్రెటరీ (జడ్జి) చిలుకమారి పంచాక్షరీ అన్నారు బుధవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలంలోని ఎం. జె. పి స్కూల్ అలాగే కస్తూర్బా స్కూల్, గ్రామపంచాయతీ భవనంలో ఏర్పాటు చేసిన విలేజ్ లీగల్ కేర్ అండ్ సపోర్ట్ సెంటర్ను తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ మెంబర్ సెక్రెటరీ (జడ్జి) చిలుకమారి పంచాక్షరీ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలల ప్రిన్సిపాల్స్ తో కలిసి వంటగదులను, డైనింగ్ హాల్స్, టాయిలెట్స్ మరియు తరగతి గదులను జడ్జి పరిశీలించారు. అనంతరం పంచాక్షరి జడ్జి మాట్లాడుతూ పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మంచి నాణ్యతమైన భోజనం అందించాలని మంచి చదువు బోధించాలని, స్కూల్ ప్రిన్సిపాల్ లకు సూచించారు. అలాగే విద్యార్థులతో మాట్లాడుతూ భవిష్యత్తులో మీరు ఏ లక్ష్యం కోసం చూస్తున్నారో ఆ లక్ష్యం అందే వరకు ఉన్నతమైన చదువులు చదివి మీ లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పి.ఎల్.వి మంగళపల్లి శ్రీనివాస్, ఎస్ ఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి దరఖాస్తులు సమర్పించిన ఎమ్మెల్యే జారె



**అశ్వరావుపేట అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి):** అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న పేదకుటుంబాలకు ఆర్థిక చేయూత కోసం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేక చొరవ కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని తెలంగాణ సచివాలయం (సెక్రటేరియట్) లో ముఖ్యమంత్రి సహాయనిధి (సిఎంఆర్ఎఫ్) కోసం స్వీకరించిన 120 దరఖాస్తులను నేడు సంబంధిత అధికారులకు స్వయంగా అందజేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి కుటుంబం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఉపశమనాన్ని పొందేలా నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా వైద్య చికిత్స అవసరమున్న ప్రతి అర్హత కలిగిన కుటుంబం తమ వివరాలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి అందజేయాలని వారికి ప్రభుత్వ నుంచి ఉచితంగా వైద్య సహాయం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

# కొత్తగూడెంలో తొలి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ

**ఖమ్మం వుదయం ప్రతినిధి అక్టోబర్ 22** సిఎస్ఆర్ సమీకరణకు మంత్రి తుమ్మల కృషి దేశంలోనే తొలి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని కొత్తగూడెంలో అత్యాధునిక వసతులతో నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠమైన ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం సెక్రటేరియట్‌లో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణాతో సమావేశమయ్యారు. యూనివర్సిటీ నిర్మాణ ప్రగతిపై చర్చించి, అవసరమైన సూచనలు చేశారు. ప్రపంచంలో రెండో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ కొత్తగూడెంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ కొత్తగూడంలోని



మైనింగ్ కళాశాలను ఎర్త్ సైన్స్ యూనివర్సిటీగా మార్చుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశ విద్యా చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఇది భారతదేశంలో తొలి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ కాగా, ప్రపంచంలో రెండోది మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. ప్రతిష్ఠాత్మక ఈ విద్యాసంస్థకు మాజీ ప్రధాని, ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు ఇవ్వడం ద్వారా తెలంగాణ ప్రభుత్వం గౌరవప్రదమైన నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. ఆధునిక సదుపాయాలు కలిగిన క్యాంపస్ కావాలి" మంత్రి తుమ్మల యూనివర్సిటీని అన్ని రకాల ఆధునిక మౌళిక సదుపాయాలతో, భవిష్యత్ తరాలకు అనుగుణంగా రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. విద్యార్థులు, అధ్యాపకులు సౌకర్యవంతమైన వాతావరణంలో నేర్చుకునేలా తరగతి గదులు, హాస్టళ్లు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు నిర్మించాలన్నారు. యూనివర్సిటీ భవన నిర్మాణ రూపకల్పనను దేశంలోని అగ్రశ్రేణి ఆర్కిటెక్ట్‌ల ద్వారా రూపొందించి, అంతర్జాతీయ ప్రమాణాలకు తగిన మోడల్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. పి హెచ్ డి కోర్సులు వచ్చే ఏడాది నుంచే ప్రస్తుతం ఉన్న మైనింగ్ యూనివర్సిటీలో అండర్ గ్రాడ్యుయేట్ (యు జి) మరియు పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) వచ్చే విద్యా సంవత్సరం నుంచే . కోర్సులు ప్రారంభించాలనే ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యు జె సి) తో చర్చలు జరిపి అవసరమైన అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. "ఈ యూనివర్సిటీ నుంచి భవిష్యత్ భూశాస్త్రవేత్తలు, ఖనిజ నిపుణులు, పర్యావరణ శాస్త్రవేత్తలు దేశ నిర్మాణంలో కీలక పాత్ర సి ఎస్ ఆర్ నిధులతో ప్రాజెక్ట్ ముందుకు ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ నిర్మాణానికి అవసరమైన భారీ నిధుల సమీకరణ కోసం ఎన్ ఎం ఎన్ డి సి సింగరేణి, జరుగుతోందన్నారు. వచ్చే వారంలో ముఖ్యమంత్రిని కలిసి యూనివర్సిటీ నిర్మాణ ప్రణాళిక, నిధుల అంశాలపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. అప్పటివరకు ఆర్కిటెక్ట్ డిజైన్‌లు, ఖర్చు అంచనాలు సిద్ధం చేయాలని" అధికారులను ఆదేశించారు. 300 ఎకరాల్లో భవిష్యత్ శాస్త్రవేత్తల కేంద్రం కొత్తగూడంలో 300 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబోయే ఈ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ, విద్యా–ఉపాధి రంగాల్లో నూతన దిశగా మారనుందని తుమ్మల అన్నారు. "ఈ యూనివర్సిటీ తెలంగాణ విద్యా రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్తుంది. ఇక్కడి నుంచి వేలాది మంది యువ శాస్త్రవేత్తలు తయారవుతారు. ఇది తెలంగాణకు గర్వకారణం అవుతుంది" అని మంత్రి అభిప్రాయపడ్డారు. ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ స్థాపనతో తెలంగాణ విద్యా రంగం కొత్త మైలురాయిని అధిగమిస్తుందని మంత్రి పేర్కొన్నారు. "భూశాస్త్రం, పర్యావరణం, ఖనిజ సంపదల వినియోగం, వాతావరణ మార్పులపై పరిశోధనలో ఈ యూనివర్సిటీ ప్రముఖ కేంద్రంగా నిలుస్తుంది. మన భవిష్యత్ తరాలు ప్రకృతి వనరులను సంరక్షించేందుకు శాస్త్రీయ దృష్టికోణాన్ని అలవరుచుకుంటాయని తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు.

## టీబీ రహిత సమాజం కోసం చిత్తశుద్ధితో పనిచేయాలి: డాక్టర్ సుబ్బారావు



**మధిర, అక్టోబర్ 22(వుదయం ప్రతినిధి)** మండల పరిధిలో పీహెచ్ సీ దెందుకూరులో బుధవారం నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తరపున జిల్లా క్షయ నివారణ ప్రోగ్రాం అధికారి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలతో క్షయనివారణలో ఉత్తమ వైద్యుడుగా గుర్తింపు పొందిన డాక్టర్ వరికూటి సుబ్బారావు ఆకస్మికంగా పీహెచ్ సీ ని తనిఖీ చేసి సిబ్బంది హాజరు వివరాలు, ఫేస్ అటెండెన్స్ గురించి రికార్డ్స్ పరిశీలించి పారా మెడికల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం టీబీ కేసులు నమోదు తెమడ సేకరణ శాంపిల్, టీబీ ముక్త్ భారత్ పని టార్గెట్ ను సిబ్బందినీ అడిగి తెలుసుకొని టీబీ రహిత సమాజం కోసం ప్రతి పారా మెడికల్ సిబ్బంది సహృదయం తో పని చెయ్యాలి అనిప్రజలకు టీబీ గురించి అవగాహన పరిచి, మందులు సకాలలో పేషెంట్ వేసుకోనే విధంగా డాట్ ప్రొవైడర్ సహకరించాలి అని తెలిపారు. టీబీ చిత్ర పటాల అవగాహన నిమిత్తం డాక్టర్ సుబ్బారావు, పారా మెడికల్ సిబ్బంది చేతులు మీదుగా ఆవిష్కరణ చేసి గ్రామాల్లో ప్రజలను టీబీ పై అప్రమత్తంగా ఉండే విధంగా చూడాలని తెలిపారు. దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధ పడుతు ఉచిత మందులు వాడుతున్న కొంతమంది పేషెంట్ కార్డులు తనిఖీచేసి ఆరోగ్య సూత్రాలు బోధించినారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ పృథ్వీ రాజ్, డాక్టర్ చెరుకూరి దివ్య శృతి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వి వెంకటేశ్వర్లు, టీబీ యూనిట్ మధిర ట్రీట్మెంట్ సూపర్ వైజర్ సందీఫ్ టీబీ నోడల్ పర్సన్ లంకా కొండయ్య, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసరావు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ సమావేశం జయప్రదం చేయండి

### వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్



**నర్సంపేట అక్టోబర్ 22 వుదయం ప్రతినిధి** నర్సంపేట పట్టణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో మెదక్ జిల్లా చేగుంట మండలం కర్ణాలపల్లి రేణుక ఎల్లమ్మ ఆలయం ఆవరణలో ఈ నెల 24న జరిగే గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ సమావేశం జయప్రదం చేయాలని మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ పిలుపునిచ్చారు. జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు గోపగాని వెంకట్ గౌడ్ అధ్యక్షతన బుధవారం నిర్వహించినారు. రమేష్ గౌడ్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా తాటి చెట్టు పై నుంచి ప్రమాదవషాత్తు కింద పడి తీవ్రంగా గాయపడిన, చనిపోయిన గీత కార్మికులకు ఎక్స్ గ్రేషియా, నష్ట పరిహారం ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. పెండింగ్ ఎక్స్ గ్రేషియా, పింఛన్లు, కాటమయ్య రక్షణ కవచాలు (కిట్లు )తదితర సమస్యల పరిష్కారం కోసం మహాసభలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సొల్తీ సారయ్య గౌడ్, గోడిశాల సదానందం గౌడ్, మద్దెల సాంబయ్య గౌడ్, మచ్చిక రాజు గౌడ్, కోల వెంకటేశ్వర్లు గౌడ్, గిరాగాని కిరణ్ గౌడ్, తాళ్లపెల్లి చంద్రమౌళి గౌడ్, వేముల శ్రీనివాస్ గౌడ్, పోశాల రవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పోలీస్ స్టేషన్ విధివిధానాలపై అవగాహన కార్యక్రమం




రామకృష్ణాపూర్ /అక్టోబర్ 22 (వృదయం ప్రతినిధి) పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా బుదవారం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ లో ఎస్సై జి రాజశేఖర్ విద్యార్థిని విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఓపెన్ హౌస్ కార్యక్రమానికి పట్టణంలోని తవక్కల్ పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పోలీసులు ఉపయోగిస్తున్న టెక్నాలజీ గురించి, రిసెప్షన్, స్టేషన్ రైటర్, వి హెచ్ ఎఫ్ సెట్, టెలికాన్ఫరెన్స్, ఆన్ లైన్ ఎఫ్ఐఆర్, పార్టు మ్యాప్, ఆయుధాలు భద్రపరచు రూమ్, సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూమ్, మైనర్ డ్రైవింగ్ చేయవద్దని, మోటర్ వాహనాల చట్టాల వివిధ రకాల బందోబస్తు గురించి, విద్యార్థినీ విద్యార్థులకు ఎస్సై అవగాహన కల్పించారు. డయల్ 100, షీ టీం, సైబర్ క్రైమ్, ఆయుధాల పనితీరు పై అవగాహన కల్పించారు. విద్యార్థులు జీవితంలో సాధించాల్సిన అంశాల గురించి, చదువు ప్రాముఖ్యత గురించి ఎస్సై తెలియజేశారు.

# 108 102 అంబులెన్స్ ను తనిఖీ చేసిన నేషనల్ క్వాలిటీ ఆడిటర్ జి వెంకటేశ్వర్లు



గద్వాల అక్టోబర్ 22 (వృదయం ప్రతినిధి): ఐజ ప్రైమరీ హెల్త్ సెంటర్ దగ్గర ఉన్న 108 102 అంబులెన్స్ ను తనిఖీ చేసిన నేషనల్ క్వాలిటీ ఆడిటర్ జి వెంకటేశ్వర్లు ఈరోజు ఐజ 108 &102 అంబులెన్స్ లోని రికార్డులు వైద్య పరికరాలు పరిశీలించడం జరిగింది. ఆక్సిజన్ మెడికల్ ఎక్విప్మెంట్ మెడిసిన్స్ అట్రోఫీన్ ఆక్సిటోసిన్ ఎమర్జెన్సీ డ్రగ్స్ తనిఖీ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఐజ మండల ప్రజలందరూ అందుబాటులో ఉండాలని అవసరమైన ప్రజలకు ప్రథమ చికిత్స చేయాలని తక్షణమే స్పందించే తత్వం ఉండాలని ఉద్యోగులకు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది జిల్లా కోఆర్డినేటర్ డి రత్నమయ్య మాట్లాడుతూ అంబులెన్సులు 24 గంటలు అందుబాటులో ఉంటావని తెలపడం జరిగింది 108 కి కాల్ చేసిన ప్రతి ఒక్కరికి తక్షణమే స్పందించి క్షతగాత్రులను దగ్గరలో ఉన్న గవర్నమెంట్ హాస్పిటల్ కు చేరవేయబడుతుంది ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ నర్సింలు మరియు పైలెట్ ఈదన్న కెప్టెన్ భార్గవ్ హైమద్ పాల్గొనడం జరిగింది

# జిల్లాలోని రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం

♦ జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్



గద్వాల అక్టోబర్ 22 (వృదయం ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని బుధవారం రోజు కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంబంధిత పౌరసరఫరాల అధికారులు, జిల్లాలోని రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైస్ మిల్లులకు కేటాయించిన సిఎంఆర్ లక్ష్యాలను పూర్తిచేసే విధంగా ఆయా రైస్ మిల్లర్ల నిర్వాహకులు కృషి చేయాలని కోరారు. ఖరీఫ్ 2025-26 సంవత్సరానికి సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ నవంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభించడం జరుగుతుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మిల్లర్లు సహకరించాలని అన్నారు. మిల్లర్లకు అసౌకర్యం కలగకుండా అవసరమైన గన్ని బ్యాగులు ప్యాడి క్లీనర్లు, రవాణా, గోదాముల ఏర్పాట్లు చేయాలని సంబంధిత పౌరసరఫరాల అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ ఏడాది జిల్లాలో 2.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతుల నుంచి వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నట్లు చెప్పారు. గత సీజన్లో వచ్చిన సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈ ఖరీఫ్ లో ఎలాంటి సమస్యలు రాకుండ ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రైస్ మిల్లుల వారిగా పిపి సెంటర్లను ట్యాగ్ చేసి ధాన్యాన్ని తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, జిల్లా పౌరసరఫరాల అధికారి స్వామి కుమార్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ విమల, రైస్ మిల్లర్స్ సంఘం జిల్లా అధ్యక్షులు రామలింగేశ్వర కామ్లే, కార్యదర్శి సుదర్శన్, మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు

# ఎంజెపి కళాశాల విద్యార్థులకు రక్త పరీక్షలు

- నిర్వహించిన వైద్యులు



గద్వాల అక్టోబర్ 22 (వృదయం ప్రతినిధి): ధరూర్‌లోని పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆయేషా నేతృత్వంలోని ఇంటర్న్‌లు ఆశాలతో కూడిన వైద్య బృందం 2025 అక్టోబర్ 22న ధరూర్‌లోని ఎంజెపిటిబిసిడబ్ల్యుఆర్‌డిసిడబ్ల్యులో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించింది. విద్యార్థులకు రక్త (హెచ్‌బి) పరీక్షలు నిర్వహించగా వైద్యులు విశ్లేషించి యువ బాలికలకు సాధారణ హెచ్‌బి స్థాయిల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ బృందం ఆరోగ్యకరమైన హెచ్‌బి స్థాయిలు, సాధారణ అయోడిన్ స్థాయిలు మొత్తం ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరచాలి నిర్వహించాలి అనే అంశంపై ఒక సెషన్ నిర్వహించింది. ఎంజెపి కళాశాల అందించిన డైట్ మెనూను వారు అభినందించారు అందించిన ఆహారాన్ని వృధా చేయకుండా విద్యార్థులు బాగా పోషకాహారం తీసుకోవాలని చెప్పారు ప్రోబయోటిక్ తీసుకోవడం నీరు తీసుకోవడం పరిశు భ్రత రోజువారీ స్నానం, బట్టలు ఎండలో ఆరబెట్టడం, జుట్టు శుభ్రపరచడం, గోర్లు కత్తిరించడం, సమతుల్య ఆహారం మొదలైన వాటిపై వారు నొక్కి చెప్పారు ఈ సందర్భంగాగా ప్రిన్సిపాల్ హుస్సేనప్ప గమెడికల్ ఆఫీసర్ వారి బృందానికి అభినందనలు తెలియజేసారు

# శ్రీ పాగుంట లక్ష్మీ వెంకన్న స్వామి వారి రథోత్సవం

-రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



గద్వాల అక్టోబర్ 22 (వృదయం ప్రతినిధి): గద్వాల నియోజకవర్గం కె టి దొడ్డి మండలం పాగుంట శ్రీ స్వయంబు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి రథోత్సవం అంగరంగ వైభోగంగా జరిగింది ఈ రథోస్సవాన్ని తిలకించిడానికి తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్,కర్ణాటక, మహారాష్ట్ర ల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వారి మొక్కులు తీర్చుకుంటారని బుధవారం ఒక్క రోజే దాధాపు ఇరవై అయిదు వేల మంది దర్శించుకున్నారని ఆలయ ఈ ఓ పురేందర్ చెప్పడం జరిగింది శ్రీ శ్రీ పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు జాతర సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి దేవాలయంలో స్వామి వారికి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం రథోత్సవాన్ని పూజలు నిర్వహించి . స్వయంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా రథోత్సవం లాగారు రథోత్సవాన్ని ప్రారంభించారు ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ జాతర సందడి మొదలైంది. జోగులాంబ గద్వాల జిల్లా కేటి దొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ పాగుంట లక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనాయి. నేటి నుంచి తెలంగాణలో జాతర్ల సందడి మొదలైతాయని అన్నారు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో రైతులందరూ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సుఖశాంతులతో పాడి పంటల తో కళకళాలడాలని నిండు నూరేళ్ల జీవించాలని మనస్ఫూర్తిగా దేవున్ని ప్రార్థిస్తున్నాను. అని అన్నారు జాతరకు వచ్చే భక్తులకు అన్ని వసతులను కల్పించే విధంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురవ హనుమంతు, జిల్లా సీనియర్ నేత గడ్డం కృష్ణారెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీధర్ గౌడ్, ఆలయం కమిటీ చైర్మన్ బోయ వెంకటరాములు, మాజీ ఆలయం కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్ మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, మాజీ సర్పంచ్ ఆంజనేయులు నాయకులు ఉరుకుంద, నవీన్ రెడ్డి, యుగంధర్ గౌడ్, శేఖర్ రెడ్డి,రాజేష్, చంద్రశేఖర్, తిమ్మారెడ్డి , గోపాల్ రెడ్డి, అమరేష్, గోపి, శేఖర్ రెడ్డి, పవన్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రి లో ఘనంగా అశ్వకుల్లాఖాన్ జయంతి వేడుకలు



మందమర్రి, అక్టోబర్ 22(వృదయం విలేకరి): మందమర్రి ప్రముఖ స్వతంత్ర సమరయోధులు అశ్వకుల్లా ఖాన్ జయంతి వేడుకలు మాజీ ఆర్మీ జవాన్ రాజేష్ కుమార్ పులిహార విహాల్ దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు పట్టణంలోని సింగరేణి హైస్కూల్లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అశ్వకుల్లా ఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్లోని షాజహాన్ పూర్ ముస్లిం కుటుంబంలో జన్మించి చిన్న వయసులోనే దేశభక్తి బావానని పెంపొందించుకొని స్వాతంత్ర పోరాటంలో ఆసక్తిని పెంచుకొని గాంధీజీ సహాయాన్ని నిరాకరణ ఉద్యమంతో స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నాడన్నారు. చిన్నతనం నుండి దేశ స్వతంత్రం కోసం వీరోచితంగా పోరాడి దేశ స్వతంత్రం కోసం వీర మరణం పొందారని ఆయన సేవలను కొనియాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుండి దేశభక్తిని పెంపొందించుకోవడంతోపాటు స్వాతంత్ర సమరయోధులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు అనంతరం రాజేష్ విహారు మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తి భావాన్ని పెంపొందించే లక్ష్యంతో పాఠశాలలో స్వాతంత్ర సమరయోధుల మహనీయుల జయంతి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# బైక్ అదుపుతప్పి మహిళ అక్కడికక్కడే మృతి



ధర్మపురి అక్టోబర్ 22(వృదయం విలేకరి): బైక్ అదుపుతప్పి మహిళ అక్క డికక్కడే మృతి చెందిన ఘటన బుధవారం నెరేళ్ల వద్ద చోటుచేసుకుంది.స్థానికుల కథనం ప్రకారం మండలంలోని నెరేళ్ల గ్రామానికి చెందిన వేముల. పుష్పలత (50) సాయంత్రం వ్యవసాయ పని నిమిత్తం వెళ్లి పత్తి బస్తాను బైక్ పై తీసుకుని తిరిగి ఇంటికి వస్తుండగా గేద హఠాత్తుగా రొడ్డు పైకి అడ్డుగా రావడంతో బైక్ పై నుండి ఆమె ఎగిరి రోడ్డు పైన పడింది.తలకు తీవ్రమైన గాయమై తీవ్ర రక్తస్రావం జరిగి పుష్పాలత అక్కడికక్కడే మృతి చెందింది.బైక్ పై ఉన్న మరో ఇరువురు కసారపు. సంతోష్,మేడి.గౌరవ్వ లకు స్వల్ప గాయాలయ్యాయి.వారిని మెరుగైన వైద్యచికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.మృతురాలికి భర్త వేముల చంద్రయ్య ,ఈమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు.పోలిసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

# మండల బీజేవైఎం అధ్యక్షుని ఎన్నిక



జన్నారం, అక్టోబర్ 22(వృదయం విలేకరి) జన్నారం మండల నూతన బిజెవైఎం అధ్యక్షులుగా కందుల రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ ఆధ్వర్యంలో రమేష్ ను నియమించారు.దేవునిగూడ గ్రామ స్థాయిలో పార్టీ తరపున ఆయన చేసిన సేవలను, పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పార్టీ కోసం నా వంతు కృషి చేస్తానన్నారు. బీజెవైఎం మండల అధ్యక్షులుగా నియమించినందుకు రితేష్ రాథోడ్ కు ధన్యవాదాలు తెలియజేశారు.

# కార్యాలయం ఆఫీస్ బోర్డు కు నల్ల రంగు పూయించిన ఆర్టిఏ అధికారులు




గద్వాల అక్టోబర్ 22 (వృదయం ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని మానవపాడు మండలం...జల్లాపూర్ స్టేజి సమీపంలో జాతీయ రహదారి పై ఏర్పాటు చేసిన బార్డర్ చెక్ పోస్ట్ ను రాష్ట ప్రభుత్వ నిర్ణయం మేరకు మూసి వేసిన అధికారులు.

# మిత్ర ఇండస్ట్రీస్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే

నారాయణపేట అక్టోబర్ 22(వృదయం ప్రతినిధి): నారాయణపేట జిల్లా కోటకొండ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ మిత్ర ఇండస్ట్రీస్ 4 టన్ రైస్ మిల్ ను ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని స్థానిక యువతకు ఉపాధి దొరకడమే కాకుండా ఆర్థికాభివృద్ధికి దోహదం అవుతుందని తెలిపారు. ప్రభుత్వ పథకాల సాయంతో చిన్న మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్,శివన్న సైన్యం యూత్ కుర్వ మనోజ్, మసి పవన్, బండి ఆనంద్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలి

-జిల్లా కలెక్టర్ శిక్త పట్నాయక్



నారాయణపేట టౌన్ అక్టోబర్ 22(వృదయం ప్రతినిధి): ఎస్సీ ఎస్టీ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం త్వరగా అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో షెడ్యూల్ కులాలు తెగల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ కేసులను పోలీసు అధికారులు సీరియస్ గా తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. సమావేశంలో డిఎస్పి నల్ల పు లింగయ్య 2023 లో 31, 2024 లో 34, 2025 లో ఇప్పటిదాకా 13 ఎస్సీ ఎస్టీ కేసులు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల లో నమోదు అయ్యాయని, వాటిలో 13 కేసులకు గాను 3 కేసులు చార్జిషీట్ కు రెడీగా ఉన్నాయని, మిగతావి విచారణ దశలో ఉన్నాయనీ, మరి కొన్ని కేసులకు సంబంధించి డాక్యుమెంట్స్ రావాల్సి ఉందని తెలిపారు. ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించి బాధితులకు నష్టపరిహారం అందించడంలో బడ్జెట్ కారణంగా ఆలస్యం జరుగుతుందని సి సెక్షన్ అధికారిని రాణి దేవి జిల్లా కలెక్టర్ కి తెలిపారు. బడ్జెట్ వచ్చిన వెంటనే రెండు వారాలకోసారి నష్టపరిహారం చెల్లించే విధంగా చూస్తామని ఆమె చెప్పారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీకి తమ పోలీసు శాఖ పరంగా పూర్తి స్థాయి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, షెడ్యూల్ కులాలు తెగల అభివృద్ధి అధికారి అబ్దుల్ ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్రా యాత్రికులను సన్మానించిన పేట ఎమ్మెల్యే



నారాయణపేట అక్టోబర్ 22(వృదయం ప్రతినిధి) : నారాయణపేట పట్టణానికి చెందిన పలువురు ముస్లిం సోదరులు పవిత్ర ఉమ్రా(మక్కా) యాత్రకు వెళ్తున్న సందర్భంగా వారిని బుధవారం ప్రభుత్వ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్. చిట్టెం. పర్ణిక రెడ్డి పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్ర మక్కా యాత్ర సఫలం కావాలని,నారాయణపేట నియోజకవర్గం అభివృద్ధి కోసం,మరియు ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ప్రార్థించాలని యత్రికులను కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి. సలీం, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు మహిమోద్ ఖురేషి, యూత్ అధ్యక్షులు యూసుఫ్ తాజ్, పోర్ల మైనొద్దీన్, మున్వర్, అహ్మద్ లాటి,కుత్భుద్దీన్,షా నావజ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# 17 రకాల వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేయాలి సిఐటియు డిమాండ్




గద్వాల అక్టోబర్ 22 (వృదయం ప్రతినిధి): కేరళ తరహాలో కేంద్ర ప్రభుత్వం దేశావ్యాప్తంగా 17 రకాల వెల్ఫేర్ బోర్డులు వెంటనే ఏర్పాటు చేయాలని ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు డిమాండ్ చేశారు. బుధవారం రోజు జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వాల్మీకి కమ్యూనిటీ హాల్లో జరిగిన హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ మూడవ జిల్లా మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో కార్మికుల సంక్షేమం కోసం అక్కడి ప్రభుత్వం 17 రకాల వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేసిందని,కేంద్ర ప్రభుత్వం కూడా ఆ విదంగా కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.కేరళ రాష్ట్రంలో హమాలీ కార్మికుడు చనిపోతే అక్కడి ప్రభుత్వం 16 లక్షలు పరిహారాన్ని చెల్లిస్తుందని,ప్రమాదం జరిగి గాయపడితే 7 లక్షల రూపాయలు అందిస్తున్నదని, విద్యా,గృహ అవసరాల కోసం రుణాలను అందిస్తుందని, 60 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి పింఛన్ అందిస్తుందని తెలిపారు.దేశవ్యాప్తంగా ఎగుమతి దిగుమతుల రంగంలో, వస్తు సేవలను అందించడంలో దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న హమాలీలకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ప్రశ్నించారు. ఐఎల్ ఓ నిబంధనల ప్రకారం కార్మికుడి చేత 50 కేజీ ల కంటే ఎక్కువ బరువు చేయించకూడదని,కానీ హమాలీ కార్మికులతో క్వింటల్ కంటే ఎక్కువ బరువు పని చేయిస్తూ కార్మికుల అనారోగ్యాలకు కారణం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీ రంగ కార్మికులకు పని ప్రదేశాలలో హమాలీ అడ్డాలను ఏర్పాటు చేయకపోవడం వల్ల ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని,హమాలీ కాలనీలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.ప్రభుత్వ భూములను,10 శాతం స్థలాలను కబ్జాదారులు ఆక్రమించుకుంటూ ఉంటే చూస్తూ ఊరుకున్న ప్రభుత్వం,అధికార యంత్రాంగం సంపద సృష్టికి మూలమైన కార్మిక వర్గానికి స్థలాలు కేటాయించడానికి మాత్రం ఆసక్తి చూపడం లేదన్నారు.అడ్డా మీది హమాలీలకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకపోవడం వల్ల కొన్ని సందర్భాలలో కూలీ పని దొరకక కుటుంబంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.లక్షల కోట్ల ప్రజాధనాన్ని వృధా చేస్తున్న ప్రభుత్వము కార్మిక వర్గ ఉపాధికి ఎందుకు గ్యారెంటీ ఇవ్వటం లేదని ప్రశ్నించారు.నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేటి తరుణంలో హమాలీ కార్మికులు తమ పిల్లలకు నాణ్యమైన విద్య, వైద్యాన్ని అందించడం అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పని ప్రదేశాలలో ప్రమాదవశాత్తు జరిగే ప్రమాదాలకు యాజమాన్యాలు బాధ్యత వహించకపోవడం వల్ల,ఇటు ప్రభుత్వం నుండి సహకారం అందించకపోవడం వల్ల గాయపడిన కార్మికుడు ఇంటి దగ్గరే ఉండాల్సి వస్తుందని, దీని వల్ల కుటుంబం మొత్తం పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీలకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు జారీ చేయకపోవడం వల్ల సంక్షేమ పథకాల అమలులో వెనుకబడి ఉన్నారని అన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యత హమాలీ రంగ కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కుటుంబ సభ్యుల విద్య, వైద్యం, గృహ అవసరాల కోసం ప్రభుత్వమే రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.అంతకుముందు మహాసభలకు ప్రారంభ సూచికగా హమాలీ సంఘం సీనియర్ నాయకులు బీముడు సీఐటీయు జెండాను ఎగరవేశారు.అనంతరం ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ నూతన జిల్లా కమిటీని 21 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా గౌరవ అధ్యక్షులుగా వివి నరసింహ,జిల్లా అధ్యక్షులుగా బి. ఈశ్వర్, ప్రధాన కార్యదర్శి గా నరేష్ ఉపాధ్యక్షులుగా బీమన్న, అంజి, గంగన్న కార్యదర్శులుగా బి. నర్సింహా, కుమార్, కోశాధికారిగా వీరేష్ కమిటీ సభ్యులుగా రఫీ,శ్రీను,నగేష్, ఈరన్న, నర్సింహా, మౌలాలి,పల్లెన్న,యాదన్న, కృష్ణ, సురేష్, నర్సింహా లను ఎన్నుకున్నారు. మహాసభలకు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏ వెంకటస్వామి,వివి నరసింహ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ, తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేటు రోడ్డు ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎం. వెంకటేశ్వర్లు, హమాలీ కార్మికులు నర్సింహా, బాలకృష్ణ,రఘు,రంగన్న,కృష్ణ,మల్లేష్, రాజన్న,రఫీ,వివిధ మండలాల నుండి వచ్చిన హమాలీ కార్మికులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

డిమాండ్

1. భవన నిర్మాణ కార్మికుల తరహాలో హమాలీ కార్మికుల కు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.
2. హమాలీ కార్మికులకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి, గుర్తింపు కార్డులు ఇవ్వాలి.
3. హమాలీ కార్మికులకు ప్రత్యేక అడ్డా స్థలాలు కేటాయించి, షెడ్లు నిర్మాణం చేసి ఇవ్వాలి.
4. హమాలీ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి.
5. కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా పోరాడాలి.
6. గద్వాల దాన ఫ్యాక్టరీ లో ఉత్పత్తిని నిరంతరం కొనసాగించి, కార్మికులకు ఉపాధి కల్పించాలి

# 24 న బీసీ లు చలో హైదరాబాద్



జన్నారం,అక్టోబర్ 22(వుదయం విలేకరి) 42 శాతం బీ సీ రిజర్వేషన్ల సాధనకై హైదరాబాదు లో నిర్వహించనున్న మహా ధర్నాకు జిల్లా నుండి బీసీ సంఘాల నాయకులు హాజరుకావాలని బీ సీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో కన్వీనర్ కాసెట్టి లక్ష్మణ్ కోరారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ బీ సీ రిజర్వేషన్ల బిల్లును 9 వ షెడ్యూల్ లో చేర్చాలనే డిమాండ్ తో 24న శుక్రవారం రోజున ఉదయం 10 గంటలకు హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద బీసీ మహా ధర్నా నిర్వహించబోతున్నారని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీఐఎఫ్ మేధావుల ఫోరం చైర్మన్ మాజీ ఐఏఎస్ అధికారి టీ. చిరంజీవులు, హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఈశ్వరయ్య, విశారధన్ మహారాజు పాల్గొంటున్నారన్నారు. ఈ మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయటానికి మన తెలంగాణ రాష్ట్రంలోని ముప్పై మూడు జిల్లాల నుంచి బీ సీ కులాలకు చెందిన అన్ని వర్గాల వారు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య, కో కన్వీనర్ కదార్ల నరసయ్య, మూల భాస్కర్ గౌడ్, మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఆడేపు లక్ష్మీనారాయణ, ఖానాపూర్ నియోజకవర్గ కో కన్వీనర్ ఆంధ్ర పురుషోత్తం, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గూడ అశోక్, మహేంద్ర సంఘం నాయకుడు కోడి జుట్టు రాజయ్య, పిల్లి మల్లయ్య, జన్నారం మండల పూసల సంఘం మాజీ అధ్యక్షుడు గుడ్ల రాజన్న , కానుగంటి రాజన్న తదితరులు పాల్గొన్నారు.

# కోహెడ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు ఓపెన్ హౌస్ నిర్వహణ



హుస్నాబాద్,అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి): కోహెడ పోలీస్ స్టేషన్‌లో బుధవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్ డే కార్యక్రమం భాగంగా ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోహెడ ప్రభుత్వ హై స్కూల్‌కు చెందిన సుమారు 100 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై పి. అభిలాష్ మాట్లాడుతూ... పోలీస్ శాఖ నిర్వహణ విధానం, చట్టాల అమలు, కేసుల నమోదు, నేరస్తుల పట్టివేత, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణలో పోలీసుల పాత్ర గురించి వివరించారు. అలాగే మహిళలు, పిల్లల రక్షణకు సంబంధించిన చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల ముప్పు, సైబర్ నేరాల అవగాహనపై విద్యార్థులకు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌లోని వివిధ గదులు, సీసీ కెమెరాల పని తీరు, డయల్ 100 ప్రాముఖ్యత, బ్లూ కోర్స్, పెట్రో కార్ విధులు, పోలీసుల ప్రధాన బాధ్యతలు గురించి కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదనంగా, పోలీసులు ఉపయోగిస్తున్న నూతన సాంకేతిక పద్ధతులు, సీఈఆర్ ద్వారా మొబైల్ ఫోన్ల రికవరీ, కమ్యూనికేషన్ విహెచ్‌ఎఫ్ సెట్ వినియోగం వంటి అంశాలపై ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేరస్తురాలు తహేరను అరెస్ట్ చేసిన పోలీసులు



కొండపాక,అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి): కుకునూరుపల్లి మండల పరిధిలోని కొడకండ్ల గ్రామంలో ఈనెల 16వ తారీఖున జరిగిన చోరీ కేసు వివరాలను బుధవారం రోజు కుకునూరు పల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు గజ్వేల్ ఏసిపి నరసింహులు. వివరాల్లోకి వెళితే కొడకండ్ల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో నివసిస్తున్న జూపల్లి లక్ష్మి రోజులాగే కూలీ పనులకు వెళ్ళేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లి తిరిగి సాయంత్రం వచ్చి చూసె సరికి ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోకి వెళ్లిన దొంగలు బీరువాలో దాచిపెట్టుకున్న ఐదు గ్రాముల బంగారు కమ్మలు, రెండు గ్రాముల బంగారు మాటీలు, 25 తులాల పెద్ద పట్టగొలుసులు, 14 తులాల చిన్నపట్టగొలుసులు ఎత్తుకుపోయారని కుకునూరు పల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారని, ఈ చోరీ కేసులో భాగంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు జూపల్లి లక్ష్మి ఇంటి పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాలు తో పాటు, టెక్నాలజీ ఉపయోగించి నింధితులను పట్టుకునే క్రమంలో అదే గ్రామానికి చెందిన మహమ్మద్ తహేర భర్త అబ్దుల్ 40 సంవత్సరాలు గల ఆవిడ పై అనుమానం తో కుకునూరుపల్లి నుండి సిద్దిపేటకు వెళ్లే క్రమంలో బస్సు కోసం ఎదురుచూస్తున్న సమయంలో అరెస్టు చేసి విచారించి ఆమె దగ్గర ఉన్న వస్తువులను స్వాధీన పరుచుకున్నట్టు తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి నిందితురాలను పట్టుకున్నందుకు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తో పాటు పోలీస్ సిబ్బంది రమేష్ లను అభినందిస్తూ వీరికి రివార్డు అందజేయడం కోసంగాను సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ కు విన్నవించామని తెలిపారు.

# మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలి



బెల్లంపల్లి, అక్టోబర్22 (వుదయం ప్రతినిధి) జి ఓ నెం51 ని సవరించి మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు జిల్లా జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం డిమాండ్ చేశారు. బుధవారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబీలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో పోస్టర్స్‌ను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ. ఈనెల 24,25వ తేదీల్లో మహబూబాబాద్ జిల్లాలో జరుగనున్న రాష్ట్ర 5వ మహాసభలను విజయవంతం చేయాలని రాజారాం పిలుపునిచ్చారు. ఈ మహాసభకు సీఐటీయూ అఖిలభారత కోశాధికారి సాయిబాబు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాపాలడుగు భాస్కర్ హాజరవుతారని అన్నారు. గ్రామాల పరిశుభ్రతలో ముందు వరుసలో ఉండే పంచాయతీ కార్మికుల సమస్యల గురించి ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సకాలంలో వేతనాలు అందించక ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. మరోవైపు అధికారులు అధిక పని భారం మోపుతూ తొలగిస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతుండడం శోచనీయమని అన్నారు. మహాసభల్లో గతంలో చేసిన పోరాటాలను సమీక్షించుకొని, భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తూ తీర్మానిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ అకలా అలీ, బాబా అక్బర్ అలీ, జంగపల్లి హంసరాజు, ఇప్ప రాజయ్య ,కార్మికులు పాల్గొన్నారు.

# కార్తీకమాసంలో గోదావరి నదికి విశేష పూజలు,హారతి



ధర్మపురి అక్టోబర్ 22(వుదయం విలేకరి): కార్తీకమాసం పురస్కరించుకుని ధర్మపురిలో గోదావరి మాత కు మొదటిరోజు స్థానిక శారదా మహిళా మండలి సభ్యులు , వాసవి మహిళా మండలి సభ్యులు తిరుమల సేవా గ్రూప్ కరీంనగర్ సభ్యులు , శ్రీవల్లి సేవ గ్రూప్ పెద్దపెల్లి ,దేవస్థానం అర్చకులు సిబ్బంది భక్తులు శ్రీలక్ష్మి నరసింహస్వామి వారి ఆలయం నుండి మేళతాళాలతో,హరినామ సంకీర్తనలతో గోదావరి నదివరకు వచ్చి విశేష పూజలు,హారతి అనంతరం గోదావరి నదికి దీపాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసా చార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్,ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు,అర్చకులు నంబి నరసింహమూర్తి, చిలకముక్కు అశ్విన్ కుమార్ , నంబి అరుణ్ కుమార్,అభిషేకం పురోహితులు బొజ్జ సంతోష్ కుమార్,సంపత్ కుమార్, రాజగోపాల్,అర్చకులు, సిబ్బంది మహిళలు పాల్గొన్నారు.

## కొమరం భీం కు ఘన నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



జన్నారం, అక్టోబర్ 22(వుదయం విలేకరి) జల్ జంగిల్, జమీన్ నినాదంతో అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన ధీరుడు. ఆదివాసుల ఆత్మ గౌరవాన్ని చాటి చెప్పిన యోధుడు స్వేచ్ఛ సమానత్వం కోసం ప్రాణాలను అర్పించిన మహనీయుడు కొమురం బీం అని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ సందర్బంగా బుధవారం రోజున ఇందనపల్లి చౌరస్తా వద్ద గల కొమరం భీం విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముజఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం,ఏఎంసీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ ఇసాక్, మామిడిపల్లి ఇందయ్య, కంటెం శంకర్, అజ్మీరా నందు నాయక్, ముత్యం సతీష్, రియాసత్ అలీ, బాదావత్ సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి మార్కవుట్



నిజాంసాగర్, అక్టోబర్ 22(వుదయం ప్రతినిధి): నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రెండు గృహాలు లబ్దిదారులకు మంజూరు కాగా ప్రజాప్రతినిదులు, అధికారులు అట్టి ఇండ్లకు ముగ్గు పోసి భూమిపూజ చేశారు. ఇండ్లను త్వరగా నిర్మించుకున్న వారికి బిల్లులు త్వరగా వస్తాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో సునీత రెడ్డి గ్రామపంచాయతీ గ్రామపంచాయతీ కార్యదర్శిబి భారతి మరియు గ్రామ పెద్దలు గుర్రపు శ్రీనివాస్ పటేల్ గుర్రపు వెంకటేశం పెద్దల సాయిలు గుర్రపు జయరామ్ రాజం గంగారం చిన్నోల జగన్ కురుమ సాయిలు కమ్మరకత్త అంజయ్య రాజం సాయిలు దుర్గ కాశీరాం తదితరులు పాల్గొన్నారు.

# పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు




నిజాంసాగర్, అక్టోబర్ 22(వుదయం ప్రతినిధి): మండలంలోని మగ్దూంపూర్ గ్రామంలో పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మగ్దూంపూర్ గ్రామంలో పేకాట ఆడుతున్నరన్న సమాచారం తో రెండు ప్రదేశాలలో రైడ్ చేసి, ఒక దగ్గర ముగ్గురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుండి 3220 రూపాయల నగదు, 52 పేక ముక్కలు, 3 సెల్ ఫోన్స్, స్వాధీన పరచుకొని మరొ పేకాట స్థావరం వద్ద 6 గురు వ్యక్తులను అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుండి 2080 రూపాయలు, 5 సెల్ ఫోన్లు స్వాధీన పరచుకొని వారి పై రెండు వేరు వేరు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెళ్ళడిరచారు.

# ఉరి వేసుకుని వ్యక్తి మృతి



కొండపాక,అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి): మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మార్వాడి దేవానందం తండ్రి యాదయ్య వయస్సు 45 సంవత్సరాలు గల వ్యక్తి డిసిఎం డ్రైవర్ గా జీవనం కొనసాగిస్తుండేవాడు. బుధవారం ఉదయం తన సొంత వ్యవసాయ భూమిలో చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయాడని మృతుని భార్య మార్వాడి మమత ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు కుక్కునూరు పల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు

## పొలంబాట రోడ్లకు శంకుస్థాపన నిర్వహించిన సిర్పూర్ శాసనసభ్యులు

### డా. పాల్వాయి హరీష్ బాబు



సిర్పూర్(టి) అక్టోబర్ 23 (వుదయం ప్రతినిధి) కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టి మండలంలోని పారిగాం గ్రామంలో ఆర్ అండ్ బి రోడ్డు నుండి గంగ వరకు మరియు లోనవెల్లి గ్రామంలో బారేవాడ నుండి వార్ధా నది వరకు జాతీయ ఉపాధి హామీ పథకం కింద రెండు రోడ్లు కలిపి రూ.30 లక్షల అంచనాతో మంజూరైన పొలంబాట రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమైన జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేలకు, పొలాలకు గ్రావెల్ రోడ్లు వేస్తున్నామని, ప్రతి గ్రామంలో 2 కిలోమీటర్లకు తక్కువ కాకుండా రోడ్లు నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు లావణ్య, మాజీ జడ్పీటీసీ సత్యనారాయణ, ఎల్మలే మల్లయ్య, నేరెళ్ళ అశోక్, శ్రీనివాస్ గౌడ్, చాప్లే సుధాకర్, బాలాజీ, అభినయ్ కమలాకర్, రమేష్, సంతోష్, ఉద్ధవ్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి

♦ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



బెల్లంపల్లి, అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నెన్నెల మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, రిజిస్టర్లు, వంటశాల, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని తెలిపారు. మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, వ్యక్తిగత పరిశుభ్రత ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యాలయం పరిధిలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థినులకు ఫిజిక్స్ సబ్జెక్టులో పలు అంశాలను బోధించి వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. తహసిల్దార్ శ్రీనివాస్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి హైలతో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, మండల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మొక్కలు నాటేందుకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన పురోగతిని పరిశీలించి రికార్డులను సరి చూసి, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ రకాల ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాలలో చేపట్టిన మూత్రశాలల నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని, ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, నిత్యవసర సరుకులు నిల్వ చేసే గదిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వంట సమయంలో పారిశుద్ధ్య నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మపూర్ గ్రామానికి వైకుంఠ రథం వితరణ

## –హైకోర్టు న్యాయమూర్తి జువ్వాడి. శ్రీదేవి



ధర్మపురి అక్టోబర్22 (వుదయం విలేఖరి):పుట్టిన వాడికి మరణం తప్పదు అనే గీతా సారాంశం ప్రకారం మానవ జన్మ లో చివరి దశ అనంతరం మనిషి శివైక్యం చెందుతాడు. భౌతిక దేహానికి అంత్య సంస్కారాలను సమస్యలు లేకుండా నిర్వహించాలనే ఉద్దేశ్యం తో మండలంలోని తిమ్మపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జువ్వాడి. శ్రీదేవి శ్రీహరిరావు దంపతులు తన తండ్రి కీర్తి శేషులు జువ్వాడి. సూర్యారావు జ్ఞాపకార్థం 3 లక్షల విలువగల వైకుంఠ రథాన్ని తిమ్మపూర్ గ్రామ ప్రజల అవసరాల కోసం గ్రామపం చాయతీ కార్యాలయానికి వితర ణ గావించి, వారి ద్వారానే సేవలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ మనిషి అంత్య దశ అనంతరం అంతిమ సంస్కారాల కు సమస్యలు ఎదురుకాకుండా రథాన్ని తిమ్మపూర్ కు వితరణ ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామానికి వైకుంఠారథాన్ని వితరణ ఇచ్చిన జువ్వాడి. శ్రీదేవి కుటుంబాన్ని గ్రామ ప్రజలు అభినందించారు. వారి వెంట జువ్వాడి. నరసింహారావు, జువ్వాడి.కృష్ణా రావు,వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

♦ రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ సంఘం మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్,అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి):హుస్నాబాద్, జనత న్యూస్:రైతుల ఆర్థికాభివృద్ధి, వ్యవసాయ రంగం పురోగతి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నదని, రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయంగా ముందుకెళుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని కొండాపూర్ సమీప గోమాత పత్తి మిల్లులో సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి తో కలిసి బుధవారం ఆయన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పత్తి తేమ శాతం, కొనుగోలు విధానాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ...కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో కపాస్ కిసాన్ మొబైల్ యాప్ ద్వారా పత్తి కొనుగోలను ప్రారంభించిందన్నారు . ఆ విధంగా తెలంగాణలో తొలి పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఈరోజు హుస్నాబాద్‌లో ప్రారంభించామని తెలిపారు. ప్రతి క్వింటాల్‌కు రూ. 8,100 మద్దతు ధరగా నిర్ణయించినట్లు పేర్కొన్న ఆయన ఈసారి భారీ వర్షాల కారణంగా పత్తి తేమ శాతం ఎక్కువగా ఉన్నా, రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు కొనసాగుతుందన్నారు. రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా ఆన్లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని పత్తిని విక్రయించవచ్చని వివరించారు. అనంతరం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ...సిఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కొత్త కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తున్నామని... వడ్లు కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయన్నారు. అక్కన్నపేటలో సన్‌ఫ్లవర్ విత్తనాల పంపిణీ జరిగిందని, నర్మేటలో ఫామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ట్రయల్ రన్ పూర్తిచేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉందన్నారు. రైతుల ఉత్పాదకత పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ మంత్రి అన్నారు. హార్టికల్చర్, సెరికల్చర్, ఆయిల్ ఫామ్ వంటి రంగాల్లో రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు బంధు, రైతు బీమా పథకాలతో రైతులను బలోపేతం చేస్తున్నామని అన్నారు. త్వరలోనే గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి రైతుల పంట పొలాలకు నీరు అందించనున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

# ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



సిర్పూర్(టి): అక్టోబర్ 22 (వుదయం ప్రతినిధి ): కొమరం భీ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం రోజు 32 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేసిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టాలని, 45 రోజుల్లోపు బేస్మెంట్ పూర్తి చేయని పక్షంలో వారి మంజూరు పత్రాన్ని క్యాన్సల్ చేసి ఇంకో లబ్ధిదారునికి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కొన్ని చోట్ల ఫారెస్ట్ అధికారులు ఇండ్ల నిర్మాణానికి అడ్డు వస్తున్నారని, గ్రామ పంచాయతీ తీర్మానంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, హౌసింగ్ ఏఈ సాజుద్దిన్, మండల అధ్యక్షురాలు లావణ్య, సత్యనారాయణ, అశోక్, శంకర్, శ్యామ్రావు, మారుతి, విలాస్, శ్రీనివాస్ గౌడ్, అశోక్ ఆర్య, అభినయ్, రాజశేఖర్, మహేష్, రంగన్న, రమేష్, బాబు, సంతోష్, ప్రశాంత్, సాయి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.





# బిజినెస్



## ఫ్లాట్‌గా ముగిసిన ముహురత్ ట్రేడింగ్



దీపావళి పండుగ సందర్భంగా స్టాక్ మార్కెట్లలో మంగళవారం జరిగిన ప్రత్యేక సెషన్ 'ముహురత్ ట్రేడింగ్' ఫ్లాట్‌గా సాగింది. దీంతో కొత్త సంవత్-2082 సానుకూలంగా ప్రారంభమైందని చెప్పవచ్చు. దీపావళి పండుగకు ఏదైనా పని మొదలుపెడితే విజయం దక్కుతుందని పెట్టుబడిదారులు నమ్ముతారు. ఈ పర్వదినం రోజు ట్రేడింగ్ చేస్తే, వచ్చే ఏడాది దీపావళి కల్లా లాభాల పంట పండుతుందని విశ్వసిస్తారు. ఈకారణంగానే చాలామంది ట్రేడర్లు, ఇన్వెస్టర్లు ముహురత్ ట్రేడింగ్‌లో పాల్గొంటారు. గంటపాటు జరిగిన ఈ ట్రేడింగ్‌లో భారీ ర్యాలీ లేక పోయినప్పటికీ, సూచీలు స్వల్ప లాభాలను సాధించాయి. దీంతో సెన్సెక్స్ 62 పాయింట్లు పెరిగి 84,426 వద్ద, నిఫ్టీ 25 పాయింట్లు లాభపడి 25,868 వద్ద ముగిశాయి. ట్రేడర్స్, ఇన్వెస్టర్స్ కొత్త అకౌంట్ ఏడాది ప్రారంభానికి గుర్తుగా మధ్యాహ్నం 1.45 గంటలకు మొదలైన ముహురత్ ట్రేడింగ్‌లో మొదట సెన్సెక్స్ 270 పాయింట్ల కంటే ఎక్కువగా ర్యాలీ చేసింది. నిఫ్టీ 25,900కి పైగా ఎగసింది. అయితే, కొద్దిసేపటి తర్వాత మార్కెట్లలో జోరు తగ్గింది. ఆఖర్లో ఒత్తిడి కారణంగా లాభాలు తగ్గాయి. కీలక బజాజ్‌ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, యాక్సిస్‌బ్యాంక్, మహీంద్రా, టాటామోటార్స్ వంటి స్టాక్ రాణించాయి. కోటక్‌మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ సుజుకీ, టీసీఎస్ షేర్లు బలహీనపడ్డాయి. కాగా, దీపావళి బలిప్రతిపద కారణంగా బుధవారం స్టాక్ మార్కెట్లు పనిచేయవు. తిరిగి గురువారమే మార్కెట్లు తెరుచుకుంటాయి.


## బంగారం కొనుగోలుదారులకు భారీ ఊరట

బులియన్ మార్కెట్‌లో బంగారం కొనుగోలుదారులకు ఇవాళ (అక్టోబర్ 22, 2025) ఊరట లభించింది. పసిడి, వెండి ధరలు దేశీయ మార్కెట్‌లో భారీగా పతనమయ్యాయి. ముఖ్యంగా హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ధరలు గణనీయంగా తగ్గడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి ధరలు తగ్గడమే ఈ పతనానికి ప్రధాన కారణమని ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.3,380 తగ్గి, ప్రస్తుతం రూ.1,27,200కు చేరింది. అదేవిధంగా, ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధరపై కూడా రూ.3,100 భారీగా తగ్గింది. ఈ తగ్గుదలతో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,16,600 వద్ద ట్రేడ్ అవుతోంది. సాధారణంగా తెలుగు రాష్ట్రాల్లో దాదాపుగా ఇవే ధరలు కొనసాగుతాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర ఏకంగా %వి%245 మేర పతనమవడంతో, దేశీయ మార్కెట్‌లో ఈ ప్రభావం స్పష్టంగా కనిపించింది. పసిడితో పాటు వెండి ధరలు కూడా తగ్గాయి. కిలో వెండి ధరపై రూ.2,000 తగ్గడంతో, ప్రస్తుత ధర రూ.1,80,000గా ఉంది. బంగారం, వెండి ధరల్లో వచ్చిన ఈ పతనం కొనుగోలుదారులకు శుభవార్తగా మారింది. ఈ ధరల తగ్గుదల వినియోగదారులను, పెట్టుబడిదారులను ఆకర్షించే అవకాశం ఉంది. వివాహాల సీజన్ లేదా ఇతర శుభకార్యాల కోసం బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ఈ తగ్గుదల మంచి అవకాశంగా మారుతుందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, అంతర్జాతీయ పరిణామాల కారణంగా ధరలు మళ్లీ పెరిగే అవకాశం కూడా లేకపోలేదు కాబట్టి, కొనుగోలుదారులు మార్కెట్‌ను నిశితంగా గమనించాలని సూచిస్తున్నారు.



దేశవ్యాప్తంగా ఈ ఏడాది పండుగ సీజన్‌కు భారీగా రిటైల్ వ్యాపారం జరిగింది. ఒక్క దీపావళి సందర్భంగా దేశంలో రికార్డు స్థాయి రూ. 6.05 లక్షల కోట్ల విలువ అమ్మకాలు జరిగాయని వ్యాపారుల సమాఖ్య కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్(సీఏఐటీ) మంగళవారం ప్రకటనలో తెలిపింది. ఇందులో రూ.5.40 లక్షల కోట్లు వస్తువుల అమ్మకాల ద్వారా, రూ. 65,000 కోట్లు సేవల ద్వారా వచ్చాయని పేర్కొంది. ఇటీవలి జీఎస్టీ సంస్కరణలు, బలమైన వినియోగదారుల సెంటిమెంట్ కారణంగా ఈ స్థాయి వ్యాపారం చూశామని సీఏఐటీ అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా 60 ప్రధాన పంపిణీ కేంద్రాల నుంచి సేకరించిన వివరాల

## రూ. 6 లక్షల కోట్లు దాటిన దీపావళి అమ్మకాలు



ఆధారంగా సీఏఐటీ ఈ లెక్కలను వెల్లడించింది. గతేడాది దీపావళి వేళ రూ. 4.25 లక్షల కోట్ల అమ్మకాలు జరిగాయని సీఏఐటీ వెల్లడించింది. మొత్తం విక్రయాల్లో కిరాణా, ఎఫ్‌ఎంసీజీ 12 శాతం, బంగారం, ఆభరణాలు 10 శాతం, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ వస్తువులు 8 శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 7 శాతం, రెడీమేడ్ దుస్తులు 7 శాతం, గిఫ్ట్ ఐటమ్స్ 7శాతం, హోమ్ డెకార్ 5 శాతం, ఫర్నిషింగ్ అండ్ ఫర్నిచర్ 5 శాతం, స్వీట్స్ అండ్ నమ్కీన్ 5 శాతం, టెక్స్‌టైల్స్, ఫ్యాబ్రిక్స్ 4 శాతం, పూజా వస్తువులు 3 శాతం, పండ్లు, డ్రై ఫ్రూట్స్ 3 శాతం ఉన్నాయి. ప్యాకేజింగ్, హాస్పిటాలిటీ, క్యాబ్ సర్వీసెస్, ట్రావెల్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, టెంట్ అండ్ డెకరేషన్, మ్యాన్‌పవర్, డెలివరీ వంటి రంగాల నుంచి సేవల రంగం అమ్మకాలకు రూ.65,000 కోట్లు వచ్చాయని సీఏఐటీ జాతీయ అధ్యక్షుడు బీ సీ భార్టియా అన్నారు. 72 శాతం మంది వ్యాపారులు రోజువారీ వినియోగ వస్తువులు, పాదరక్షలు, దుస్తులు, మిఠాయి, గృహాలంకరణ, కన్స్యూమర్ డ్యూరబుల్స్‌పై జీఎస్టీ రేట్లు తగ్గించడం వల్లే అమ్మకాల రికార్డు స్థాయిలో పెరిగాయని చెప్పారు. సీఏఐటీ ప్రకారం, ఈ ఏడాది దీపావళికి వాణిజ్యం లాజిస్టిక్స్, ప్యాకేజింగ్, రవాణా, రిటైల్ రంగాల్లో 50 లక్షల తాత్కాలిక ఉద్యోగాల సృష్టి జరిగింది. అలాగే, గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాలు మొత్తం వాణిజ్యంలో 28 శాతం వాటా కలిగి ఉండటంతో, ఇవి మెట్రోల కంటే ఎక్కువ ఆర్థిక భాగస్వామ్యాన్ని అందించాయని సీఏఐటీ పేర్కొంది

## కీలక రంగాల మందగింపు మూడు నెలల కనిష్టానికి పతనం

దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత ముఖ్యమైన ఎనిమిది కీలక రంగాల ఉత్పత్తి భారీగా పడిపోయింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఈ రంగాల ఉత్పత్తి ఏకంగా 3 శాతానికి పతనమయ్యింది. బొగ్గు, చమురు, సహజ వాయువు, రిఫైనరీ రంగాలు పేలవ ప్రదర్శనను కనబర్చాయని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ మంగళవారం ఓ రిపోర్ట్‌లో తెలిపింది. ఇంతక్రితం ఆగస్టులో 6.5 శాతం వృద్ధి చోటు చేసుకుంది. గతేడాది ఇదే సెప్టెంబర్‌లో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, ఉక్కు, సిమెంట్, విద్యుత్ తదితర ఎనిమిది రంగాల ఉత్పత్తి 6.3 శాతంగా నమోదయ్యింది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో వీటి వాటా 42 శాతం పైగా ఉంటుంది. గడిచిన సెప్టెంబర్‌లో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు వృద్ధిలో క్షీణతను చవి చూశాయి. ఎరువులు, సిమెంట్, విద్యుత్ ఉత్పత్తి మందగించింది. ఉక్కు మాత్రమే మెరుగైన పనితీరును కనబర్చింది. సెప్టెంబర్‌లో బొగ్గు ఉత్పత్తి 1.2 శాతానికి పడిపోయింది. ఆగస్టు లో ఇది 11.4 శాతంగా ఉంది. దీంతో పోల్చితే భారీగా తగ్గింది. ఇదే నెలలో ముడి చమురు ఉత్పత్తి 2.4 శాతంగా ఉండగా.. గడిచిన సెప్టెంబర్‌లో 1.3 శాతానికి పతనమయ్యింది. సహజ వాయువు ఉత్పత్తి 3.8 శాతానికి తగ్గింది. రిఫైనరీ ఉత్పత్తులు సెప్టెంబర్‌లో 3.7 శాతానికి పడిపోయాయి. ట్రంప్ టారిఫ్‌లతో దేశంలో ఇటీవల పారిశ్రామిక కార్యకలాపాలు ఒత్తిడిని ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.



## టెక్ దిగ్గజం అమెజాన్ కీలక నిర్ణయం

ప్రస్తుతం టెక్ ప్రపంచాన్ని ఏఐ శాసిస్తున్న సంగతి తెలిసిందే. ఏ పనిచేసేందుకు అయినా ఏఐని వినియోగిస్తున్నారు. అంతేకాకుండా కొన్ని పనులకు ఏఐ ఆధారంగా పనిచేసే రోబోటిక్స్ వినియోగిస్తున్నారు. దీంతో ఇప్పటికే లక్షల్లో ఉద్యోగాలను ఏఐ భర్తీ చేసేసింది. ఇక టెక్ దిగ్గజం అమెజాన్ తమ కంపెనీలో ఏకంగా 6లక్షల కార్మిక ఉద్యోగాల్లో రోబోటిక్స్‌నే నియమించు కోవాలని నిర్ణయం తీసుకుందట. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో అనేక కథనాలు వస్తున్నాయి. వాటి ప్రకారం, అమెజాన్ 2033 నాటికి అమెరికాలో 6లక్షల కంటే ఎక్కువ ఉద్యోగాలను రోబోలతోనే భర్తీ చేయాలని ఆలోచిస్తుంది. తమ కంపెనీ కార్యకలాపాల్లో 75శాతం ఉద్యోగాలను 2027 నాటికి ఆటోమేషన్ ద్వారానే భర్తీ చేయాలని నిర్ణయం తీసుకుంది. అమెజాన్ గోదాంలు, షిప్పింగ్ కేంద్రాలలో రోబోలను తీసుకురావడం ద్వారా 2025 నుండి 2027 వరకు దాదాపు 12.6 బిలియన్లను ఆదా చేసుకోవచ్చని భావిస్తోంది. ఇప్పటికే అమెజాన్‌లో భారీగా లే ఆఫ్స్ జరిగిన సంగతి తెలిసిందే. సంస్థ తీసుకున్న ఈ నిర్ణయంతో భవిష్యత్‌లో భారీగా ఉద్యోగాల కోత తప్పదని నిపుణులు చెబుతున్నారు.





## భారత్ విజయ పరంపర కొనసాగుతుందా?



ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో ఓటమి పాలైన టీమ్ఇండియాకు రేపటి రెండో వన్డే 'డూ ఆర్ డై'గా మారింది. అడిలైడ్ ఓవల్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌లో గెలిస్తేనే సిరీస్‌పై భారత్‌కు ఆశలు నిలిచే అవకాశం ఉంది. పటిష్టమైన ఆసీస్‌ను వారి సొంతగడ్డపై ఓడించడం అంత సులభం కాదు. అయితే, టీమ్ఇండియా అడిలైడ్‌లో ఉన్న అద్భుతమైన రికార్డు.. ఇక్కడ భారత్‌కు సానుకూల అంశం. అడిలైడ్ ఓవల్ మైదానం టీమ్ఇండియాకు ఒక అభేద్యమైన కోటలాంటిది. ఇక్కడ భారత్ గత 17 ఏళ్లుగా ఒక్క వన్డే మ్యాచ్ కూడా ఓడిపోలేదు. ఇప్పటివరకు ఈ మైదానంలో ఆడిన 15 మ్యాచ్‌లలో 9 విజయాలను భారత్ నమోదు చేసింది. ఈ అద్భుతమైన రికార్డు భారత్ ఆత్మవిశ్వాసాన్ని పెంచే అవకాశం ఉంది. గత ఓటమిని మర్చి, కొత్త ఉత్సాహంతో బరిలోకి దిగనున్న రోహిత్ సేన, తమ విజయ పరంపరను కొనసాగించాలని పట్టుదలతో ఉంది. అయితే, తమ సొంత మైదానంలో టీమ్ఇండియా రికార్డును బ్రేక్ చేసి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని ఆస్ట్రేలియా పక్కా ప్లాన్‌తో సిద్ధమైంది. తొలి వన్డేలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి స్టార్ ఆటగాళ్లు పెద్దగా రాణించలేకపోయారు. అడిలైడ్‌లో భారత జట్టు రికార్డును మరింత పటిష్టం చేయాలంటే.. ముఖ్యంగా వీరే ముందంజలో ఉండాలి. పరుగుల యంత్రం విరాట్ కోహ్లీకి ఈ మైదానం బాగా అచ్చొచ్చిన గ్రౌండ్. ఇక్కడ గతంలో శతకాలు నమోదు చేసిన రికార్డు కోహ్లీకి ఉంది. వీరిద్దరూ రేపటి మ్యాచ్‌లో ఫామ్‌లోకి వస్తే, ఆస్ట్రేలియా బౌలర్లకు తిరుగుండదు. టాప్ ఆర్డర్ రాణిస్తే టీమ్ఇండియా విజయం సాధించే అవకాశాలు మెరుగవుతాయి. సిరీస్ సమం చేయాలని టీమ్ఇండియా పట్టుదలతో ఉండగా, సొంతగడ్డపై సిరీస్‌ను గెలవాలని ఆస్ట్రేలియా తహతహలాడుతోంది. అడిలైడ్ మైదానంలో భారత్ గత 17 ఏళ్ల రికార్డును కాపాడుకుంటుందా? లేక ఆస్ట్రేలియా ఆ రికార్డుకు బ్రేక్ వేసి సిరీస్‌ను సొంతం చేసుకుంటుందా? అనేది రేపటి మ్యాచ్‌తో తేలిపోతుంది. రెండు జట్ల మధ్య జరిగే ఈ ఉత్కంఠభరిత పోరు క్రికెట్ అభిమానులకు మంచి వినోదాన్ని అందిస్తుందనడంలో సందేహం లేదు.

పాకిస్తాన్‌తో జరుగుతున్న రెండో టెస్టులో సౌతాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ వన్ మ్యాన్ షోతో అదరగొట్టాడు. రావల్పిండి వేదికగా జరుగుతున్న ఈ టెస్టులో పాకిస్తాన్ బ్యాటర్లు విజృంభించడంతో ఆ జట్టు భారీ స్కోర్ చేసింది. స్పిన్‌కు అనుకూలించిన ఈ పిచ్‌పై కేశవ్ మహారాజ్ ఏడు వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. మొదటి టెస్టుకు దూరమైన కేశవ్..

## పాకిస్తాన్‌పై వన్ మ్యాన్ షో 7 వికెట్లు పడగొట్టిన కేశవ్ మహారాజ్

రెండో టెస్టులో మాత్రం తన సత్తా చాటుకున్నాడు. రావల్పిండి క్రికెట్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ టెస్టులో టాస్ గెలిచిన పాకిస్తాన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. మొదటి ఇన్నింగ్స్‌లో ఏకంగా తొమ్మిది వికెట్లు స్పిన్నర్లే పడగొట్టడం విశేషం. మార్కో యాన్సన్ ఒక్క వికెట్ కూడా తీసుకోలేకపోతే.. రబడా మాత్రం ఒకవికెట్ దక్కించుకున్నాడు. హార్మర్ రెండు వికెట్లు తీసుకోగా.. కేశవ్ మహారాజ్ ఏడు వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో 42.4 ఓవర్లు బౌలింగ్ చేసిన కేశవ్ మహా రాజ్ 102 పరుగులు ఇచ్చి ఏడు వికెట్లు తీసుకున్నాడు. ఓపెనర్ల వికెట్ల హార్మర్ తీయగా.. మిడిలార్డర్ రిజ్వాన్‌ను రబడా ఎల్‌బీడబ్ల్యూ చేశాడు. ఇక మిగతా బ్యాటర్లంతా కేశవ్ మహారాజ్‌కి వికెట్లు సమర్పించుకున్నారు. మ్యాచ్ విషయానికి వస్తే తొలి టెస్టులో విజయం సాధించి, మంచి జోష్ మీద ఉన్న పాకిస్తాన్ జట్టు రెండో టెస్టులోనూ అదే హవా కొనసాగించింది. ఓపెనర్ షఫీక్, కెప్టెన్ షాన్ మసూద్ శుభారంభం అందించడంతో భారీ స్కోర్ చేసింది. రెండో రోజు మొదటి సెషన్ సమయానికి పాకిస్తాన్ 333 పరుగులు చేసి ఆలౌట్ అయింది. షఫీక్ 57, ఇమామ్ ఉల్ హక్ 17, కెప్టెన్ షాన్ మసూద్ 87, బాబర్ ఆజామ్ 16, సౌద్ షకీల్ 66, రిజ్వాన్ 19, సల్మాన్ అలీ అఘా 45 పరుగులు చేశారు. సౌతాఫ్రికా సిరీస్‌తో వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27 ప్రారంభించిన పాకిస్తాన్ జట్టు ఇప్పుడు టాప్ ప్లేస్ కోసం చూస్తోంది.



2025 మహిళల వన్డే ప్రపంచకప్‌లో కీలక మ్యాచ్‌లో శ్రీలంక 7 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. ఈ విజయంతో లంక సెమీఫైనల్ ఆశలను కొనసాగించగలిగింది. మరోవైపు, టోర్నీ నుంచి తొలి సారిగా నిష్క్రమించిన జట్టుగా బంగ్లాదేశ్ నిలిచింది. ఈ మ్యాచ్‌లకు ముందు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ ఇప్పటికే సెమీఫైనల్‌కు అర్హత సాధించారు. ఇప్పుడు నాలుగో స్థానాన్ని కోసం భారత్, న్యూజిలాండ్, శ్రీలంక, పాకిస్తాన్ జట్లు పోటీ పడుతున్నాయి. లీగ్ దశలో కేవలం ఏడు మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి, కాబట్టి త్వరలో నాలుగో స్థానంపై స్పష్టత రానుంది. భారత్ ఐదు మ్యాచ్‌లలో నాలుగు పాయింట్లు సంపాదించి, పాయింట్ల

## శ్రీలంక విజయం

పట్టికలో నాలుగో స్థానంలో ఉంది. టీమిండియా నెట్ రన్ రేట్ 0.526గా ఉంది. హర్మన్‌ప్రీత్ సేన వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోడం సెమీస్ అవకాశాలను సంక్లిష్టం చేసింది. మిగిలిన రెండు మ్యాచ్‌లలో గెలిస్తేనే సెమీఫైనల్‌లో స్థానం ఖాయం అవుతుంది. గురువారం న్యూజిలాండ్‌తో జరగనున్న మ్యాచ్ టీమిండియాకు డూ-ఆర్-డై సందర్భంలా ఉంది. ఒకవేళ భారత్ ఓడిపోతే, ఇంగ్లాండ్ చేతిలో న్యూజిలాండ్ ఓడాలి. తర్వాతే టీమిండియా చివరి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను ఓడించాల్సి ఉంటుంది. వర్షం కారణంగా భారత్-న్యూజిలాండ్ మ్యాచ్ రద్దయితే, టీమిండియా బంగ్లాదేశ్‌ను ఓడించాలి. అదే సమయంలో, శ్రీలంక లేదా పాకిస్తాన్ ఆరు పాయింట్లు సాధించకపోతే, భారత్ నాలుగో స్థానానికి అర్హత పొందుతుంది. చివరి రెండు మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయితే, నెట్ రన్ రేట్ ఆధారంగా భారత జట్టు సెమీఫైనల్‌కు చేరుతుంది. కానీ, ఇంగ్లాండ్ న్యూజిలాండ్‌ను ఓడించాలి. న్యూజిలాండ్ ఐదు మ్యాచ్‌లలో నాలుగు పాయింట్లతో ఉన్నప్పటికీ, నెట్ రన్ రేట్ -0.245, కాబట్టి పాయింట్ల పట్టికలో ఐదవ స్థానంలో ఉంది. కివీస్ మిగిలిన రెండు మ్యాచ్‌లు గెలిస్తే ఎనిమిది పాయింట్లతో సెమీఫైనల్‌లో చేరుతుంది. ఈ నేపథ్యంలో, భారత్‌తో జరిగే వారి మ్యాచ్ డూ-ఆర్-డైగా మారింది. భారత్ ఓడితే, ఇంగ్లాండ్ చేతిలో కివీస్ ఓడాలి, తర్వాతే టీమిండియా బంగ్లాదేశ్‌ను ఓడించాలి. పాకిస్తాన్, శ్రీలంకకు కూడా అవకాశాలు ఉన్నప్పటికీ, సాధ్యంకాని పరిస్థితి కాస్త ఎక్కువ. పండుగల రేసులో ఏ జట్టు చివరికి సెమీఫైనల్‌కి చేరుతుంది అనేది చూడాల్సి ఉంది..





# ఆట

## వన్డే క్రికెట్ చరిత్రలో వెస్టిండీస్ అరుదైన రికార్డు

అంతర్జాతీయ వన్డే క్రికెట్ చరిత్రలో వెస్టిండీస్ జట్టు ఒక అరుదైన ప్రపంచ రికార్డును నెలకొల్పింది. మంగళవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 50 ఓవర్ల పాటు కేవలం స్పిన్నర్లతోనే బౌలింగ్‌చేసి చరిత్ర సృష్టించింది. వన్డే ఫార్మాట్‌లో ఒక పూర్తిస్థాయి సభ్యదేశం ఇలా చేయడం ఇదే తొలిసారి. ఢాకాలోని షేర్ బంగ్లా నేషనల్ స్టేడియం ఈచరిత్రాత్మక ఘట్టానికి వేదికగా నిలిచింది. ఈ మ్యాచ్‌కు ఉపయోగించిన పిచ్ పూర్తిగా పొడిగా, పగుళ్లతో స్పిన్‌కు అనుకూలంగా ఉండటంతో విండీస్ కెప్టెన్ ఈ సాహసోపేత నిర్ణయం తీసుకున్నాడు. జట్టులోని ఐదుగురు స్పిన్నర్లు అకీల్ హొసేన్, రోస్టన్ ఛేజ్, ఖారీ పియర్, గుడకేశ్ మోటీ, అలిక్ అథనేజ్ తమ 10 ఓవర్ల కోటాను పూర్తి చేశారు. వీరి స్పిన్ దాటికి బంగ్లా బ్యాటర్లు పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోతూ 46 ఓవర్లకు 163/7 స్కోరుతో కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన స్పిన్ ఆల్‌రౌండర్ రిషద్ హొస్సేన్ తన మెరుపు బ్యాటింగ్‌తో ఇన్నింగ్స్ స్వరూపాన్నే మార్చేశాడు. కేవలం 14 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 39 పరుగులు బాదాడు. అతని విధ్వంసం కారణంగా చివరి నాలుగు ఓవర్లలో బంగ్లాదేశ్ ఏకంగా 50 పరుగులు రాబట్టింది. దీంతో నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 213 పరుగుల గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. బంగ్లా ఇన్నింగ్స్‌లో సౌమ్య సర్కార్ 89 బంతుల్లో 45 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు.



## షార్ట్ టర్మ్ గోల్స్ పెట్టుకొంటేనే ఉత్తమం




విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ కేవలం వన్డేల్లోనే కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. అయితే, ఆసీస్‌తో తొలి వన్డేలో రాణించలేకపోయారు. వారిని ఆడించడంపై పలువురు విమర్శలు చేస్తుండగా.. మరికొందరు మాత్రం కాస్త సమయం ఇవ్వాలని చెబుతున్నారు. క్రికెట్‌లో అన్నీ సాధించారు ఇంకెంతకాలం ఆడతారనే వ్యాఖ్యలూ వినిపించాయి. ఈ క్రమంలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ స్పందించాడు. ఎవరినుంచైనా తనకు ఇలాంటి మాటలు వినడం అస్సలు నచ్చదని వ్యాఖ్యానించాడు. "నాకు ఇలాంటివి వినడం నచ్చదు. క్రికెట్ లేదా ఇతర గేముల్లో అంతా సాధించాం అని ఎవరినోటా వినిపించకూడదు. ఎందుకంటే ఆడేటప్పుడు చేయగలిగినవి చాలా ఉంటాయి. అందుకోసం షార్ట్ టర్మ్ గోల్స్‌ను నిర్దేశించుకోవాలి. అలాకాకుండా వచ్చే వన్డే ప్రపంచకప్‌లోనే ఆడతానని భావించకూడదు. ఒక్కో అడుగు ముందుకేస్తూ సాగాలి. ఈ విషయంలో విరాట్ కోహ్లీ ప్రేరణ పొందే ప్లేయర్. తప్పకుండా అతడు ప్రశాంతంగా కూర్చొని... ఆస్ట్రేలియా సిరీస్‌లో తాను సాధించాల్సిన స్వల్పకాలిక లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. అలా చేస్తాడని భావిస్తున్నా.

# చక్కని ఆరోగ్యం

## మానసిక సమస్యలకు వ్యాయామంతో చెక్

జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం వల్ల మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందనే ఆందోళన చాలామందిలో ఉంది. అయితే, రన్నింగ్ వంటి కార్డియో వ్యాయామాలు చేయడం ద్వారా ఈ దుష్ప్రభావాల ను చాలా వరకు తగ్గించుకోవచ్చని ఓ తాజా అధ్యయనం తేల్చిచెప్పింది. జంక్ ఫుడ్ తినే అలవాటు ఉన్నప్పటికీ, క్రమం తప్పని శారీరక శ్రమ మానసిక ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని ఈ పరిశోధన స్పష్టం చేస్తోంది. ఐర్లాండ్‌లోని యూనివర్సిటీ కాలేజ్ కార్క్ పరిశోధకులు జరిపిన ఈ అధ్యయన వివరాలను మంగళవారం 'బ్రెయిన్ మెడిసిన్' అనే జర్నల్‌లో ప్రచురించారు. ఈ పరిశోధన కోసం కొన్ని ఎలుకలను ఎంపిక చేసి, వాటిని రెండు గ్రూపులుగా విభజించారు. ఒక గ్రూపునకు సాధారణ ఆహారం, మరో గ్రూపునకు కొవ్వు, చక్కెర అధికంగా ఉండే జంక్ ఫుడ్ అందించారు. ఏడున్నర వారాల పాటు సాగిన ఈ పరిశోధనలో, రెండు గ్రూపుల్లోని సగం ఎలుకలకు రన్నింగ్ వీల్స్ అందుబాటులో ఉంచారు. జంక్ ఫుడ్ తిన్నప్పటికీ, క్రమం తప్పకుండా రన్నింగ్ చేసిన ఎలుకలలో డిప్రెషన్ వంటి ప్రవర్తనా లక్షణాలు గణనీయంగా తగ్గినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. వ్యాయామం చేయడం వల్ల శరీరంలోని హార్మోన్లు, పేగుల్లో జరిగే జీవక్రియల ప్రక్రియపై సానుకూల ప్రభావం పడుతుందని వారు కనుగొన్నారు. ముఖ్యంగా, జంక్ ఫుడ్ కారణంగా తగ్గిపోయే అన్సెరిన్, ఇండోల్-3-కార్బాక్సిలేట్, డియోక్సినోసిన్ వంటి మూడు కీలకమైన జీవక్రియలువ్యాయామం వల్ల తిరిగి పాక్షికంగా పునరుద్ధరించబడినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా వర్సిటీకి చెందిన ప్రొఫెసర్ యవొన్నె నోలన్ మాట్లాడుతూ, "అధికంగా ప్రాసెస్ చేసిన ఆహారం వినియోగం పెరిగిన ఈ రోజుల్లో, జీవనశైలిలో మార్పుల ద్వారా మానసిక ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవచ్చో అర్థం చేసుకోవడానికి ఈ ఫలితాలు ఎంతగానో ఉపయోగపడతాయి" అని తెలిపారు. ఆహారంతో సంబంధం లేకుండా వ్యాయామం ఆందోళనను తగ్గించడంలో సహాయపడుతుందని కూడా ఈ అధ్యయనంలో తేలింది. అయితే, మెదడు పూర్తిస్థాయిలో ప్రయోజనం పొందాలంటే మంచి



## జామాకులతో టీ తాగితే కొలెస్ట్రాల్ తగ్గుతుంది

హైపర్ కొలెస్టెరోలేమియా అని పిలిచే హై కొలెస్ట్రాల్ రక్తంలో అధిక స్థాయిలో కొలెస్ట్రాల్‌ని సూచిస్తుంది. ఇది ధమనుల్లో ఫలకం ఏర్పడేలా చేస్తుంది. దీంతో ధమనుల్లో రక్త ప్రవాహం అడ్డు కుంటుంది. గుండెపోటు, స్ట్రోక్, ఇతర గుండె సమ స్యలు హై కొలెస్ట్రాల్ కారణమవుతుంది. దీంతోపాటు హై బ్లడ్ షుగర్, హైపర్‌గ్లైసీమియా రక్తంలో ఎక్కువ గ్లూకోజ్ ఉండడం వల్ల వచ్చే సమస్య. ఇది తరచుగా ఇన్సులిన్ తగినంతగా లేకపోవడం వల్ల వస్తుంది. దీని కారణంగా దాహం పెరగడం, ఎక్కువగా మూత్ర విసర్జన, అలసట, చికిత్స చేయకపోతే, గుండె, కిడ్నీలపై ఎఫెక్ట్ పడుతుంది. అయితే, ఇన్ని ప్రమాదాలకి కారణమయ్యే హై కొలెస్ట్రాల్, బ్లడ్ షుగర్ లెవల్స్‌ని కంట్రోల్ చేసేందుకు జామాకులు బాగా హెల్ప్ చేస్తాయి. ఈ సమస్యలననింటినీ దూరం చేసేందుకు జామాకుల్ని ఎలా వాడాలో తెలుసుకోండి. జామాకులు సాంప్రదాయ వైద్యంలో ఎన్నో విధాలుగా ఉపయోగపడతాయి. రక్తంలో షుగర్ లెవల్స్ సపోర్ట్ చేయడం దగ్గర్నుంచీ జీర్ణక్రియ మెరుగ్గా మారడం వరకూ ఇలా ఎన్నో లాభాలు ఉన్నాయి. వీటిని మనం టీలా చేసి తీసుకోవచ్చు. నేరుగా నమిలి తినొచ్చు. ఇందులో విటమిన్ సి, పాలీఫెనాల్స్, యాంటీ ఆక్సిడెంట్స్, ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవన్నీ మన శరీరానికి ఎంతగానో మేలు చేస్తాయి. వీటిని మనం టీలా చేసుకుని తాగడం వల్ల చాలా సమస్యలు దూరమవుతాయి. వీటితో టీని ఎలా చేయాలి. దానికి కావాల్సిన పదార్థాలు ఏంటో తెలుసుకోండి. ముందుగా జామాకుల్ని శుభ్రంగా కడగాలి. ఓ గ్లాసు నీటిలో జామాకుల్ని వేయండి. కనీసం 10 నిమిషాల పాటు మరిగించండి. ఇది మంచి డీకాషన్‌లా తయారవుతుంది. ఇది చల్లారక అందులో మీకు నచ్చితే కొద్దిగా తేనె, నిమ్మరసం కలిపి ఉదయాన్నే పరగడపున తాగాలి. దీని వల్ల చాలా ఎన్నో సమస్యల్ని దూరం చేయొచ్చు. ఉదయాన్నే టీ, కాఫీలు తాగే వారు వాటి బదులు ఇలాంటి ఓ హెర్బల్ టీతో తయారుచేసి తాగితే ఎన్నో మరెన్నో లాభాలుంటాయి. జామాకులు హై కొలెస్ట్రాల్ తగ్గడానికి హెల్ప్ చేస్తాయి. దీనికి కారణం జామాకుల్లోని సోల్యూబుల్ ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్స్, క్వార్సెటిన్ వంటి గుణాలు. జామాకుల్ని తీసుకుంటే చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. అంతేకాకుండా, దీనిని తీసుకోవడం వల్ల హైబీపి కూడా తగ్గుతుంది. ఈ రెండు అతి పెద్ద సమస్యలు దూరం కావడంతో వీటి కారణంగా వచ్చే మరెన్నో హెల్త్ ప్రాబ్లమ్స్ కూడా దూరమవుతాయి. జామాకుల్లో తాగడం వల్ల హై బ్లడ్ షుగర్ లెవల్స్ కంట్రోల్ అవ్వడానికి హెల్ప్ అవుతాయి.



దీనికోసం జామాకుల్లోని ఫ్లేవనాయిడ్స్, టానిన్స్ వంటివి ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచి ఆహారం తిన్న తర్వాత షుగర్ అబ్జార్బ్ కాకుండా చేస్తాయి. దీనిని టీలా చేసుకుని తాగితే మంచి హెర్బల్ టీలా పనిచేసి బ్లడ్ షుగర్ లెవల్స్ తగ్గడానికి హెల్ప్ చేస్తాయి. అంతేకాకుండా ఇందులో విటమిన్ ఎ ఉంటుంది. దీని వల్ల స్కిన్ హెల్త్ బాగుంటుంది. ఇమ్యూనిటీ పెరుగుతుంది. జామాకుల్లో ఫ్లేవనాయిడ్స్, టానిన్స్ కారణంగా రెటీనా హెల్త్ బాగుంటుంది. ఇందులోని కెరోటినాయిడ్స్ కంటి ఆరోగ్యం మెరుగవుతుంది. ఆక్సిడేటివ్ స్ట్రెస్ తగ్గుతుంది. దీనికి కారణం ఇందులోని ఫ్లేవనాయిడ్స్, టాన్సిన్స్ ఫ్రీ రాడికల్స్‌ని వల్ల వచ్చే సమస్యల్ని దూరం చేస్తాయి. వీటితో పాటు కళ్ళు డ్రైగా, వయసు తాలుకూ వచ్చే కంటి దృష్టి సమస్యలు తగ్గుతాయి. అలానే కాకుండా లేత జామాకుల్ని నమిలితే చిగుళ్ల వాపు, పంటి నొప్పి, దుర్వాసనలు తగ్గుతాయి. అంతేకాకుండా జీర్ణక్రియ మెరు గవుతుంది. జామాకుల్ని పేస్టులా చేసి మనం ప్యాక్ వేసినప్పుడు గాలు తగ్గుతాయి. చర్మ సమస్యలు తగ్గుతాయి. జామాకుల్ని తీసుకోవడం వల్ల ఈ లాభాలే కాకుండా అలర్జీలు తగ్గుతాయి. దగ్గు నుండి రిలాక్స్ అవుతారు. వాతావరణంలో తేమ పెరగడం వల్ల వచ్చే జలుబు, దగ్గు వంటి సమస్యల్ని కూడా ఈ జామాకుల టీ దూరం చేస్తుంది.


## ఆరోగ్యానికి ఆరెంజ్.. ఇంకా అనేక ప్రయోజనాలు..!



ఆరెంజ్ - విటమిన్-సి శక్తి కేంద్రం రుచికరమైన ఆరెంజ్‌లు కేవలం తీపిదనం కోసం మాత్రమే కాదు, అవి అపారమైన ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న పోషకాల నిధి. ఈ సిట్రస్ పండులో ముఖ్యంగా విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది, ఇది కొల్లాజెన్ ఉత్పత్తిని గణనీయంగా పెంచడానికి తోడ్పడుతుంది. కొల్లాజెన్ అనేది చర్మానికి దృఢత్వాన్ని, స్థితిస్థాపకతను ఇచ్చే ముఖ్యమైన ప్రోటీన్. ఆరెంజ్‌లను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా చర్మాన్ని మరింత ఆరోగ్యంగా, కాంతివంతంగా, యవ్వనంగా ఉంచుకోవచ్చు. చర్మ సమస్యలకు సహజ పరిష్కారం విటమిన్-సి కొల్లాజెన్‌కు సహాయం చేయడమే కాకుండా, ఆరెంజ్‌లలోని సహజమైన యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు చర్మానికి మేలు చేస్తాయి. ఈ గుణాలు మొటిమలు, మంట వంటి చర్మ సమస్యలను తగ్గించడంలో సమర్థవంతంగా పని చేస్తాయి. ఇది కాకుండా, ఒక అధ్యయనం ప్రకారం రోజుకు ఒక ఆరెంజ్ తినడం వల్ల ఒత్తిడి స్థాయిలు 20% వరకు తగ్గుతాయని తేలింది. తద్వారా మానసిక ప్రశాంతతకు, చర్మంపై ఒత్తిడి ప్రభావం తగ్గడానికి కూడా దోహదపడుతుంది. గర్భిణులు, జీర్ణక్రియకు మేలు ఆరెంజ్‌లు గర్భిణులకు చాలా అవసరమైన పోషకాలను అందిస్తాయి, ముఖ్యంగా ఫోలేట్ వంటివి. ఫోలేట్ గర్భంలో ఉన్న శిశువు యొక్క సరైన అభివృద్ధికి చాలా కీలకం. అంతేకాకుండా, ఈ పండులో అధికంగా ఉండే ఫైబర్ కంటెంట్ జీర్ణవ్యవస్థకు చాలా మేలు చేస్తుంది. ఇది మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఆరోగ్యకరమైన జీర్ణవ్యవస్థ మెరుగైన మొత్తం ఆరోగ్యానికి పునాది వేస్తుంది. చక్కెర, కొలెస్ట్రాల్ నియంత్రణలో ఆరెంజ్ పాత్ర ఆరెంజ్‌లలో ఉండే ఫైబర్ (పీచుపదార్థం) కేవలం మలబద్ధకానికే కాక, రక్తంలో చక్కెర స్థాయిలను, చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. ఫైబర్ చక్కెర శోషణను నెమ్మదిస్తుంది, ఇది డయాబెటిస్ ఉన్నవారికి లేదా రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుకోవాలనుకునే వారికి మంచిది. అలాగే, కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ఆరెంజ్‌లు ముఖ్యపాత్ర పోషిస్తాయి. ఈ అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాల కోసం రోజువారీ ఆహారంలో ఆరెంజ్‌లను భాగం చేసుకోవడం మంచిది.

## ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌ను ఇలా గుర్తించాలి

ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ అంటే ఊపిరి తిత్తులు వాపుకు గురవడం లేదా బ్యాక్టీరియా, వైరస్ లేదా ఫంగస్ వంటి సూక్ష్మజీవులు కారణంగా ఇన్ఫెక్షన్ కలిగిన పరిస్థితి. వైద్య నిపుణులు చెబు తున్నట్లు, ఈ ఇన్ఫెక్షన్ ఊపిరితిత్తుల సక్రమ పని తీరును ప్రభావితం చేస్తుంది. అలాగే శ్వాస సమస్యలు, అలసట, తేలికపాటి నుండి తీవ్రమైన జ్వరం వంటి లక్షణా లను కలిగిస్తుంది. వృద్ధులు, చిన్నపిల్లలు, మధుమేహం లేదా ఇతర దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు ఎక్కువగా ప్రభావితుల వుతారు. ధూమపానం చేసే వారు, కలుషిత గాలిలో ఎక్కువగా ఉండే వారు, జలుబు లేదా ఫ్లూ వచ్చిన వ్యక్తులు కూడా ఈ ఇన్ఫెక్షన్‌కి ఎక్కువగా బాధపడతారు. అసలు కారణాలు ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు రావడానికి అనేక కారణాలు ఉన్నాయి. జలుబు, ఫ్లూ లేదా ఇతర శ్వాసకోశ సమస్యల సమయంలో ఊపిరి తిత్తులకు చేరే బ్యాక్టీరియా, వైరస్‌లు ప్రధాన కారణాలు. బలహీనమైన రోగనిరోధక శక్తి, ధూమపానం, దీర్ఘకాలిక దగ్గు, గొంతు సమస్యలు ఉన్నవారికి ఇన్ఫెక్షన్‌కి ప్రమాదం ఎక్కువ. మధుమేహం, గుండె జబ్బులు, ఉబ్బసం వంటి వ్యాధులున్న వారిలో ఇన్ఫెక్షన్ తీవ్రంగా వస్తుంది. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.



## రోజూ అంజీర తింటే శరీరంలో జరిగే పరిణామాలు

రెగ్యులర్‌గా పండ్లు తింటే ఆరోగ్యానికి చాలా మంచిది. ఒక్కో పండుతో ఒక్కో ప్రయోజనం ఉంటుంది. అందుకే అన్ని రకాల ఫ్రూట్స్ తప్పనిసరిగా తినాలని సూచిస్తుంటారు వైద్యులు. అందులో ఎక్కువ మంది సూచించేది అంజీర. దీన్ని ఇంగ్లీష్ లో ఫిగ్ అని పిలుస్తారు. చూడడానికి చాలా చిన్నగా కనిపించే ఈ పండు ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది. నిజానికి ఎన్నో ఏళ్లుగా పవర్ ఫుల్ డైట్ ఫాలో అవుతున్న వారి ఛార్ట్‌లో తప్పకుండా ఉండి తీరుతుంది ఈ అంజీర. పచ్చిగా తిన్నా, ఎండిన తరవాత తిన్నా సరే అందు లోని పోషకాలు సరైన విధంగా శరీరానికి అందుతాయి. రోజువారీ డైట్‌లో అంజీరని యాడ్ చేసుకుంటే ఆరోగ్యపరంగా ఎన్నో లాభాలు పొందవచ్చు. మరి అంజీర వల్ల ఎలాంటి ప్రయోజనాలు అందుతాయి. సాధారణంగా ఫైబర్ అధికంగా ఉండే ఫుడ్స్ తీసుకున్నప్పుడు జీర్ణం త్వరగా అవుతుంది. డైజెషన్ సిస్టమ్ బాగుంటుంది. ఈ విష యంలో అంజీర ఎంతో ఉపయోగపడుతుంది. ఎందుకంటే అంజీరలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఈ ఫైబర్ కారణంగా మోషన్ ఫ్రీగా అవడంతో పాటు మలబద్ధకం తగ్గిపోతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యకరంగా ఉండడంలో ఇది ఎంతగానో తోడ్పడుతుంది. రెగ్యులర్‌గా అంజీర తినడం వల్ల బాడీ డిటాక్స్ అవడంతో పాటు గట్ హెల్త్ కూడా మెరుగవు తుంది. అంజీరలో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. వీటితో పాటు పొటాషియం ఉంటుంది. ఈ పొటా షియం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది.



ముఖ్యంగా చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. అదే సమయంలో బ్లడ్ ప్రెజర్ కూడా కంట్రోల్ అవుతుంది. ఫలితంగా హార్ట్ అటాక్, స్ట్రోక్ లాంటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయి. అంజీరలో ఫినా లిక్ కంపౌండ్స్ ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు రక్త సరఫరాని మెరుగ్గా ఉంచుతాయి. చాలా మంది బరువు తగ్గడానికి రకరకాల డైట్ ఫాలో అవుతుంటారు. ఎలాంటి డైట్ ఫాలో అయినా సరే అందు లో తప్పనిసరిగా అంజీర ఉండేలా చూసుకోవడం చాలా మంచిది. వెయిట్ మేనేజ్‌మెంట్‌లో ఇది ఎంతో బాగా తోడ్పడుతుంది. ఎందుకంటే ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫైబర్ ఎక్కు వగా ఉండడం వల్ల చాలా త్వరగా కడుపు నిండినట్టు అవుతుంది. ఫలితంగా అనారోగ్యకరమైన ఆకలి తగ్గుతుంది. ఇదే బరువు తగ్గడానికి సహకరిస్తుంది. అయితే ఇక్కడ కచ్చితంగా గమనించాల్సిన విషయం ఏంటంటే...అంజీర ఆరోగ్యానికి మంచిదే అయినా మోతాదు ఎంత తీసుకుంటున్నారు అనేది చాలా ముఖ్యం. మరీ అతిగా వీటిని తినకూడదు. ఎండు అంజీర పండ్లు తినడం వల్ల వెయిట్ మేనేజ్ మెంట్ సరైన విధంగా ఉంటుంది. ముఖ్యంగా మెటబాలిజం మెరుగవడంలో సహకరిస్తుంది. ఎముకల బలానికి కూడా అంజీర ఎంతో ఉపయోగపడుతుంది. ఇందులో క్యాల్షియం, పొటాషియం, మెగ్నీషియం అధికంగా ఉంటాయి. ఎముకలు ఆరోగ్యంగా ఉండడానికి ఈ మూడు మినరల్స్ చాలా అవస రం. రోజూ అంజీర తినడం వల్ల బోన్ డెన్సిటీ పెరుగుతుంది. అంతే కాదు. ఎముకలకు సంబం ధించిన వ్యాధులు, సమస్యలు రాకుం డా ఉంటాయి. స్కెలిటల్ స్ట్రక్చర్ మెరుగ్గా ఉంటుంది. పైగా మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. అంజీరకి గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ. అంటే..వీటిని తిన్నప్పుడు రక్తంలో షుగర్ ఎక్కువ మొత్తంలో విడుదల కాదు. అంటే బ్లడ్ షుగర్ లెవెల్స్ అమాంతం పెరగవు. పైగా ఫైబర్ కూడా ఉండడం వల్ల చాలా నెమ్మదిగా షుగర్ విడుదలవుతుంది. అంతే కాదు. కొన్ని అధ్యయనాల ప్రకారం అంజీర ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుంది. అందుకే డయాబెటిస్ ఉన్న వారు రెగ్యులర్‌గా అంజీర తీసుకుంటే బెటర్. కాకపోతే మోతాదు విష యంలో మాత్రం జాగ్రత్తగా ఉండాలి. చాలా మంది సంతాన సమస్యలతో ఇబ్బందులు పడుతుంటారు. అలాంటి వారు రెగ్యులర్ గా అంజీర తీసుకుంటే ఈ సమస్యలు తగ్గిపోతాయి. అందుకు కారణం ఏంటంటే.. అంజీరలో జింక్, మెగ్నీషియం, ఐరన్ అధికంగా ఉంటా యి. ఇవి హార్మోన్ ఉత్పత్తికి సహకరిస్తాయి. అంతేకాకుండా పునరుత్పత్తి వ్యవస్థను మెరుగుపరుస్తాయి. కేవలం మహిళ ల్లోనే కాదు. పురుషుల్లోనూ ఫర్టిలిటీ సమస్యలను తగ్గించడంలో ఇది ఉపయోగపడుతుంది. ఇక ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్ ఎ, ఇ, సి అధికంగా ఉంటాయి. ఇవన్నీ ఆక్సిడేటివ్ స్ట్రెస్ నుంచి కాపాడతాయి. రెగ్యులర్‌గా అంజీర తీసుకుంటే చర్మం ఆరోగ్యకరంగా మారుతుంది. మొటిమలు, పిగ్మంటేషన్ లాంటివీ తగ్గుతాయి. ఎలాంటి ఇన్ఫెక్షన్స్ నుంచి అయినా వీటిలోని పోషకాలు కాపాడతాయి. అందులో యాంటీ మైక్రోబయల్, యాంటీ ఇన్ ఫ్లమేటరీ గుణాలుంటాయి. ఒకటి లేదా రెండు ఎండు అంజీరాలు తీసుకోవాలి. వాటిని నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం పరగడుపున వాటిని తీసుకోవాలి. వీటిని నేరుగా కూడా తినవచ్చు. లేదా సలాడ్స్‌లో కలిపి తినాలి. మరో రకంగా కూడా వీటిని తీసుకోవచ్చు. పాలల్లో అంజీర



# సినిమా



## సైయారా భామ నుంచి ఇంకో సెన్సేషన్



సైయారా.. ఈ ఏడాది ఈ బాలీవుడ్ సినిమా రేపిన సంచలనం అంతా ఇంతా కాదు. ఒక కొత్త హీరో.. ఒక కొత్త హీరోయిన్ కలిసి చేసిన సినిమా రూ.600 కోట్ల వసూళ్లు సాధించడం అంటే ఆషామాషీ విషయమా? ఈ చిత్రం అంత పెద్ద హిట్టవడానికి హృద్యమైన కథ కథనాలకు తోడు లీడ్ రోల్స్ చేసిన ఇద్దరూ అద్భుతంగా పెర్ఫామ్ చేయడం ముఖ్య కారణం. ఇటు అహాన్ పాండే, అటు అనీత్ పడ్డా.. ఇద్దరూ తమ పాత్రల్లో ఒదిగిపోయారు. అనీత్‌కు కుర్రాళ్లయితే తమ గుండెల్లో గుడి కట్టేశారు. తన అందం, అభినయంతో ఆమె అంతగా ఆకట్టుకుంది. 'సైయారా' విడుదలకు ముందే అనీత్‌తో యశ్ రాజ్ ఫిలిమ్స్ వాళ్లు ఇంకో మూడు చిత్రాలకు అగ్రిమెంట్ చేసుకున్నట్లు వార్తలు రావడం విశేషం. వేరే ప్రొడక్షన్ హౌస్‌ల నుంచి కూడా ఆమెకు అవకాశాలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం బాలీవుడ్ మోస్ట్ హ్యాపెనింగ్ బేనర్లలో ఒకటైన మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ సైతం అనీత్‌తో ఒక క్రేజీ మూవీ తీయడానికి ప్లాన్ చేసింది. మ్యాడ్ రాక్ హార్రర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా 'థామా' చిత్రాన్ని అందించిన మ్యాడ్ డాక్ సంస్థ.. సినిమా చివర్లో ఈ ఫ్రాంచైజీలో కొత్త సినిమా విశేషాలను పంచుకుంది. 'శక్తి షాలిని' పేరుతో తెరకెక్కుతున్న ఆ చిత్రం.. అనీత్ పడ్డా లీడ్ రోల్ చేయనుంది. 'థామా' హిందీ వెర్షన్‌లో ఈ సినిమా గురించి అనౌన్స్‌మెంట్ ఇవ్వడంతో ప్రేక్షకులకు క్రేజీగా ఫీలవుతున్నారు. 'సైయారా'లో చాలా డెలికేట్‌గా కనిపించిన అనీత్.. హార్రర్ కామెడీలో దయ్యం పాత్ర చేయనుండడం షాకింగే. ఆమె నుంచి తర్వాత ఇలాంటి పాత్రను ఎవ్వరూ ఊహించరు. మ్యాడ్ డాక్ వాళ్ల హార్రర్ కామెడీలంటే ముందే బ్లాక్ బస్టర్ అని ఫిక్సయిపోతున్నారు నార్త్ ఆడియన్స్. 'థామా' సైతం పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. 'శక్తి షాలిని' అనౌన్స్‌మెంట్లోనే రిలీజ్ డేట్ కూడా ఖరారు చేసింది చిత్ర బృందం. వచ్చే ఏడాది క్రిస్మస్ కానుకగా డిసెంబరు 24న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

## కీలక ప్రకటన విడుదల చేసిన డైరెక్టర్ సుజీత్



డైరెక్టర్ సుజీత్ ఇటీవల 'ఓజీ' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన ఈ చిత్రాన్ని డీవీవీ దానయ్య నిర్మించగా.. భారీ అంచనాల మధ్య సెప్టెంబర్ 25న వరల్డ్ వైడ్‌గా విడుదలై బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. అంతేకాకుండా వరల్డ్ వైడ్ రూ. 300 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ రాబట్టి బాక్సాఫీసు వద్ద సంచలనం సృష్టించింది. ప్రస్తుతం సుజీత్, నిర్మాత దానయ్య మరో భారీ ప్రాజెక్ట్‌తో రాబోతున్నారు. ఇందులో నాని హీరోగా నటిస్తుండగా.. ఇటీవల పూజా కార్యక్రమాలు కూడా పూర్తి చేసుకుంది. ఈ క్రమంలో.. నిర్మాత దానయ్య, సుజీత్ మధ్య గొడవలు తలెత్తడంతో.. నాని ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు పలు పుకార్లు షికారు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. తాజాగా, సుజీత్ ట్విట్టర్ ద్వారా ఓ కీలక ప్రకటన విడుదల చేశాడు. "సోషల్ మీడియాలో చాలా చాలా చెబుతున్నారు. కానీ ఈ సినిమాను స్టార్టింగ్ నుండి ఫినిష్ చేసే వరకు తీసుకెళ్లడానికి ఏమి అవసరమో చాలా తక్కువ మంది మాత్రమే అర్థం చేసుకుంటారు. ఓజీ కోసం నా నిర్మాత, నా టీమ్ ఇచ్చిన సపోర్ట్ నమ్మకాన్ని నేను మాటల్లో చెప్పలేను. 'ఓజీ' మూవీ పట్ల పవన్ కళ్యాణ్‌తో పాటు ఆయన అభిమానులు చూపించిన అమితమైన ప్రేమ వర్ణించలేనిది. మా మధ్య ఎలాంటి గొడవలు జరగలేదు. దయచేసి తప్పుడు వార్తలు నమ్మకండి. దానయ్య నాకు ఇచ్చిన సపోర్ట్, నమ్మకానికి ఆయనకు నా ప్రేమ, గౌరవం, కృతజ్ఞతతో సుజీత్" అని రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌తో పుకార్లకు చెక్ పడినట్లు అయింది.

## కంగారెత్తిస్తున్న కొత్త కుర్రాడి స్టార్‌డమ్



దర్శకుడిగా రెండు సినిమాలు.. హీరోగా రెండు సినిమాలు.. ఇంతలోనే ప్రదీప్ రంగనాథన్ అనే కుర్రాడు తెచ్చుకున్న ఫాలోయింగ్, మార్కెట్ చూసి ఇప్పుడు సౌత్ ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీ షాకైపోతోంది. తన సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే వంద కోట్ల వసూళ్లు ఈజీగా వచ్చేసే పరిస్థితి కనిపిస్తోంది. ప్రదీప్ కొత్త చిత్రం 'డ్యూడ్'కు ఎబోవ్ యావరేజ్ టాక్ వచ్చింది. అయినా ఈ సినిమా ఇప్పటిదాకా వరల్డ్ వైడ్ రూ.80 కోట్ల మేర గ్రాస్ కలెక్షన్లు రాబట్టింది. అటు తమిళంలోనే కాదు.. ఇటు తెలుగులోనూ ఆ చిత్రం దీపావళి హైయెస్ట్ గ్రాసర్‌గా నిలిచే సంకేతాలు కనిపిస్తున్నాయి. 'డ్యూడ్'కు వచ్చిన ఓపెనింగ్ కోలీవుడ్‌కు పెద్ద షాక్. తొలి రోజు ఏకంగా 22 కోట్లు రాబట్టింది. మిడ్ రేంజ్ స్టార్లకు కూడా సాధ్యం కాని ఓపెనింగ్ ఇది. హీరోగా కేవలం రెండు సినిమాల అనుభవంతో ప్రదీప్ ఇలాంటి ఓపెనింగ్ రాబట్టడం ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. ప్రదీప్ ముందు దర్శకుడిగా కోలీవుడ్లోకి అడుగుపెట్టాడు. జయం రవి హీరోగా 'కోమాలి' సినిమా తీశాడు. అది ఓ మోస్తరుగా ఆడింది. తర్వాత అవకాశాలు రాలేదు. గ్యాప్ వచ్చింది. దీంతో తనే హీరోగా అరంగేట్రం చేస్తూ 'లవ్ టుడే' సినిమా తీయడానికి రంగం సిద్ధం చేసుకున్నాడు. పెద్ద ప్రొడక్షన్ హౌస్ సపోర్ట్ దొరికింది. ఆ సినిమా అటు తమిళంలో, ఇటు తెలుగులో సెన్సేషన్ క్రియేట్ చేసింది. తర్వాత హీరోగా చేసిన 'డ్రాగన్' ఏకంగా రూ.140 కోట్ల మేర వసూళ్లు రాబట్టి ఔరా అనిపించింది. లుక్స్ పరంగా చాలా మామూలుగా అనిపించినా.. తన పెర్ఫామెన్స్, స్టైల్‌తో ప్రదీప్ యువతను కట్టిపడేస్తున్నాడు. 'డ్యూడ్' అంత గొప్ప సినిమా కాకపోయినా ఆడుతోందంటే.. ప్రదీప్ పెర్ఫామెన్స్ ముఖ్య కారణం.

## లోక తెలుగులో తీస్తే డిజాస్టర్!



మలయాళంలో బాక్సాఫీస్ రికార్డులన్నీ కొల్లగొడుతూ రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సంచలనం రేపింది లోక-చాప్టర్ 1 సినిమా. ఇది లేడీ ఓరియెంటెడ్ మూవీ కావడం విశేషం. సౌత్ ఇండియాలో వచ్చిన ఫస్ట్ లేడీ ఓరియెంటెడ్ సూపర్ హీరో మూవీ ఇది. ఈ చిత్రాన్ని తెలుగులో కొత్త లోక-చాప్టర్ 1 పేరుతో రిలీజ్ చేసి మంచి ఫలితాన్నందుకున్నాడు ప్రముఖ నిర్మాత సూర్య దేవర నాగవంశీ. ఐతే మలయాళం మూవీ కాబట్టి ఈ సినిమాను ఆదరించారు కానీ.. నేరుగా తెలుగులో తీసి రిలీజ్ చేసి ఉంటే అది డిజాస్టర్ అయ్యేది అంటున్నాడు నాగవంశీ. తన బేనర్ నుంచి రాబోతున్న కొత్త చిత్రం మాస్ జాతర ప్రమోషన్లలో భాగంగా నాగవంశీ.. హీరో రవితేజతో కలిసి ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. ఈ ఇంటర్వ్యూ చేసింది మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాల దర్శకుడు కళ్యాణ్ శంకర్ కావడం విశేషం. ఈ ముగ్గురూ కలిసి తెలుగు ప్రేక్షకుల సినీ అభిరుచి గురించి.. సోషల్ మీడియాలో సినిమా చర్చలు పెట్టే వాళ్ల గురించి మాట్లాడారు. ఈ క్రమంలోనే నాగవంశీ.. లోక మూవీ గురించి మాట్లాడాడు. ఆ సినిమాను తెలుగులో తీస్తే లాజిక్కుల గురించి మాట్లాడి, ఇదేం సినిమా అని ఫ్లాప్ చేసే వాళ్లని అన్నాడు. మన ఆడియన్స్ ఎప్పుడు ఏ సినిమాను ఆదరిస్తారో చెప్పలేమని అతనన్నాడు. లిటిల్ హార్ట్స్ అనే సినిమాలో హీరో హీరోయిన్లు, దర్శకుడు ఎవరో తెలియదని.. అయినా దానికి ప్రీమియర్స్ వేస్తే అడ్వాన్స్ బుకింగ్స్ గట్టిగా జరిగాయని.. సినిమాఎవ్వరూ ఊహించనంత పెద్ద హిట్ అయిందని నాగవంశీ అన్నాడు. సంక్రాంతి, దసరా, దీపావళి లాంటి పండుగలకు మాస్ సినిమాలు తీస్తే ఆహా ఓహో అంటారని.. మిగతా టైంలో మాస్ సినిమాలు వస్తే రొటీన్ అని ముద్ర వేసేస్తారని, నాగవంశీతో పాటు రవితేజ కామెంట్ చేశాడు. కరోనా తర్వాత ఓటీటీలో సినిమాలు చూసేవాళ్లు పెరిగిపోయారని.. వాళ్లు థియేటర్లకు వచ్చి సినిమాలు చూడరని.. కానీ మాస్ సినిమాల గురించి మాత్రం తేలిగ్గా కామెంట్ చేస్తారని రవితేజ అన్నాడు.

## 'కే-ర్యాంప్' బ్లాక్ బస్టర్ టూర్ వివరాలు



జైన్స్ నాని దర్శకత్వంలో టాలీవుడ్ యువ నటుడు కిరణ్ అబ్బావరం ప్రధాన పాత్రలో నటించిన 'కె-ర్యాంప్' అక్టోబర్ 18న గ్రాండ్ దీపావళి సందర్భంగా విడుదల అయ్యింది. ఈ సినిమా విడుదలైన అన్ని చోట్ల మిక్స్డ్ రివ్యూస్ ని అందుకుంటుంది. తాజాగా ఇప్పుడు మూవీ మేకర్స్, ఈ రోమ్-కామ్ ఎంటర్‌టైనర్ యొక్క బ్లాక్ బస్టర్ టూర్ వివరాలని వెల్లడించారు. అక్టోబర్ 22న నెల్లూరు మరియు కడపలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని తెలియజేసేందుకు ప్రొడక్షన్ హౌస్ సోషల్ మీడియాలో సరికొత్త పోస్టర్ ని విడుదల చేసింది. ఈ చిత్రంలో యుక్తి థారెజా మహిళా ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో సాయి కుమార్, నరేష్ విజయకృష్ణ, కమ్నా జెత్మలానీ, మురళీధర్ గౌడ్, వెన్నెలా కిషోర్, సీత మరియు ఇతరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి సంగీతాన్ని చైతన్ భర్ద్వాజ్ స్వరపరిచారు. హస్యా సినిమాలు మరియు రుద్రాన్ష్ సెల్యులాయిడ్ కింద రాజేష్ దండా మరియు శివ బొమ్మక్కు ఈ సినిమాని నిర్మిస్తున్నారు.

## సంక్రాంతికి వినోదాల విందు



తనదైన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న హీరో నవీన్ పొలిశెట్టి మరో ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'అనగనగా ఒక రాజు'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. తాజాగా ఈ చిత్రం నుండి దీపావళి ప్రత్యేక ప్రోమో విడుదలైంది. నవ్వుల టపాసులను తలపిస్తున్న ఈ ప్రోమో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 2026 సంక్రాంతికి ప్రేక్షకులకు నవ్వులతో నిండిన అసలైన పండుగకు హామీ ఇచ్చేలా ఈ ప్రోమో ఉండటం విశేషం. రెండు నిమిషాల ఇరవై ఎనిమిది సెకన్ల నిడివితో రూపొందిన ఈ దీపావళి ప్రోమో సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. అతి కొద్దిమంది మాత్రమే నిమిషంలో ఇంతటి వినోదాన్ని పంచగలరు. అభిమానులు దీనిని 'ఒక నవ్వుల అల్లరి', 'వినోదాల విందు', 'అసలైన పండుగ సినిమా' అని పిలుస్తున్నారు. హాస్యం తాజాదనంతో ఉండి ప్రేక్షకులను మెప్పించే కథలను ఎంచుకోవడంలో నవీన్ మరోసారి తన నైపుణ్యాన్ని నిరూపించుకున్నారు. ప్రేక్షకుల ఉత్సాహాన్ని మరింత పెంచుతూ.. ఈ భారీ అంచనాలున్న చిత్రం నుండి మొదటి గీతం త్వరలో విడుదల కానుంది అని చిత్ర యూనిట్ తెలిపింది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో మారి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సంక్రాంతి కానుకగా 2026 జనవరి 14న విడుదల కానున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా విడుదలైన దీపావళి ప్రోమో ఆ అంచనాలను రెట్టింపు చేసి, అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లలో ఒకటిగా ఈ చిత్రాన్ని నిలిపింది.

## 'నాగబంధం' విడుదల ఎప్పుడంటే...!



అభిషేక్ నామా నాగబంధం-ది సీక్రెట్ ట్రెజర్ అనే పాన్‌ఇండియా పౌరాణిక సాహసం ప్రాజెక్ట్‌ని ప్రకటించారు. విరాట్ కర్ణా ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం పురాతన ఇతిహాసాలు మరియు ఆధ్యాత్మిక రహస్యాలలో పాతుకుపోయిన గ్రిప్పింగ్ ప్రయాణంలో ప్రేక్షకులను తీసుకుం టుంది. తాజాగా ఇప్పుడు లేటెస్ట్ రిపోర్ట్స్ ప్రకారం, ఈ సినిమాని మార్చి 19న ఉగాది సందర్భంగా విడుదల చేయటానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. నభా నటేష్ మరియు ఈశ్వర్య మీనన్ ఈ సినిమాలో మహిళా ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈచిత్రంలో జగపతిబాబు, జయ ప్రకాష్, మురళీ శర్మ, మరియు బి.ఎస్. అవినాష్ కీలక పాత్రలో నటిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్ సహకారంతో నిక్ స్టూడియో కింద కిషోర్ అన్నపు రెడ్డి ఈ చిత్రాన్ని గొప్ప స్థాయిలో నిర్మించారు. సౌందర్ రాజన్ ఎస్ సినిమాటోగ్రఫీ, అభే సంగీతం, కళ్యాణ్ చక్రవర్తి డైలాగ్స్, సంతోష్ కామిరెడ్డి ఎడిటింగ్. అశోక్ కుమార్ ప్రొడక్షన్ డిజైన్ చేస్తున్నారు.

# గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బుర్ర రమేష్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 22(ప్రుదయం ప్రతినిధి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బుర్ర రమేష్ గౌడ్ కు భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జీఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ గౌతమ్ రెడ్డి లు బుధవారం పరామర్శించారు హైదరాబాదులోని నర్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సన్ సిటీ (జాగిర్ బంగ్లాగూడ) లో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ అపార్ట్మెంట్ ఇంటిలో మంగళవారం అర్ధరాత్రి 11 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన అగ్నిప్రమాదం జరగడంతో సుమారు 10 తులాల బంగారం, రెండు ఏసీ లు,2 లక్షల నగదు,పెద్ద టీవీ,ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్, 2 ఫోన్స్, ఫర్నిచర్ ,వంట సామాగ్రి, బెడ్స్ లాంటివి అగ్ని ప్రమాదంలో దగ్ధం జరిగినట్లు సుమారు 25 లక్షలు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిసింది ఈ విషయంపై స్పందించిన భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ గౌడ్ ను పరామర్శించి, అగ్ని ప్రమాదం గురించి అడిగి తెలుసుకొని మనోధైర్యాన్ని కల్పించారు.

# మానసిక వైఫల్యం చెందిన వ్యక్తుల పట్ల సమాజం సహృద్భావంతో మెలగాలి

## డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య

నాగర్ కర్నూల్ అక్టోబర్ 22(ప్రుదయం ప్రతినిధి) రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్ కర్నూల్ చైర్మన్ మరియు సెక్రెటరీ ఆదేశాల మేరకు బుధవారం నాడు జిల్లాలోని బిజినాపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల నందు నిర్వహించిన నాల్సా లీగల్ సర్వీసెస్ పర్సన్స్ విత్ మెంటల్ ఇల్నెస్ అండ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజబులిటీస్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీరామ్ ఆర్య డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ హాజరై మాట్లాడుతూ మానసిక వైఫల్యం చెందిన వ్యక్తుల పట్ల సమాజం సహృద్భావంతో మెలిగి వారికి అన్ని రకాలుగా సహాయపడాలి అన్నారు మన భారతదేశంలో వికలాంగుల హక్కుల చట్టం 2016 ను భారత పార్లమెంట్ ఆమోదించింది కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టంలోని అన్ని హక్కులను అమలు చేయడం వారి బాధ్యత అని అన్నారు. వ్యక్తిగత హోదా ,గౌరవం, స్వేచ్ఛ ,సొంత నిర్ణయాలు కల్పించడానికి ఎలాంటి వివక్ష చూపరాదు. వ్యక్తులలో ఉండే తేడాలను ,వైకల్యాన్ని మనుషుల మధ్య ఉన్న తేడా మానవతాపరంగా ఉండే వైవిధ్యంలో భాగంగా చూసి అంగీకరించి గౌరవించాలని అన్నారు. వైకల్యం గల వ్యక్తుల పట్ల హింసించిన, క్రూరంగా ప్రవర్తించిన, అసభ్యంగా మాట్లాడిన, అగౌరవపరిచిన వారికి జైలు శిక్ష ఉంటుందన్నారు ప్రకృతి వైపరీత్యాల నుండి ఇతర అనుకోని ప్రమాదాల నుండి వైకల్యం గల వ్యక్తులకు ఇతర వ్యక్తులతో సమానంగా రక్షణ భద్రత కల్పించాలని వారికి ఓటు హక్కు ఉంటుంది.

వారికి సంతాన ఉత్పత్తి, కుటుంబ నియంత్రణ విషయంలో తగిన సమాచారంపై అవగాహన కల్పించాలన్నారు. వికలాంగులు తమ సమస్యల గురించి ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ 14416 కు ఫోన్ చేసి వినియోగించుకోవాలన్నారు మరే ఇతర సమస్యల సందేహాలు ఉన్న ఉచిత న్యాయ సలహాల సూచనల గురించి టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు ఫోన్ చేసి లబ్ధి పొందాలి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమతి ,ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న జీయర్ స్వామి 69వ తిరునక్షత్ర వేడుకలు



నర్సంపేట అక్టోబర్ 22 ప్రుదయం ప్రతినిధి నర్సంపేట పట్టణంలో శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి 69 తిరునక్షత్ర వేడుకలను ఘనంగా నిర్వహించినారు. శ్రీ విష్ణు పారాయణము వల్ల విజ్ఞాలు తొలగుతాయి శ్రీ చిన జీయర్ స్వామి వారి ఉద్బోధించిన జీయర్ స్వామి వారి 69వ తిరునక్షత్ర సందర్భంగా వికాస తరంగిణి నర్సంపేట బాధ్యులు బుధవారం రోజున సత్య,శారద వీరయ్య స్వగృహమందు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ స్వామి వారి మంగళశాసనాలతో జగదాచార్య చిన జీయర్ స్వామి వారి 69వ తిరు నక్షత్రోత్సవ సందర్భంగా శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం ఘనంగా నిర్వహించినారు. ప్రధాన కార్యదర్శి దాస్యం. రంగనాథ స్వామి పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి, దీపారాధన చేసి తిరునక్షత్ర తనియ విన్నపం చదివించారు. స్వామి వారు విశ్వ వ్యాప్తంగా పర్యటిస్తూ మానవ సేవే సర్వప్రాణి సేవగా నూట ఎనిమిది దివ్యదేశాలు సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రం ప్రతి సంవత్సరము అవసరం ఉన్నవారికి ఆరోగ్య శిబిరం, యువ వికాస్ ప్రజ్ఞ, సంస్కార వికాస్, ఆధ్యాత్మిక వేడుకలు మానవ సేవలో ప్రకృతిని కాపాడుకుంటూ మనవంతు సేవలో పాల్గొనాలని సంస్కృతిని కాపాడాలని శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం వల్ల విజ్ఞాలు తొలగుతాయని స్వయంగా స్వామి వారే చెప్పారని వికాస తరంగిణి జిల్లా స్థాయి డివిజన్ స్థాయి సమన్వయ కమిటీల ద్వారా ఎన్నో ఉపయుక్త కార్యక్రమాలు వారి ద్వారా చేపడుతున్నామని ఈ సందర్భంగా సత్య సకల్లం తో స్వామి వారి తిరునక్షత్రము జరుపుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో వికాస్ తరంగిణి సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబానికి బియ్యం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెద్దవంగర, అక్టోబర్ 22 (ప్రుదయం ప్రతినిధి): మండలంలోని రామచంద్రు తండా గ్రామానికి చెందిన జాటోత్ సక్రు (60) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు మృతుని కుటుంబానికి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం మృతుని కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యకర్తలకు బిఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పానుగోతు ప్రదీప్ జాటోత్ దస్రు, జాటోత్ హేమాని, జాటోత్ బొజ్జ, పానుగోతు దస్రు, గల్య,చంద్రు, చంద్రమౌళి, సక్రు, నరేష్, దేవా, బాలు, వీరన్న ,భాలాజీ, రమేష్, రఘు ,సోమన్న, రాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబాలకు సేవ చేయడమే ఎస్ఆర్ఆర్ లక్ష్యం..

## ఫౌండేషన్' చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



రాయపర్తి అక్టోబర్ 22 (ప్రుదయం ప్రతినిధి): మండలం మైలారం గ్రామంలో కోలా రాజులి కుమారునికి ఇటీవల గుండె ఆపరేషన్ అవ్వగా,అనారోగ్యంతో బాధపడుతున్న గాడిపెల్లి మైబా, చిర్ర ఎల్లయ్య భార్య ఎల్లమ్మ లను పరామర్శించి, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వయంగా సందర్శించి ఆ కుటుంబాలకు ఆర్థిక సహాయం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులుపరుపాటి శ్రీనివాస్ రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, ఫౌండేషన్ ప్రతినిధి గజావెల్లి ప్రసాద్, ఎండీ యూసఫ్ ఖాన్, మండల పార్టీ నాయకులు గారె నర్సయ్య, పెరటి యాదవ రెడ్డి, సంకినేని ఎల్లస్వామి, ఉబ్బని సింహాద్రి, గబ్బేట కొమురయ్య, గాడిపెల్లి రాములు, చిర్ర దర్గయ్య, గాడిపెల్లి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సురేందర్ రాథోడ్



రాయపర్తి, అక్టోబర్ 22(ప్రుదయం ప్రతినిధి): రాష్ట్ర మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు మండలంలోని వెంకటేశ్వర పల్లి గ్రామానికి చెందిన రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షుడు,బిఆర్ఎస్ నాయకులు భూక్యా సురేందర్ రాథోడ్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ గెలుపే లక్ష్యంగా బుధవారం మదురానగర్‌లో ఇంటి ఇంటికి తిరుగుతూ కారు గుర్తు కు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతోందని కానీ రాష్ట్రంలో ఎలాంటి సంక్షేమ పథకాలను అమలు చేయలేదని అన్నారు.జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కి బుద్ధి చెప్పి బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

# 108 102 అంబులెన్స్ ను తనిఖీ చేసిన నేషనల్ క్వాలిటీ ఆడిటర్ జి వెంకటేశ్వర్లు



గద్వాల అక్టోబర్ 22 (ప్రుదయం ప్రతినిధి) ఐజ ప్రైమరీ హెల్త్ సెంటర్ దగ్గర ఉన్న108 102 అంబులెన్స్‌ను తనిఖీ చేసిన నేషనల్ క్వాలిటీ ఆడిటర్ జి వెంకటేశ్వర్లు ఈరోజు ఐజ 108, 102 అంబులెన్స్‌లోని రికార్డులు వైద్య పరికరాలు పరిశీలించడం జరిగింది. ఆక్సిజన్ మెడికల్ ఎక్విప్మెంట్ మెడిసిన్స్ ఆన్లైన్ ఆఫ్లైన్ ఎమర్జెన్సీ డ్రగ్స్ తనిఖీ చేయడం జరిగింది ఈ సందర్భంగా ఐజ మండల ప్రజలందరూ అందుబాటులో ఉండాలని అవసరమైన ప్రజలకు ప్రథమ చికిత్స చేయాలని తక్షణమే స్పందించే తత్వం ఉండాలని ఉద్యోగులకు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది జిల్లా కోఆర్డినేటర్ డి రత్నమయ్య మాట్లాడుతూ అంబులెన్సులు 24 గంటలు అందుబాటులో

# రేషన్ దుకాణాల్లో బియ్యం పంపిణీ నిలిపివేత

## ఆందోళన చెందుతున్న వినియోగదారులు

వెల్దండ అక్టోబర్ 22( ప్రు దయం ప్రతినిధి) ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం చేపడుతుంది. ప్రతి నెల ఒకటో తారీకు నుండి 18 వరకు పంపిణీ చేసేవారు అయితే ఈనెల ఆల స్యంగా అనగా 15 నాడు బియ్యం పంపిణీ ప్రారంభించి కేవలం రెండు రోజుల్లోనే పంపిణీ చేసి ముగించారు. దీంతో వినియోగ దారులు రేషన్ షాపుల చుట్టూ బియ్యం కొరకు ప్రదక్షిణాలు చేస్తున్నారు. డీలర్లు మాత్రం తమకేం తెలవదు అధికారుల నుండి నిలిపివేయాలని ఆదేశాలు వచ్చాయని పేర్కొంటున్నారు. వినియోగదారులు ఇదేంటి అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బియ్యం పంపిణీ కొనసాగించాలని కోరుతున్నారు.

# తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి జిల్లా అధ్యక్షులుగా లొట్టి శ్రీను



నారాయణపేట టౌన్ అక్టోబర్ 22(ప్రుదయం ప్రతినిధి) తెలంగాణ బిసి ఫెడరేషన్ కులాల సమితి నారాయణపేట జిల్లా అధ్యక్షునిగా లొట్టి శ్రీను ఎంపిక అయ్యారు. తెలంగాణ బిసి ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షులు బి. దుర్గారావు నియామక పత్రం బుధవారం లొట్టి శ్రీను కు అందజేశారు. ఈ సందర్భంగా లొట్టి శ్రీను మాట్లాడుతూ 11 బిసి కులా లతో కూడుకున్న తెలంగాణ బిసి ఫెడరేషన్ కులాల సమితి జిల్లా అధ్యక్షులుగా నాపై నమ్మకం ఉంచి నన్ను నియమించినందుకు జిల్లాలో తెలంగాణ బిసి ఫెడరేషన్ కులాల సమితిని అభివృద్ధి పరచడానికి అహర్నిశలు కృషి చేస్తా నా వంతు ప్రయత్నిస్తానని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు బి. దుర్గారావు కు, ప్రధాన కార్యదర్శి కె. యుగంధర్ కు, రాష్ట్ర కార్యదర్శి నాగర్ కర్నూల్ పార్లమెంట్ కన్వీనర్ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా సమన్వయకర్త వన్నెం శంకర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# గుడుంబా పట్టివేత



జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 22 (ప్రుదయం ప్రతినిధి): నిషేధిత గుడుంబాను పట్టుకున్నట్లు మహదేవపూర్ ఎస్సై కే పవన్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహదేవపూర్ గ్రామానికి చెందిన కొక్కు అశోక్ అనే యువకుడి వద్ద నుండి 15 లీటర్ల గుడుంబాను స్వాధీనపరచుకొని అతని పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# రైతులు అధైర్య పడవద్దు


## త్వరలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు ప్రారంభం: బండారు నరసింహారావు, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్



మధిర,అక్టోబర్ 22,(ప్రుదయం ప్రతినిధి) మధిర వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు ప్రారంభమవుతుందని తెలిపారు.రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు అన్నారు. రైతులు కపాస్ కిసాన్ యాప్ డౌన్లోడ్ చేసుకొని తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.ఈసారి పత్తి కొనుగోలు తేమశాతం 8 నుంచి 12 శాతం వరకు అనుమతిస్తామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరగడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చైర్మన్ నరసింహారావు పేర్కొన్నారు. మధిర, బోనకల్, ఎర్రుపాలెం మండలాల్లో కలిపి 40,943 ఎకరాల్లో పత్తి సాగు, మొత్తం 21,830 మంది రైతులు ఉన్నారని తెలిపారు. రైతులు స్లాట్ బుక్ చేసుకొని పత్తిని మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు. బుక్ చేసి రెండు లేదా మూడు సార్లు రాకపోతే, ఆ మొబైల్ నంబర్‌ను బ్లాక్ చేస్తాం అని చైర్మన్ హెచ్చరించారు.అలాగే, ధాన్యం కొనుగోళ్లకు కూడా మూడు మండలాల్లో 42 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ధాన్యం తడవకుండా టార్పిన్లు అందుబాటులో ఉంచినట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ చంద్రశేఖర్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, పాలక మండలి సభ్యులు అయిలూరి సత్యనారాయణ రెడ్డి, కర్నాటి రామారావు, అడ్డికి రవికుమార్, తూమూలూరి రాజా, బానోత్ రమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం అంటే ఇదేకదా.!

## గుంతలో పడ్డ కుక్క పిల్లల్ని కాపాడిన రెవిన్యూ అధికారి ప్రసాద్



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో సాటి మనుషులే కష్టాల్లో ఉన్నారంటే పట్టించుకోని ఈ రోజుల్లో ఆ అధికారి చేసిన పని చూస్తే మానవత్వం ఇంకా బతికే ఉంది అనిపిస్తోంది. తమ కళ్ల ముందు ప్రమాదంలో చిక్కుకున్న జీవుల ప్రాణాలు కాపాడారు. ఆ అధికారి.ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా కుక్కకాటుకు ప్రాణాలు కోల్పోతున్నారని, గాయాల పాలవుతున్నారని తరచుగా వార్తలు వింటున్నాం.. కానీ ఆ కుక్కల పట్లనే ఈ అధికారి తమ మానవత్వం చాటారు. తనకు ఏమైనా హాని చేస్తుందేమోనని భయపడకుండా ఆ మూగజంతువులను రక్షించారు.వివరాలు ఇలా ఉన్నాయి మండల కేంద్రంలో తహసీల్దార్,ఎంపీడీవో కార్యాలయాల నూతనంగా నిర్మిస్తున్న క్రమంలో పిల్లర్ల కోసం గుంతలు తీశారు.అయితేపూరా వెళ్లిన రెండు కుక్క పిల్లలు గుంతలో పడిపోయాయి.అది గమనించిన రెవిన్యూ సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వర్తిస్తున్న ప్రసాద్ మానవత్వం చాటి గుంతలోకి దిగి కుక్క పిల్లల్ని కాపాడి బయటకు తీసుకు వచ్చారు.అధికారి చేసిన సాహసాన్ని స్థానికులు మెచ్చుకుంటున్నారు.మూగజీవాల పట్ల ఆయనకు ఉన్న ప్రేమను అందరూ అభినందించారు.

# శ్రీ కురుమూర్తి స్వామి వారి బ్రహ్మోత్సవాలకు వివిధ శాఖల ద్వారా భక్తులకు ఇబ్బంది జరగకుండా ఏర్పాట్లు జిల్లా కలెక్టర్



మహబూబ్ నగర్ 22 అక్టోబర్ ప్రుదయం (ప్రతి నిధి)

అక్టోబర్ 22 నుండి నవంబర్ 7 వరకు నిర్వహించనున్న శ్రీ కురుమూర్తి స్వామి వారి బ్రహ్మోత్సవాలకు వివిధ శాఖల ద్వారా భక్తులకు ఇబ్బంది జరగకుండా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై బుధవారం చిన్నచింతకుంట మండలం, అమ్మాపూర్ గ్రామ సమీపంలో శ్రీ కురుమూర్తి స్వామి దేవాలయ ఆవరణలో వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సమీక్షించారు. సమావేశంలో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్,ఆర్&బి, ఇంజినీరింగ్ శాఖలు,మిషన్ భగీరథ,పంచాయతీ,విద్యుత్,పశు సంవర్ధక రెవెన్యూ శాఖ,పోలీస్,వైద్య ఆరోగ్య శాఖ,అగ్నిమాపక శాఖ అధికారులతో ఆయా శాఖలు చేపట్టిన పనులపై సమీక్షించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా టాయిలెట్లు,త్రాగు నీరు,పారిశుద్ధ్యం నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్ లో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి ఎటువంటి సమస్య లేకుండా చూడాలని అన్నారు.ఆర్&బి శాఖ దేవాలయం వద్ద బారికేడ్స్,కోనేరు,రోడ్ల ప్యాచ్ వర్క్ ఉంటే పూర్తి చేయాలని ఆదేశించారు ఎక్సైజ్ శాఖ డ్రగ్స్,గంజాయి లేకుండా తనిఖీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.నాన్ వెజ్ దుకాణాల వద్ద ఫ్లెక్సీ కవర్లు, డస్ట్ బిన్ లు ఏర్పాటు చేసి జంతు వ్యర్థాలు వేయాలని సూచించారు. విద్యుత్ సరఫరా కు అంతరాయం లేకుండా చూడాలని ఎస్.పి.డి. సి .ఎల్ అధికారులను ఆదేశించారు.పోలీస్ శాఖ ద్వారా బందోబస్తు,ట్రాఫిక్ నియంత్రణ,ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు.దేవాలయం త్రాగు నీరు, టాయిలెట్లు, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసిన చోటికి దారి చూపుతూ భక్తులకు తెలిసేలా సైనేజ్ బోర్డు లు ఏర్పాటు చేయాలని దేవస్థాన ఈ.ఓ.ను ఆదేశించారు. లైటింగ్ ఏర్పాట్లు కూడా చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఉద్దాల రోజున పెద్ద సంఖ్యలో లక్షల మంది వచ్చే అవకాశం ఉందని అందుకు అధికారులు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని అన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం పై శ్రద్ధ వహించాలని అన్నారు.9 లక్షల 9 వేల రూపాయల వ్యయం తో గ్రామాల నుండి దేవాలయం కు వెళ్లే 11 లింక్ రోడ్లు పంచాయతీ రాజ్ శాఖ రెండు రోజుల్లోపూర్తి చేయాలని ఆదేశించారు. కోనేరులో నీటిని ఎప్పటికప్పుడు శుభ్ర పరిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ 24 7 మెడికల్ క్యాంప్ లు ఏర్పాటు చేయాలని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్,ఆర్.డి.ఓ,డి.ఎస్.పిలు బ్రహ్మోత్సవాలు పర్యవేక్షణ చేయాలని సూచించారు.అగ్నిమాపక శాఖ అగ్ని మాపక వాహనం ఏర్పాటు చేయాలని సూచించారు. దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పేరు తిరుపతిగా పేరు గాంచిన కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలలో సామాన్య భక్తులకు ప్రాధాన్యత నిస్తూ స్వామి దర్శనం లభించేలా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆర్.టి.సి.అధికారులు దేవస్థానానికి ముఖ్యంగా వారాంతం శని,ఆదివారం రోజుల్లో బస్సులు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఆర్. టి సి. బస్సులు ఆగే ప్రాంతంలో భక్తులకు ఇబ్బంది లేకుండా లైటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు.ఘాట్ రోడ్డు పనులు వచ్చే బ్రహ్మోత్సవాల వరకు పూర్తి చేస్తామని తెలిపారు.జాతర లో దొంగ తనాలు, చైన్ స్నాచింగ్ లు జరగకుండా పోలీస్ శాఖ తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా అక్టోబర్ 28 న ఉద్దాల ఉత్సవం రోజున విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు.జిల్లా అధికారులు దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ లో విధుల నిర్వహిస్తున్న సిబ్బంది పర్యవేక్షణ చేయాలని సూచించారు.ఎక్సైజ్ అధికారులు డ్రగ్స్ కట్టడికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్.పి.డి.జానకి మాట్లాడుతూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ద్వారా అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,అదనపు ఎస్.పి. ఎన్.బి.రత్నం, డి.ఎస్.పి.వెంకటేశ్వర్లు, దేవాలయ కమిటీ చైర్మన్, గోవర్ధన్ రెడ్డి,దేవాలయ కార్యనిర్వహణ అధికారి మదనేశ్వర్ రెడ్డి,జడ్.పి.సి.ఈ.ఓ వెంకట రెడ్డి,ఆర్.డి.ఓ నవీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ కథలప్ప, తదితరులు పాల్గొన్నారు.

# ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం




అనంతగిరి అక్టోబర్ 22 :మండల పరిధిలోని పలుగ్రామాల్లో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ హిమబిందు,ఎంపీడీఓ హరిసింగ్,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మునుకు శ్రీనివాసరెడ్డి తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారుల చేతిలో మోస పోకుండా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ, సొసైటీ ల ద్వారా సెంటర్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ధాన్యంలో తేమశాతం 17 కి మించకుండా ఉండాలని,బాగా ఎండబెట్టి తాలు మట్టి లేకుండా ఉండే విధంగా చూడాలని, తూకం వేసి ఆన్లైన్ లో అప్లోడ్ కాగానే 24 గంటల్లో రైతు ఖాతాల్లో డబ్బులు జమచేస్తారని తెలిపారు. ఎ గ్రేడ్ మద్దతు ధర 2389 రూపాయలు, సాధారణ రకం 2369 రూపాయలు, సన్నరకం ధాన్యంకు అదనంగా బోనస్ 500 రూపాయలు ఇస్తారని తహసీల్దార్, ఎంపీడీఓలు తెలిపారు.అనంతరం మునుకు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతల అభ్యున్నతికి పాటు పడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎం సతీష్, ఏఈఓ సౌజన్య,మాజీ ఎంపీపీ చుండూరు వెంకటేశ్వరరావు, నాయకులు బుర్ర పుల్లారెడ్డి, గుంటుకు గోపాల్ రెడ్డి, భానోత్ బాబునాయక్, దా.ముత్తి నేని కోటేశ్వరరావు,దేగ కొండయ్య,రాపూడ రెడ్డి,అనిల్ రెడ్డి, వేముపల్లి చిన్న వెంకయ్య, వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాగుంట వెంకటేశ్వర స్వామి అలివేలు మంగమ్మ కొత్త గుడి నిర్మాణానికి 2 లక్షలు విరాళం

గద్వాల అక్టోబర్ 22 (ప్రుదయం ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా శ్రీ పాగుంట వెంకటేశ్వర స్వామి అలివేలు మంగమ్మ కొత్త గుడి నిర్మాణానికి 2 లక్షల రూపాయల విరాళం అందజేశారు రమ్య ఇండస్ట్రీ అధినేత కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండ్ల శ్రీదేవి రాజశేఖర్ రెడ్డి దంపతులు. జోగులాంబ గద్వాల జిల్లా, కేటి దొడ్డి మండలం, శ్రీ పాగుంట వెంకటేశ్వర స్వామి ఆలయంలో అలివేలు మంగమ్మ కొత్త గుడి నిర్మాణానికి 2,00,000/- లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు రమ్య ఇండస్ట్రీ అధినేత కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండ్ల శ్రీదేవి బండ్ల రాజశేఖర్ రెడ్డి దంపతులు విరాళం ఇవ్వడం జరిగినది. అందు లో భాగంగానే బుధవారం రోజు శ్రీ పాగుంట వెంకటేశ్వర స్వామి ఆలయంలో అలివేలు మంగమ్మ కొత్తగుడికి శంకుస్థాపన చేయడం జరిగింది.


# అన్యాయానికి ప్రతీకారం తీర్చుకున్న భారత్

**న్యూఢిల్లీ :** భారతదేశం.. ఆపరేషన్ సిందూర్ ద్వారా ధర్మాన్ని పాటించడమే కాకుండా ప్రతీకారం సైతం తీర్చుకుందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. శక్తి, ఉత్సాహం నిండిన ఈ పండగ వేళ.. దేశ పౌరులందరికి ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం దేశ పౌరులను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ లేఖ రాశారు. ఆయోధ్యలో రామాలయం నిర్మించిన తర్వాత జరుగుతున్న రెండో దీపావళి వేడుకలు ఇవి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ధర్మాన్ని నిలబెట్టాలని శ్రీరాముడు మనకు బోధించారని.. అలాగే అన్యాయాన్ని ఎదరించడానికి ధైర్యాన్ని సైతం ఇచ్చారని చెప్పారు. అందుకు ఈ ఏడాది మేలో జరిగిన ఆపరేషన్ సిందూరు ద్వారా ఇది నిరూపితమైందని ప్రధాని మోదీ వివరించారు. అదీకాక ఈ దీపావళి వేళ దేశంలోని మారు మూల జిల్లాల్లో సైతం దీపాలు వెలిగించి పండగ చేసుకున్నారని పేర్కొన్నారు. దేశంలో నక్సలిజం, మావోయిస్టులను దాదాపుగా నిర్మూలించామని.. అందువల్లే ఇది సాధ్యమైందని వివరించారు. చాలా మంది మాజీ తీవ్రవాదులు జనజీవన స్రవంతిలో కలిసి.. రాజ్యాంగంపై నమ్మకంతో అభివృద్ధికి దోహదపడుతున్నారని చెప్పారు. దసరా నవరాత్రులు ప్రారంభ వేళ.. జీఎస్టీ ధరలను భారీగా తగ్గించామన్నారు. ఇదంతా భవిష్యత్తు తరం కోసం సంస్కరణలలో భాగంగా వీటిని చేపట్టామన్నారు. ఈ సంస్కరణల కారణంగా దేశంలోని పౌరులకు రూ. వేల కోట్లు ఆదా చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. అంతే కాకుండా ఈ నిర్ణయం జీవితాన్ని సులభతరం చేయడంతోపాటు ఆర్థిక వృద్ధిని పెంచుతుందన్నారు. ఒక భారత్, ఉత్తమ భారత్ స్ఫూర్తిని నిలబెట్టడం కోసం స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధాని మోదీ విజ్ఞప్తి చేశారు. అన్ని భాషల పట్ల గౌరవం పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే ఆరోగ్యంపై అవగాహన సైతం కల్పించుకోవాలని కోరారు.



# వచ్చే ఏడాది నాటికి మావోయిజం అంతం

**న్యూఢిల్లీ :** దేశంలో మావోయిజంపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిజాన్ని దేశం నుంచి పూర్తిగా నిర్మూలిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఈరోజు ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. భద్రతా బలగాల సమష్టి కృషితో గత కొన్నేళ్లుగా మంచి ఫలితాలు వస్తున్నాయని రాజ్‌నాథ్ తెలిపారు. ఈ ఏడాది కూడా పలువురు అగ్రశ్రేణి నక్సలైట్లను మట్టుబెట్టినట్లు వెల్లడించారు. మావోయిజం ప్రభావిత జిల్లాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిందని, మిగిలిన కొన్ని ప్రాంతాలను కూడా వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిస్థాయిలో మావోయిస్టు రహితంగా మారుస్తామని ఆయన స్పష్టం చేశారు. "ఈ సమస్య జాడలు కూడా లేకుండా పోతాయని దేశం మొత్తం నమ్మకంతో ఉంది" అని ఆయన అన్నారు.ఒకప్పుడు ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో మావోయిజం పెను సమస్యగా ఉండేదని గుర్తుచేశారు. కానీ, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, ఒకప్పుడు నక్సలైట్ల హింసతో వణికిపోయిన ప్రాంతాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోందని వివరించారు. "గతంలో రెడ్ కారిడార్లుగా పేరుపొందిన ప్రాంతాలు ఇప్పుడు గ్రోత్ కారిడార్లుగా రూపాంతరం చెందుతున్నాయి" అని ఆయన పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రులు, రహదారులు వంటి మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు.ఢిల్లీలోని జాతీయ పోలీసు స్మారక చిహ్నం వద్ద జరిగిన పోలీసు సంస్మరణ దినోత్సవంలో రాజ్‌నాథ్ పాల్గొన్నారు. 1959లో లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద చైనా సైనికుల దాడిలో ప్రాణాలు అర్పించిన 10 మంది పోలీసుల త్యాగాన్ని స్మరించుకుంటూ ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మావోయిజాన్ని అంతం చేయడంలో పోలీస్, సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, స్థానిక యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తున్న తీరు ప్రశంసనీయమని కొనియాడారు. వారి అవిశ్రాంత కృషి వల్లే ఈ సమస్య చరిత్రగా మిగిలిపోతోందని అన్నారు.ప్రధాని మోదీ నాయకత్వంలో పోలీసు బలగాల ఆధునికీకరణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాజ్‌నాథ్ తెలిపారు. వారికి అత్యాధునిక ఆయుధాలు, డ్రోన్లు, నిఘా వ్యవస్థలు, ఫోరెన్సిక్ ల్యాబ్‌ల వంటి సాంకేతికతను అందిస్తున్నామని చెప్పారు. బలమైన పోలీసు వ్యవస్థతోనే బలమైన దేశ నిర్మాణం సాధ్యమని ఆయన పేర్కొన్నారు.




# ఎన్డీఏ గెలిస్తే.. బిహార్ సీఎం ఎవరు?

బిహార్ శాసనసభ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతోంది. మొదటి దశ పోలింగ్‌కు సరిగ్గా 15 రోజుల సమయం మాత్రమే ఉంది. ప్రధాన కూటములు ఎన్డీఏ, మహాఘట్‌బంధన్ గెలుపు వ్యూహాల్లో మునిగితేలుతున్నాయి. ఒకవేళ ఎన్డీఏ గెలిస్తే ముఖ్యమంత్రి పీఠం ఎవరు అధిష్టిస్తారనే అనుమానం తాజాగా మొదలయింది. బిహార్‌కు అత్యధిక కాలం సీఎంగా సేవలు అందించిన 74 ఏళ్ల నితీశ్ కుమార్‌కు మరో చాన్స్ ఉంటుందా, లేదా అనే చర్చ నడుస్తోంది. నితీశ్ మద్దతుదారులు మాత్రం ఆయనే మళ్లీ సీఎం అంటూ కాన్ఫిడెంట్‌గా చెబుతున్నారు. తాజా ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి గెలిస్తే, ఎవరు సీఎం అవుతారనే దానిపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలతో నితీశ్ భవితవ్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక టీవీ షోలో అమిత్ షా మాట్లాడుతూ.. "నితీష్ మా ఎన్నికల ప్రచారానికి నాయకత్వం వహిస్తారు. ఎన్డీఏ కూటమిలోని భాగస్వామ్య పార్టీల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు ముందుగా తమ తమ పార్టీ నాయకులను ఎన్నుకుంటారు. తర్వాత వారు కలిసి కూర్చుని తదుపరి ప్రభుత్వానికి ఎవరు నాయకత్వం వహించాలో నిర్ణయిస్తారు" అని అన్నారు.

### నితీశ్‌కు బీజేపీ ధోకా

అమిత్ షా వ్యాఖ్యలను ప్రతిపక్షాలు తమకు అనుకూలంగా మార్చుకున్నాయి. నితీశ్ కుమార్‌కు బీజేపీ ధోకా ఇవ్వడం ఖాయమన్నట్టుగా ప్రచారం మొదలు పెట్టాయి. నితీశ్ మరోసారి సీఎం కాలేరని అమిత్ షా స్పష్టంగా చెప్పారని పేర్కొంటూ కాంగ్రెస్ పార్టీ ఎక్స్ లో ఓ వీడియో పోస్ట్ చేసింది. కాంగ్రెస్ మాటలను నమ్మవద్దని ఎక్స్‌లో బీజేపీ వీడియో షేర్ చేసింది. అమిత్ షా మాటలను కాంగ్రెస్ పార్టీ వక్రీకరించిందని, స్వప్రయోజనాల కోసం బిహార్ ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని కమలనాథులు కౌంటర్ ఇచ్చారు.



### షాకు చిరాగ్ మద్దతు!

అమిత్ షాకు మద్దతుగా బీజేపీ కీలక మిత్రుడు, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ మాట్లాడడం ఆశ్చర్యం కలిగిస్తోంది. "ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రిని ఎన్నుకునే సాధారణ ప్రక్రియ గురించి అమిత్ షా ప్రస్తావిం చారు. ఐదు పార్టీలతో కూడిన మా కూటమిలో గెలిచిన ఎమ్మెల్యేలు తమ నాయకుడిని ఎన్నుకుంటారు. ఈ ప్రక్రియను గౌరవించాలి" అని అన్నారు. కాగా, సీట్ల పంపిణీ వ్యవహారంలో చిరాగ్ గట్టిగా పట్టుబట్టి లోక్ జన్ శక్తి పార్టీకి 29 సీట్లు సాధించుకున్న సంగతి తెలిసిందే.

### ముందే ప్రకటించాలి

హిందుస్తానీ అవామ్ మోర్చా వ్యవస్థాపక అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంఝీ మాత్రం భిన్నంగా మాట్లాడారు. కూటమిలో క్లారిటీ, యునిటీ కోసం ముఖ్యమంత్రి అభ్యర్థిని ఎన్నికలకు ముందే ప్రకటించాలన్నారు. ఎన్డీఏ ముఖ్యమంత్రి నితీశ్ కుమారే అంటూ రాష్ట్రీయ లోక్‌మంచ్ ?? జాతీయ అధ్యక్షుడు ఉపేంద్ర కుష్వాహా ప్రకటించారు. నితీశ్ నాయకత్వంలో ఎన్నికల్లో గెలుస్తామని, మళ్లీ అధికారంలోకి వస్తామని మీడియాతో అన్నారు.

### పీకే జోస్యం ఫలిస్తుందా?

నితీశ్ కుమార్‌కు ఈసారి అధికార యోగం లేదని జన్ సురాజ్ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ చెబుతూ వస్తున్నారు. జేడీయూకి పరాభవం తప్పదని, 25 సీట్లు కూడా రావని ఆయన అంటున్నారు. శారీరకంగా అలసిపోయి, మానసికంగా బలహీనపడిన నితీశ్ కుమార్ రాష్ట్రాన్ని సమర్థవంతంగా నడిపించలేరని పేర్కొన్నారు. జేడీయూ సంప్రదాయ ఓట్లకు జన్ సురాజ్ పార్టీ గండి కొడుతుందని ప్రశాంత్ కిశోర్ అంచనా వేస్తున్నారు.

### నల్లేరు మీద నడక కాదు

బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ఎన్డీఏ ఫేస్‌గా నితీశ్ కుమార్ ప్రస్తుతం ఉన్నప్పటికీ తర్వాత పరిస్థితుల గురించి అమిత్ షా సూచనప్రాయంగా వెల్లడించడంతో చర్చ మొదలైంది. ఒకవేళ ఎన్డీఏ కూటమి మెజారిటీ స్థానాలు సాధించి, జేడీయూకు తక్కువ సీట్లు వస్తే నితీశ్‌కు సీఎం పదవి కట్టబెడతారా, లేదా అనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నవంబర్ 14న వెలువడే ఎన్నికల ఫలితాలపై నితీశ్ భవితవ్యం ఆధారపడి ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# ఈ పండుగ సీజన్‌లో రికార్డు అమ్మకాలు..
# చరిత్ర సృష్టించిన భారత రిటైల్ మార్కెట్

**న్యూఢిల్లీ :** ఈ ఏడాది దసరా, దీపావళి పండగ సీజన్‌లో భారత రిటైల్ మార్కెట్ సరికొత్త చరిత్ర సృష్టించింది. దేశవ్యాప్తంగా వస్తువులు, సేవల రూపంలో కలిపి ఏకంగా రూ.6 లక్షల కోట్లకు పైగా వ్యాపారం జరిగినట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి. దేశ రిటైల్ చరిత్రలోనే ఒక పండగ సీజన్‌లో ఈ స్థాయిలో టర్నోవర్ నమోదు కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) పరిశోధన విభాగమైన సీఏఐటీ రీసెర్చ్ అండ్ ట్రేడ్ డెవలప్‌మెంట్ సొసైటీ మంగళవారం ఈ వివరాలను విడుదల చేసింది. ఈ ఏడాది నవరాత్రుల నుంచి దీపావళి వరకు జరి గిన మొత్తం వ్యాపారం సుమారు రూ.6.05 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ఇందులో వస్తువుల అమ్మకాలు రూ.5.40 లక్షల కోట్లు కాగా, సేవల రంగంలో మరో రూ.65,000 కోట్ల వ్యాపారం జరిగింది. గతేడాది ఇదే సమయంలో నమోదైన రూ.4.25 లక్షల కోట్ల అమ్మకాలతో పోలిస్తే ఇది ఏకంగా 25 శాతం అధికం.పలు కీలక వస్తువులపై జీఎస్టీ రేట్లు తగ్గించడం ఈ భారీ అమ్మకాల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచింది. స్వీట్లు, గృహాలంకరణ వస్తువులు, రెడీమేడ్ దుస్తులు, పాదరక్షలు వంటి వాటిపై పన్నుల భారం తగ్గడంతో ధరలు అందుబాటులోకి వచ్చాయని, వినియోగదారుల నుంచి కొనుగోలు శక్తి పెరిగిందని సర్వేలో తేలింది. జీఎస్టీ తగ్గింపు వల్లే తమ అమ్మకాలు పెరిగాయని సర్వేలో పాల్గొన్న 72 శాతం మంది వ్యాపారులు అభిప్రాయపడ్డారు.పండగ సీజన్ సృష్టించిన ఈ జోష్‌తో లాజిస్టిక్స్, రవాణా, ప్యాకేజింగ్, డెలివరీ వంటి రంగాల్లో దేశవ్యాప్తంగా సుమారు 50 లక్షల మందికి తాత్కాలిక ఉపాధి లభించినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇక, మొత్తం అమ్మకాల్లో దాదాపు 85 శాతం వాటా రిటైల్ మార్కెట్ ద్వారానే జరగడం విశేషం. గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాల నుంచి కూడా కొనుగోళ్ల మద్దతు లభించింది. మొత్తం అమ్మకాల్లో ఈ ప్రాంతాల వాటా 28 శాతంగా ఉంది."ప్రధాని నరేంద్ర మోదీ దార్శనిక నాయక త్వంలో ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో 2025 దీపావళి ఒక మైలురాయిగా నిలిచింది" అని సీఏఐటీ ఒక ప్రకటనలో పేర్కొంది. సంప్రదాయం, సాంకేతికత, భారతీయ వాణిజ్యంపై నమ్మకానికి ఈ విజయం ప్రతీక అని వ్యాఖ్యానించింది.



## మల్లోజులకు వార్నింగ్

**న్యూఢిల్లీ :** ఇటీవల జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్టు నేతలు మల్లోజుల వేణుగోపాల్, ఆశన్నలకు మావోయిస్టు పార్టీ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. వారిని క్షమించేది లేదని, కఠినంగా శిక్షించి తీరుతామని స్పష్టం చేసింది. ఇదే సమయంలో, ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈ నెల 24న దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిస్తూ మరో ప్రకటన విడుదల చేసింది.ఈ మేరకు మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరిట ఓ లేఖ విడుదలైంది. పార్టీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వేణుగోపాల్, ఆశన్నలు తీవ్రమైన నమ్మక ద్రోహానికి పాల్పడ్డారని ఆ లేఖలో ఆరోపించారు. "విప్లవోద్యమానికి ద్రోహం చేసిన మల్లోజుల, ఆశన్నలకు అమరుల సాక్షిగా శిక్ష తప్పదని శపథం చేస్తున్నాం. వారి చర్యలను పార్టీ తీవ్రంగా పరిగణిస్తోంది" అని లేఖలో పేర్కొన్నారు. ఈ కుట్ర 'ఆపరేషన్ కగార్'తో మొదలైందని వారు ఆరోపించారు. మరోవైపు, మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో మరో లేఖ విడుదలైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ల ప్రయోజనాల కోసం 'ఆపరేషన్ కగార్' పేరుతో యుద్ధం చేస్తున్నాయని, మావోయిస్టులను హత్య చేస్తున్నా యని ఆ లేఖలో విమర్శించారు. ప్రభుత్వ చర్యలకు నిరసనగా ఈ నెల 23 వరకు దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని, 24వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయా లని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు నిర్మించాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

## వారంలోగా ఆ పని పూర్తిచేయండి..
## అధికారులకు కర్ణాటక సీఎం ఆదేశాలు




బెంగళూరులో రోడ్ల దుస్థితి గురించి, ట్రాఫిక్ సమస్యల గురించి కొంతకాలంగా కర్ణాటక సర్కారుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బయోకాన్ ఛైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్‌వో మోహన్‌దాస్ వంటి ప్రముఖులు ఈ సమస్యలను లేవనెత్తారు. ఈ నేపథ్యంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వారం రోజుల లోగా బెంగళూరు రోడ్లపై ఉన్న అన్ని గుంతలను పూడ్చేయాలని సీఎం ఆదేశించారు. నగరంలోని ఐదు కార్పొరేషన్ల పరిధిలోని గుంతల మరమ్మతులకు అక్టోబర్ 31 వరకు గడువు ఇస్తున్నట్లు తెలిపారు. గాంధీనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో వైట్ టాపింగ్ సహా రోడ్ల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం సిద్ధరామయ్య ఈ వ్యాఖ్యలు చేశారు. బెంగళూరు రోడ్ల సమస్యలపై గ్రేటర్ బెంగళూరు అథారిటీ చీఫ్ కమిషనర్ మహేశ్వర్ రావు, ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి, పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్ తుషార్ గిరినాథ్ సహా తదితర అధికారులతో చర్చించినట్లు సీఎం తెలిపారు. అయితే ఈ ఏడాది ఎక్కువ వర్షాలు పడడంవల్ల రోడ్లపై పడిన గుంతలను పూడ్చడం ఆలస్యమయ్యిందని పేర్కొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు కొనసాగుతున్నాయని, వైట్ టాపింగ్ చేయడంవల్ల రోడ్లు 25 నుంచి 30 ఏళ్లపాటు మన్నికగా ఉంటున్నాయని తెలిపారు.

## జస్టిస్ యశ్వంత్ వర్మ కేసు..
## కన్సల్టెంట్‌గా అడ్వొకేట్ ఉమేష్ సాల్వి



**న్యూఢిల్లీ:** జస్టిస్ యశ్వంత్ వర్మ నోట్ల కట్టల వివాదంలో భాగంగా ఆ కేసును విచారించే జడ్జిల కమిటీకి సహాయం చేయడానికి న్యాయవాది కరణ్ ఉమేష్ సాల్వే కన్సల్టెంట్‌గా నియమితుల య్యారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా.. ఉమేష్ సాల్వేని కన్సల్టెంట్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. జస్టిస్ వర్మపై అభిశంసన ప్రక్రియలను ప్రారంభించడానికి లోక్‌సభలో మద్దతు ఇచ్చిన తీర్మానం తర్వాత ఈ కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా తాజాగా సదర కమిటీకి న్యాయ సహాయం అందించడానికి కరణ్ ఉమేష్ సాల్వేని కన్సల్టెంట్‌గా నియమించారు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా. జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసించాలన్న ప్రతిపాదనపై ఆగస్టు నెలలో జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో 146 మంది ఎంపీలు సంతకాలు చేశారు. దీనిలో భాగంగా ముగ్గురు సభ్యులతో కూడిన జడ్జిల ప్యానల్‌ను నియమించగా, తాజాగా కరణ్ ఉమేవ్ సాల్వేని కన్సల్టెంట్‌గా నియమించారు. ఈ కమిటీలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరవింద్ కుమార్, మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మదన్ మోహన్ శ్రీవాస్తవ్, సీనియర్ న్యాయవాది బి.వి. ఆచార్యులు సభ్యులుగా ఉన్నారు.

## విభేదాల వేళ సీఎం,
## డిప్యూటీ సీఎంను కలిసిన కిరణ్ మజుందార్



**బెంగళూరు:** మెట్రోపాలిటన్ సిటీ బెంగళూరులో రోడ్ల దుస్థితిపై ఇటీవల కాలంలో కర్ణాటకలో రాజకీయ దుమారం రేగింది. బయోకాన్ లిమిటెడ్ వ్యవస్థాపకురాలు కిరణ్ మజుందార్ షా ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మధ్య మాటల యుద్ధం కూడా చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకేను కిరణ్ మజుందార్ మంగళవారం ఉదయం వారి నివాసాలకు వెళ్లి కలుసుకున్నారు. తమ మేనల్లుడి వివాహానికి హాజరు కావాల్సిందిగా ఉభయులనూ ఆహ్వానించినట్టు తెలిసింది. కాగా, తమ మధ్య సమావేశంపై డీకే సామాజిక మాధ్యమం ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. బెంగళూరు పురోగతి, సృజనాత్మక, రాష్ట్ర అభివృద్ధి మార్గాలపై తాము చర్చించినట్టు ఆయన తెలిపారు.

మాటల యుద్ధం

కొద్ది రోజులుగా బెంగళూరు రోడ్ల పరిస్థితిపై కిరణ్ మజుందార్, డీకే శివకుమార్ మధ్య మాటల యుద్ధం సాగుతూ వచ్చింది. బెంగళూరు రోడ్లు, చెత్తతో తాను ఇబ్బందులు పడినట్టు ఒక విదేశీ విజిటర్ చేసిన వ్యాఖ్యలపై మజుందార్ స్పందించడం చర్చనీయాంశమైంది. సవాళ్లను ఎదుర్కొనేందుకు తాము సిద్ధమేనని, అయితే కొందరు వ్యక్తిగత ఎజెండాతో మాట్లాడుతున్నారని డీకే విమర్శలు గుప్పించారు. బీజేపీ హయాంలో ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. అయితే బీజేపీ హయాంలో కూడా తాము ఇదే ప్రశ్న వేసినట్టు మజుందార్ ఆ తర్వాత వివరణ ఇచ్చారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : **SIRIKONDA AUGUSTIN . RNI No.: APTEL/2013/52694.** E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.